ఆంధ్రపత్రిక


సచిత్రవారపత్రిక



"ఊరుదగ్గిరకి వచ్చాక—"

9-2-49 **ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY** వెల 4 అణాలు


వార్తా చిత్రాలు




జనవరి 30-వ తేదీ ఉదయం భారత ప్రధానమంత్రి పండిట్ నెహ్రూ రాజఘాట్‌లోని మహాత్ముని సమాధివద్ద పుష్పగుచ్ఛము నుంచి గాంధీజీ దివ్యస్మృతికి ప్రణామముల నర్పించిరి.



సీతానగరం ఆశ్రమంలో పట్టాభిగారు కీ॥ శే॥ డాక్టరు బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యంగారి శిలావిగ్రహమును ఆవిష్కరించిరి.



జనవరి 26-వ తేదీన భారత గవర్నర్ జనరల్ రాజగోపాలాచారిగారు 'సంస్మరణ' దినోత్సవ సందర్భంలో గొప్ప విందుచేశారు. విందుకు వచ్చిన ఉప ప్రధాని సర్దార్ పటేల్‌కు రాజగోపాలాచారిగారు స్వాగతం ఇస్తున్నారు.



విజయవాడలో గాంధీజీ సాంవత్సరిక దివసమును శివాలయం డివిజనల్ కాంగ్రెసుకమిటీవారి యాజమాన్యమున శ్రీపానుగుపాటి వెంకటనాగభూషణం, జొన్నవిత్తుల సత్యనారాయణగార్లు కర్తృత్వము నహించి శాస్త్రోక్తముగా జరుపుచున్న దృశ్యము. శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుప్రభృతులు క్రతువును వీక్షించుచున్నారు.



జనవరి 31వ తేదీన ప్రధానమంత్రి పండిట్ జవహర్లాల్ నెహ్రూ, రాజఘాట్ (గాంధీజీ సమాధివద్ద) లో సర్వోదయ ప్రదర్శనకు ప్రారంభోత్సవం జరిపిరి. ఆ ఉత్సవమునకు మంత్రులు, విదేశీరాయబారులు ఇతర ప్రముఖులు పలువురు హాజరైరి.

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా రు. 12-0-0
విడిప్రతిక అణాలు 0-4-0


ప్రతి బుధవారమున ప్రకటింపబడును

ఒరు లేయవి యొనరించిన నరవర ! యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్.(మహాభారతము)

సంపుటము 41
సంచిక 22

Founder : K, NAGESWARA RAO

సర్వధారి సంవత్సర మాఘ శుద్ధ ఏకాదశి బుధవారము



మద్రాస్ పార్కు ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన విగ్రహము.



ఆంధ్రపత్రిక

1949-వ సం॥ ఫిబ్రవరినెల 9-వ తేది బుధవారము

ఆహ్లాదకరమైన విషయము

హైదరాబాద్ సంస్థాన కాంగ్రెసువాదులు సమాధానపడిరని ఆదివారమునాడు ఢిల్లీనుండి వచ్చిన వార్త అందరికి ఆహ్లాదకరమైన విషయము. సర్దార్ పటేల్ సమక్షమున వారి సంప్రదింపులు సాగినవి. సమాధానమును సాధించుటలో ఆయనచాకచక్యము ఫలించినదనుటలో సందేహము లేదు. అయినప్పటికీ, సంస్థాన కాంగ్రెసు ఉభయవర్గనాయకులకు సమాధానేచ్ఛ లేనిది సర్దార్ పటేల్ ఎంత తంటాలు పడినను ఫలించెడిది కాదు. కాబట్టి సర్దార్ పటేల్‌తో పాటు ఉభయ కాంగ్రెసు వర్గనాయకులను అభినందింపవలసియున్నది.

స్వామీ రామానందతీర్థ, జనార్దనరావు దేశాయిగారలు సంయుక్తముగా తెలియజేసిన అంశములు చూచిన, సమాధాననిబంధనలు ఉభయపక్షములకు గౌరవప్రదముగ నున్నవి. వాటికన్నకూడ "హైదరాబాద్ ప్రజల క్షేమమునకు, దేశ క్షేమమునకు మేము సౌహార్దముతో కలిసి కాంగ్రెసు కార్యక్రమమును సాగించుట అవసరము అను నిశ్చితాభిప్రాయమునకు వచ్చితిమి." అను వారి ప్రకటన ఉత్తమోత్తమముగ నున్నది. ఈ విషయమునే ఆదినుండీ మేము నొక్కి చెప్పచూ వచ్చితిమి. స్వామీ రామానందతీర్థ అధ్యక్షతను ఒకే కాంగ్రెసుసంస్థను నడపుటకు, అంగీకరించుట అన్నిటికన్న ముఖ్య విషయము. అభిప్రాయభేదము లెన్ని ఉన్నప్పటికీ, అధికార కాంగ్రెసు సంస్థ కార్యకర్తలందు ఎన్ని లోపము లున్నప్పటికీ, పోటీ కాంగ్రెస్ అనునది స్థాపించుట మెచ్చదగిన అంశము కాదు. ఆ చర్య అసలు కాంగ్రెసుపరువు ప్రతిష్ఠలను సన్నగిలచేయుటే గాక, అనవసర క్లిష్ట స్థితిని కలుగచేయును. ఏకసంస్థానిర్వహణకు ఒప్పందము కుదిరినది కాబట్టి, ఇతర విషయములందు కూడ ఒప్పందము రాగలదనే భావింపవచ్చును. సర్దార్ పటేల్ ప్రమేయము మరొకసారి లేకయే ఆయన వచ్చుసరికి, విభేదములు సమసిపోయి ముందుకార్యక్రమమును సాగించుటకు సిద్ధపడుదురని ఆశించవచ్చును.

సంస్థానకాంగ్రెసు విభేదములు తొలగిపోవుటతో హైదరాబాద్ రాజకీయములన్నియు కుదుటపడగలవని ఆశించవచ్చును. ఈ విభేదములు చింతకు కారణమైనవి. సంపాన రాజకీయ బాధ్యతను వహించగలది కాంగ్రెసుమాత్రమే. భారతప్రభుత్వము శాంతిభద్రతలను స్థాపించుటకు పోలీసు చర్యను తీసికొనినది గాని, వాస్తవమునకు ప్రభుత్వబాధ్యతను వహించవలసినది, వహించగలది సంస్థానకాంగ్రెసు; మిలిటరీప్రభుత్వము తాత్కాలికము. సంస్థానకాంగ్రెసు పటుత్వముగ వ్యవహరించినగాని, అక్కడి కమ్యూనిస్టు ప్రమాదమును అరికట్టుటకు సాధ్యము కాదు. కాంగ్రెసువారియందలి విభేదములే కాంగ్రెసుసంస్థను బలహీనమొనర్చి, కమ్యూనిస్టుల ప్రాబల్యమునకు అవకాశము కలిపించినవి.

సంస్థానకాంగ్రెసువాదులు ఒప్పందమునకు వచ్చిరను వార్త ఎంత ఆహ్లాదకరమైనదో, నైజాము తన స్వంత భూముల యాజమాన్యమును ప్రభుత్వమునకు దత్తము చేయుటకు అంగీకరించెనను వార్త అంతకన్నకూడ ఆహ్లాదకరమైనదనీ ప్రాముఖ్యమైనదనీ చెప్పవలసియున్నది. ఈ భూముల ఆదాయము రెండు మూడు కోట్ల రూపాయలవరకు ఉండు ననీ, అంతకన్నకూడ ఎక్కువ ఆదాయము తీయవచ్చుననీ, మిలిటరీ గవర్నరు జయంతనాథచౌదరీగారు తెలిపిరి. ఆయన చెప్పినట్లు ఇతర జాగీరుదార్లు నైజాము చూపిన మార్గమును అనుసరించుటకు వెనుకాడరాదు. ఒక పథకమును తయారు చేసి, జాగీరుదారుల పరిశీలనకు అంపబడినదని, పక్షమురోజులలో వారిని సమావేశపరచి సంప్రతింపులు జరపి, అంత్యనిర్ణయములు జరపబడునని మేజర్ చౌదరీ తెలిపెను.

నైజాము తీసికొనిన ఈ నిర్ణయమునకు ఆయనను అభినందించవలసియున్నది. "కాలము మారినది కాబట్టి పరిపాలనా అవసరములను పురస్కరించుకొని" ఆయన ఈ నిర్ణయమునకు వచ్చెను. ఇతర జాగీరుదారులు కూడ ఆ సత్యమును గుర్తింపక పోరు. మిలిటరీ గవర్నరు మేజరు జనరల్ చౌదరీ చెప్పినట్లు నైజామునిర్ణయము విప్లవాత్మకమైనది. అంతేకాక, గొప్ప భూసంస్కరణ అని కూడ చెప్పవచ్చును. కమ్యూనిస్టుప్రచారమును నిరోధించుటకుకూడ ఉపకారికాగలదు.

సంస్థానములో కమ్యూనిస్టుల ప్రాబల్యము వ్యాప్తిచెందుటకు జాగీరుదార్ల విధానము కొంతవరకు కారణమైననూ, పూర్తిగా అదే కారణమని చెప్పుటకు వీలు లేదు. కమ్యూనిస్టుల ప్రాబల్యము కేవలము దుండగీండ్రతనమువల్ల ఏర్పడినది. వారి సాధన విధానములు రజాకర్ల విధానమునే అనుసరించి యున్నవి. వారు తరిమి వేసిన జాగీరుదార్ల ఆస్తులను భూములను పంపకము చేయుటలో కేవలము పిండారీవిధానము అవలంబింపబడినదని వెనుక రామానందతీర్థగారు తెలిపిన వివరములవల్ల తెలియగలదు. వారిని అణచుటలో ప్రభుత్వము, ఎట్టి చర్యను తీసికొనుటకును వెనుకాడరాదు. ప్రజలు సహకరించుటకు సందేహించరాదు. ప్రభుత్వ చర్యలు ఫలించుచున్నందుకు సంతసింపనివా రుండరు.

సోవియట్ రష్యా కొత్త విధానం

తూర్పుయూరపు దేశములయెడల ముఖ్యముగ పోలెండ్ విషయములో సోవియట్ రష్యా విధానమును విమర్శించినవారికి సమాధాన మిచ్చుచు జనరలిస్సిమో స్టాలిన్ "మా దేశముపై దురాక్రమణ జరుపువారిని జయప్రదముగ ప్రతిఘటించుటకు, మా సరిహద్దులను సంరక్షించుకొనుటకు మాకు ఇరుగుపొరుగుగ ఉన్న దేశములందు మాతో స్నేహముగ నుండు ప్రభుత్వములు ఏర్పడవలెనని వాంఛించుటలో అసహజ మేమియు లేదు" అని రెండు సంవత్సరముల క్రితము ప్రకటించెను. "ఎవరు దురాక్రమణ జరుపుదురని రష్యాభయము?" అన్న ప్రశ్నకు ఈనాటివరకు క్రెమ్లిన్ సమాధాన మిచ్చియుండలేదు. కాని తన కట్టి భయము ఉన్నట్లు, రష్యాపై దురాక్రమణ జరుపుటకు ప్రపంచమంతయు సన్నద్ధమగుచున్నట్లు, ద్వితీయసంగ్రామము ముగింపుకు రాకపూర్వమునుండియే రష్యా ప్రచారము చేయుచువచ్చెను.

ఇదేవిధముగ పాశ్చాత్యరాజ్యములును సోవియట్ రష్యాసామ్రాజ్య విస్తరణను అరికట్టవలెనని కమ్యూనిస్టు వ్యతిరేక రాజ్యముల సంఘటితపరచుచున్నవి. యుద్ధమును నివారించుటకు జరిగిన ప్రపంచ ప్రథమ సంగ్రామము తన లక్ష్యమును సాధింపలేక పోయినట్లే ఏక ప్రపంచ స్థాపనకు, నిరంకుశ నియంతృత్వ విధానమును సమూలముగ నిర్మూలించుటకు,జరిగిన ద్వితీయ ప్రపంచ సంగ్రామము,తన లక్ష్యమును పొందలేకపోయెను. ప్రపంచము రెండు వర్గములుగ విభాగమైనది. రెండు సంవత్సరముల క్రితమే సోవియట్ విదేశాంగ మంత్రి మొలటావ్ ఈ విభజనను ధృవపరచెను.

ఈ విధముగ అగ్రరాజ్యములు దాదాపు ద్వితీయసంగ్రామము పరిసమాప్తమైన నాటినుండి తృతీయ సంగ్రామమునకు సన్నద్ధమగుచుండెను. కొందరు అమెరికనులు రష్యనులు పరమాణురహస్యముచు గ్రహించుటకు పూర్వమే ఆ దేశభవిష్యత్తును నిర్ణయించివేయవలెనని బహిరంగముగ తమ ప్రభుత్వమునకు హెచ్చరికలు చేసిరి. రష్యా శాంతిప్రకటనలు చేయుచు ఆత్మరక్షణ పేరిట తన ప్రాపకప్రాంతమును వృద్ధిచేసికొనుచుండెను. ఇట్లు అగ్రరాజ్యముల మధ్య తీవ్ర అవిశ్వాసము ప్రబలినది.

ఈ యవిశ్వాసములను తొలగించుకొని యుద్ధమును పరిహరించుచు అమెరికా-రష్యాలు జాయింటుగా ఒక ప్రకటన చేయుటకు, అందువిషయమై ట్రూమన్‌తో మాస్కోలోగాని తూర్పుయూరపునందు ఏ నగరమునగాని సంప్రతింపులు జరుపుటకు తాము సిద్ధముగ నుంటిమని జనరలిస్సిమో స్టాలిన్ గతవారము ప్రకటించియుండెను. అట్టి ద్విపక్ష సంభాషణలు నిష్ప్రయోజనమని తెల్పుచూ, స్టాలిన్ వాషింగ్టన్ రానిపక్షమున అట్టి సంభాషణలు అసంభవమని అమెరికా అధ్యక్షుడు తిరస్కరించెను. ఈ తిరస్కారమును క్రెమ్లిన్ తన శాంతి ప్రచారమునకు వినియోగించుకొనుచు, ద్విపక్ష సంప్రతింపులు నిరుపయోగమైన అగ్రరాజ్యచతుష్టయ సంప్రతింపులకైనను తాము సిద్ధమేనని సూచించెను. కాని ఈ శాంతిప్రతిపాదనలను చేయుచు, ఏ రాజ్యముల సహకారమును అర్థించెనో ఆ రాజ్యములనే భారతదేశముతో సహా, సామ్రాజ్య దేశములని, ప్రజాస్వామికశక్తుల నణచివేయుటకు కుట్రలు పన్నుచుండిరని నిందించెను. నార్వేవంటి చిన్న దేశమును అట్లాంటిక్ ఒడంబడికలో చేరవలదని హెచ్చరించెను. ఫిన్లెండ్, ఇతర బాల్టిక్ రాజ్యములయెడల రష్యా అనుసరించిన విధానమును గమనించిన నార్వే, రష్యా ధృతరాష్ట్రకౌగలింతకు సమ్మతించకపోవుటలో ఆశ్చర్యము లేదు. కాని హంగరీ, చకస్లవేకియాలలో సోవియట్ ప్రభుత్వము తెచ్చిన మార్పులను గమనించిన నార్వే ప్రమాదపరిస్థితుల నికమీదట ఎదుర్కొనవలసివచ్చునని గుర్తింపవలసియుండును. అయితే నార్వే నిర్ణయము సాహసోపేతమైనదే గాక, వివేకవంతమైనదనికూడ ఋజువుచేయవలసిన బాధ్యత తమపై గలదని పాశ్చాత్య రాజ్యములు ప్రకటించినవి. ఆస్ట్రియా, పోలెండులవలె నార్వే కారాదనిమాత్రము శాంతికాములు వాంఛించుచున్నారు.

అంతర్జాతీయ రాజకీయాల్లో నూతనఘట్టం

శాంతి-సంధి-ప్రకటనకి స్టాలిన్ ఆహ్వానం, ట్రూమన్ నిరాకరణ



ప్రపంచంలో శాంతి రక్షణోద్దేశంతో, ఎన్నడూ యుద్ధానికి దిగ రని అమెరికన్ అధ్యక్షుడు ట్రూమన్‌తో కలిసి శాంతిప్రకటన చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు మార్షల్ స్టాలిన్ గత 31 వ తేదీని ఒక అమెరికన్ వార్తా సంస్థాధిపతి ప్రశ్నకు సమాధానంగా చెప్పాడు. దీని కోసమని ట్రూమన్‌ను తూర్పు యూరప్ నగరాల్లో ఎక్కడైనా సరే కలుసుకోడానికి సిద్ధంగా ఉన్నట్లు స్టాలిన్ చెప్పాడు. దీన్ని ఆహ్వానంగా భావించినా భావించకపోయినా మొత్తానికి సూచన్ని ట్రూమన్ నిరాకరించాడు.

ఆహ్వానంకాని ఈ ఆహ్వానం వల్ల అగ్రరాజ్యాల్లో కలకలం బయలుదేరింది.

ఈ ఆహ్వానం అగ్రరాజ్య రాజకీయాల్లో ఒక విధంగానూ, తదితర రాజ్యాల దేశరక్షణ వ్యవహారాల్లో మరొకవిధంగానూ నూతన ఘట్టాన్ని సూచిస్తున్నదని చెప్పవచ్చును.

అగ్రరాజ్యాలు కొన్నిమాసాలుగా సాయుధ సమీకరణ చురుగ్గా సాగిస్తున్నాయి. యుద్ధనీతి కనుగుణ్యంగా సైనిక, వైమానిక, నావిక స్థావరాలను చురుగ్గా బలపరుచుకొంటూ, కొత్త స్థావరాలు సంపాదించడానికి అమెరికా తీవ్ర యత్నాలు చేస్తోంది. మిగతా రాజ్యాల్ని కూటాలుగా చేర్చి ఆయా దేశాల దేశరక్షణ కార్యక్రమాల్ని సమీకరింపచేయడానికి యత్నిస్తోంది. నెపోలియన్, బిస్మార్క్ మొదలైనవారు కలలుగన్న ఐరోపీయ రాజ్యకూటమి పూర్తిగా కాకున్నా, ఏదో ఒకవిధంగా సమకూరే అవకాశం ఇప్పుడేర్పడింది.

పశ్చిమయూరప్ రాజ్యకూటమి నొకదాన్ని స్థాపించాలని లండన్‌లో బ్రిటిష్, ఫ్రెంచి, లగ్జెంబర్గ్, బెల్జియన్, డచ్ విదేశమంత్రులు సమావేశమై తీర్మానించారు. నార్వే, స్వీడన్, డెన్మార్క్, ఇటలీ, పోర్చుగల్, ఐర్లండ్ దేశాలను కూడా ఈ కూటమిలో చేరవలసిం దని ఆహ్వానించారు. ఈ దేశాలన్నీ దేశరక్షణకు సమిష్టికార్యక్రమం నిర్ణయించాలనీ, ఆర్థికంగా అమెరికావల్ల పొందుతున్న సహాయాన్ని సమిష్టిప్రయోజనానికి వినియోగించుకోడానికి కార్యక్రమాలు తయారు చేయాలనీ ఈ కూటమిసంస్థాపకుల ఆశయం. దీని కోసం పార్లమెంటుమాదిరి ఒక యూరోపియన్ కౌన్సిల్‌ను స్థాపించడం వీరి తక్షణయత్నం. కెనడా అమెరికాలతో చేరి ఈ దేశాలన్నీ అట్లాంటిక్ దేశాల రక్షణసంధి అనే పేరుతో (అట్లాంటిక్ డిఫెన్స్ పాక్ట్) ఒక ఒడంబడిక చేసుకోవడం తక్షణలక్ష్యం. దీని ప్రకారం అమెరికా అప్పుడే యూరప్‌దేశాల్లో ఎక్కడెక్కడ ఏయే స్థావరాలు స్థాపించాలో నిర్ణయం చేస్తోంది. లివర్‌పూల్‌ను (బ్రిటన్) బ్రహ్మాండమైన నౌకాస్థావరంగా వినియోగించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని కూడా వినవస్తున్నది.

రష్యాపై యుద్ధానికి అమెరికా ఈ రీతిగా తయారవుతుండగా, బలహీనమైన రాజ్యాలు ఒక రీతిగా ఇల్లు చక్కబెట్టుకోడానికి ప్రయత్నిస్తున్నాయి. ఒకవైపున కమ్యూనిస్టు ముప్పు, మరొకవైపున ఆర్థిక ప్రాబల్యంతో అమెరికా చూపిన అనాదరణ, ఇంకొకవైపున సామ్రాజ్యవాదుల దుస్తంత్రాలు, దోపిడి, ఇన్నిటి నెదుర్కొంటున్న ఆసియాదేశాల్లో ఐక్యభావం కలిగింది. ఆత్మగౌరవం నిలుపుకోడానికీ, సామ్రాజ్యవాదుల నరికట్టడానికీ ఆసియాదేశాలు దృఢనిశ్చయంతో ఢిల్లీలో సమావేశం జరిపాయి. అగ్రరాజ్యాల రాజకీయతంత్రాల్లో పడి నలిగిపోకుండా స్వరక్షణ కోసమై ఈదేశాలన్నీ ఒక్కటిగా నిలవాలనే భావం కలిగింది. శాశ్వతమైన ఒక ప్రాంతీయ సంస్థను స్థాపించాలనే భావం చాలామందికి తోచింది. త్వరలో అటువంటిది నిర్మించబడవచ్చును.

అమెరికా సూచనపై నార్వే, స్వీడన్, డెన్మార్కు దేశాల ప్రధాన మంత్రులు, విదేశాంగ, దేశరక్షణ శాఖల మంత్రులు ఆస్లోలో సమావేశమై ఆమూడురాజ్యాలు దేశరక్షణకు సమిష్టిగా తయారయ్యే విషయం, యూరప్ కౌన్సిల్‌లో చేరే విషయం ఆలోచించాయి. నార్వే చేరడానికి నిశ్చయించింది. స్వీడన్ అంగీకరించలేదు.

యూరప్ యుద్ధతంత్రంలో నార్వే దేశ ప్రాధాన్యం ద్వితీయ ప్రపంచ సంగ్రామంలో బోధపడినదే. నార్వే రష్యాకు అతిసమీపంలో ఉంది. 70 మైళ్ల పొడుగు రెండు దేశాలికీ సరిహద్దుంది. అమెరికా, నార్వేలో స్థావరాలు సంపాదించిందంటే రష్యాకు ప్రమాదం దగ్గరకు వచ్చినట్లే. అందువల్ల నార్వేదేశం అట్లాంటిక్ పాక్ట్ పట్ల ఎట్టి వైఖరి అవలంబించనున్నదో తెలపాలని రష్యా నిర్బంధించి అడిగింది.

దురాక్రమణోద్దేశంతో అట్లాంటిక్ పాక్ట్ తయారవడం లేదనీ, ఏ దేశమైనప్పటికీ దురాక్రమణకు దిగినట్లయితే ప్రతిఘటించగలదనీ నార్వేప్రభుత్వం రష్యాకు సమాధాన మిచ్చింది. కాని అన్యదేశాల దురాక్రమణకు భయపడే పాక్ట్‌లో చేరవలసి వస్తున్న దనికూడా తెలియపరిచింది. అయితే పాక్ట్ ప్రకారం నౌకా వైమానిక స్థావరాలను అమెరికాకు ఇవ్వడానికి అంగీకరించిం దని వదంతులు ప్రబలంగా ఉన్నాయి.

ఈ పరిస్థితిలో రష్యా నార్వేకు మరొక ఉత్తరం పంపింది. అట్లాంటిక్ పాక్ట్ దురాక్రమణోద్దేశంతో తయారుకాలే దంటే రష్యా నమ్మబోవడం లేదని ఈ ఉత్తరంలో స్పష్టపరిచింది. నార్వే ఈ పాక్ట్‌లో చేరడం, దురాక్రమణోద్దేశంతో ఒక అగ్రరాజ్యం పన్నుతున్న పన్నాగాల్లో తోడ్పడినట్లే నని రష్యా చెప్పింది. అన్యరాజ్యాలదురాక్రమణభయంగురించి నార్వేని నిక్కచ్చిగా అడిగింది. అది రష్యాకే సూచితమౌతున్నందువల్ల, ఆటువంటి భయం లేకుండా దురాక్రమణ నిషేధపు టొడంబడిక నొకదాన్ని చేసుకోవచ్చునని సూచిస్తూ, రష్యాకు అటువంటి దురుద్దేశ మేమీ లేదని ప్రకటించింది. ఇటువంటి ఒడంబడిక చేసుకోవడంగురించి నార్వేఅభిప్రాయం వెంటనే తెలపాలని అడిగింది.

నార్వే అట్లాంటిక్ పాక్ట్‌లో చేరకుండా రష్యా అనేకవిధాల యత్నించవచ్చును. చేరినా, స్వరక్షణకు గాను ఫిన్లాండు, స్వీడన్ దేశాలతో ఏ రీతిగా రష్యా వ్యవహారాలు నెరపుకుంటుందో ఇప్పుడు గమనించవలసిన విషయం.

పశ్చిమ రాజ్యకూటమితో నార్వే చేరడానికి అంగీకరించడంతో అమెరికా రష్యాల మధ్య జరుగుతున్న చదరంగపు టాటలో ఒక నూతన ఘట్టం ఆరంభమైందని చెప్పవచ్చును. బలహీన రాజ్యాల దేశరక్షణ వ్యవహారాల్లో ఇది పరీక్షా సమయం.

ఆసియాదేశాలకు కూడా అమెరికా ఆర్థిక సహాయం చెయ్యగల దని ట్రూమన్ ప్రకటించాడు. యూరప్ రాజ్యాలలో ఏ రాజ్యమైనా అట్లాంటిక్‌పాక్ట్‌లో చేరకపోతే ఆర్థికసహాయం చెయ్యబో దని అమెరికా ప్రకటించింది.

ఈ కూటాలను భగ్నంచెయ్యడానికి రష్యా ప్రయత్నిస్తోంది. ఆసియారాజ్యాల సమావేశానికి అమెరికా ప్రోద్బలమే కారణ మని రష్యా ఆరోపించింది. అమెరికా దురాక్రమణ విధానానికి ఆసియాదేశాలు తోడ్పడుతున్నాయని నిందించింది.

అగ్రరాజ్యాల కీచులాటల్లో పడి నలిగిపోతున్న యూరప్‌రాజ్యాల్లో ప్రజలు శాంతి కోసం తహతహలాడుతున్నారు. ఆర్థిక దుస్థితిలో కటకట లాడిపోతున్న ప్రజలకి అమెరికా ఆర్థికసహాయం కొరగానిదై పోయింది. జర్మనీలో పరిశ్రమాభివృద్ధికి అమెరికా ఆర్థికంగా తోడ్పడినా ప్రజల దుస్థితి తీరలేదు సరికదా, బ్రిటిష్ వారి ఎగుమతులు వీన్నివల్ల సన్నగిల్లిపోతున్నాయి.

మిగతా దేశాలకి అమెరికా ఆర్థిక సహాయం అన్నం పెట్టేది కాదు. స్థిరస్థావరాలు, నౌకా, విమానాశ్రయాలు నిర్మించి హారం వేసుకూర్చోడానికి మాత్రమే అమెరికా యత్నిస్తున్నదని ఆ దేశాలు గుర్తించాయి.

అమెరికా ఆర్థిక సహాయంలో విశ్వాసం సన్నగిల్లుతున్న రాజ్యాల్లో, రష్యాశాంతివచనం ఆ రాజ్యాలను అమెరికానుంచి విముఖులను చెయ్యగల దని రష్యాఆశ. ఈ శాంతివచనంతో యూరప్‌రాజ్యకూటాన్ని భగ్నపరచాలని యత్నం. కమ్యూనిస్టు ప్రచండాధికారంలో ఉన్న తూర్పు యూరప్‌రాజ్యాల్లో రష్యా తన ప్రభావాన్ని మరింత బలపరుచుకోవాలనికూడా ఇదొక యత్నం.

తూర్పుయూరప్ ప్రభుత్వాల్ని పడగొట్టడానికి జరుగుతున్న యత్నాల్ని కుట్రల్ని ఆయా ప్రభుత్వాలిప్పుడు బహిరంగపరుస్తున్నాయి. హంగేరీలో అమెరికన్ రాయబారితోనూ వాటికన్‌తోనూ కలిసి హంగేరీ క్రైస్తవమతాధికారి కుట్ర చేసినట్లు ప్రకటించి అతన్ని విచారణకు తెచ్చారు. విచారణలో కుట్రను మతాధికారి అంగీకరించాడు. పోలండ్‌లో పూర్వనాయకులు ప్రభుత్వాన్ని కూలద్రోయడానికి పన్నుతున్న కుట్రల్ని ప్రభుత్వం నిరోధించగలిగినట్లు ప్రకటించబడింది. ద్వితీయ ప్రపంచ సంగ్రామకాలంలో జర్మనీ పోలండును ఆక్రమించగా, లండన్ పారిపోయి అక్కడ తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నాయకులు కొందరినీ, తరువాత, జర్మన్ సైన్యాలకు విరుద్ధంగా పోరాడిన గోరిల్లా నాయకుల్నీ ఈ కుట్రసందర్భంలో అరెస్టు చేశారు.

ఈ కుట్రలో అమెరికా ప్రోద్బలం పూర్తిగా ఉన్నదని హంగేరీ విచారణలో బహిరంగ పరచబడింది. పోలండులో అరెస్టయిన నాయకుల్ని బట్టి దీనికికూడా అమెరికా ప్రోద్బలం ఉన్నట్లు ఆరోపించబడవచ్చును.

ఈ రీతిగా అమెరికాకు విరుద్ధంగా రష్యా ప్రచారం తీవ్రతర మయింది. రష్యా అమెరికా వైషమ్యాల్లో ఇది కొత్త అధ్యాయం. మధ్య రాజ్యాల రాజకీయపీడనలో ఇది పై మెట్టు.

రష్యాకు సమీపంలోగల దేశాల్లో అమెరికా తంత్రాలు పన్నడానికి వీలైన ప్రాంతం ఇప్పుడు మరొక టుంది; అది టర్కీ, తదితర మధ్య ఆసియా దేశాలు. అంటే పాలస్తీనా, ఇజ్రాయిల్ మొదలైనరాజ్యాలు టర్కీ అమెరికా మైత్రి వర్గంలోనిదే. అందువలన టర్కీ ప్రమాదం నుంచి కాపాడుకోడానికి ఇదే సమయంలో డార్డెనల్స్ సమస్యను రష్యా తిరిగి కవ్వించగల అవకాశం ఉంది. దీనితో రాజ్యకూటాల రాజకీయాల్లో ప్రధానమైన అధ్యాయం ప్రారంభ మౌతుంది. గత



ప్రపంచ సంగ్రామానికి ముందు జర్మనీ తూర్పు యూరప్ రాజ్యాలపైన, ఇటలీ అబిసీనియాపైన విరుచుకుపడిన పరిస్థితికి ప్రస్తుత పరిస్థితిని పోల్చవచ్చును.

ఇప్పుడిప్పుడే ఐక్యభావాన్ని, ఐక్యతావసరాన్ని గుర్తిస్తున్న ఆసియాదేశాల్లో రష్యాపట్ల సుముఖత తెచ్చుకోవాలనికూడా రష్యా ఆశించవచ్చును.

రష్యా 'శాంతియోచన' గాని, 'ఆహ్వానం' గాని హృదయపూర్వకమైనవి గావని బ్రిటిష్, అమెరికన్ పత్రికలు ఘోషించాయి. అమెరికా ప్రోద్బలంపైన, కొంత నిర్బంధంపైన, ఏర్పడుతున్న యూరప్‌రాజ్యకూటం భగ్నం కాకుండా కాపాడాలని వీరి తాపత్రయం.

ప్రపంచయుద్ధరాజకీయాల్లో పడి కొట్టుకుపోకుండా తటస్థంగా నిలబడ్డానికి కూడా ఈ కాలంలో ఎంతో బలం, ధైర్యం, సాహసం కావాలి.

దీనికి ప్రస్తుతపు నార్వే పరిస్థితే ప్రబల తార్కాణం. గత సంగ్రామంలో తటస్థంగా ఉండదలుచుకున్నప్పటికీ నార్వే రణరంగం కాక తప్పిందికాదు. అనుభవంవల్ల తటస్థం ఆచరణ సాధ్యం కాదని తెలుసుకుంది. అయితే రష్యాతో చేరితే అది పరిగణించవలసిన విషయంకాదు. కాని రష్యాకు అతిసమీపంలో ఉండి అట్లాంటిక్ పాక్ట్‌లో చేరడం దుస్సాహసం.

రష్యా, అమెరికాల్లో ఏపక్షంవల్లనూ ఏ ఉపకారంగాని, న్యాయం కాని చేకూరుతుం దనే ఆశ ఆసియాదేశాల్లో ఏ దేశానికీ లేదు. కాని వాని మధ్య శత్రుత్వాన్ని ఆధారం చేసుకొని లబ్ధి పొందాలని టర్కీవంటి ఏ దేశమో దుర్బుద్ధిపడినప్పటికీ కాలం గడిచి మాటలు చేతల్లో చూపించవచ్చేసరికి ఏమీ లబ్ధిఉండదని మనదేశాలు గ్రహించాయి. అందువల్లనే ఏ పక్షంలోనూ చేరకుండా భారతదేశం తటస్థంగా ఉండగల దని పండిట్ నెహ్రూ ప్రకటించాడు. కాని ఈ తటస్థాన్ని కాపాడుకోడానికైనా ఆసియారాజ్యాలమధ్య ఐక్యత సమిష్టికార్యనిర్వహణ అవసరం. దానికిప్పటికి నాంది మాత్రం జరిగింది.

పెద్దకథ :

ఆద్యంతాలు

(First & The Last)

మూలం : గాల్స్‌వర్దీ. అనుకరణ : శ్రీ జనమంచి రామకృష్ణ.

౪

తెల్లవారి లేచి కాఫీత్రాగుతూ నీలకంఠం వార్తాపత్రికలను తిరగవేస్తున్నాడు.

ఫకీర్ డి లేన్ హత్య

"గొంతునొక్కి చంపివేసిన మనిషి ఆనవాళ్లు తెలుసుకోకల్గాము. అప్పుడే ఆ సందర్భంలో ఒకరిని బంధించామకూడాను"

నీలకంఠంగుండె గతుక్కుమంది. "అనంతాన్ని బంధించారేమో! విశాలాక్షి పోలీసులతో లాలోచీ ఐందేమో? ఏమైనా అనంతం వద్దకు వెళ్లాలి. డబ్బుతెచ్చి వాడికిచ్చి పాండుచేరీ తక్షణం పారిపొమ్మని చెప్పాలి."

నీలకంఠం అనంతం ఇంటికి బయలుదేరాడు. "ఎవరో అన్యాయంగా అనుమానంమీద పోలీసు లప్పుడే బంధించా రన్నమాట. పర్వాలేదు. ఈలోపుగా అనంతం ఏదేనా దూరదేశం పారిపోవచ్చు. ఆ పిల్లనుకూడా పంపేయాలి. కాని అతనితో మాత్రం కాదు." ఇలాగ ఆలోచిస్తూ దృఢనిశ్చయంతో నీలకంఠం అనంతం గదిలో ప్రవేశించాడు. అనంతం మంచంమీద పడుకునే ఉన్నాడు. పాలిపోయిన ముఖం. విరామం లేకండా సిగరెట్లుకాల్చడంచేత పొగబారిపోయాయి కళ్లు. బిత్తరిచూపులుచూస్తూ వెర్రిగా శూన్యంలోకి చూస్తూ పడుకుని ఉన్నాడు అనంతం. ఎంత మంచివాడు! ఎట్లా చిక్కిపోయాడు!

అన్నగారు లోపలికి రావడం చూసి "అన్నయ్యా! ఏం శిక్ష విధించారు నాకు? ద్వీపాంతరవాసమా, లేక ఉరికంబమా?"

జీవితంమీద కాతరు లేనట్లుగా, ఎంత నిర్భయంగా అడుగుతున్నాడో! మూడు మూర్తులా అనంతమే! అనంతమే అంత నిర్లక్ష్యంగా అడుగగలడు.

"ఆమెను చూచేందుకు వెళ్లేనురా!"

"నువ్వు!!"

"నేను నిన్నరాత్రి......ఆమెను నమ్మవచ్చును."

అనంతం వెకిలిగా నవ్వాడు.

"అన్నయ్యా! ఆమెనుగురించి నీకు మొదటే చెప్పానుగా!"

"నాకు నమ్మకం కల్గొద్దూ. సరే కాని నువ్వు తక్షణం వెళ్ళిపోవాలి. తర్వాత, నీ వెనకాలే ఆమె వస్తుంది. మీ రిద్దరూ కలిసిమాత్రం వెళ్ళడానికి వీలుకాదు. నీ దగ్గరే మన్నాడబ్బుందా?"

"లేదన్నయ్యా!"

"నే నిస్తాలే. నీ నైనం మట్టుకు నాకే తెలియపరచాలి."

అనంతం పెద్ద నిట్టూర్పు విడిచాడు.

"అన్నయ్యా! నామీద నీకెందు కింత దయ! ఎప్పుడూ కష్టసమయాల్లో నన్ను ఆదుకుంటూనే వస్తున్నావు! ఎందుకో నాకే అర్థం కాకండా వుంది."

"ఒరేయి! వాళ్లప్పుడే అనుమానంమీద ఒకణ్ణి బంధించారు. ఇదే మంచి సమయము. నువ్వు రేపే బయల్దేరాలి."

"ఏమిటి!!" అనంతం నిశ్చేష్టుడైపోయి ఏమీ మాట్లాడలేకపోయాడు.

"ఏమిటి అన్నయ్యా! నే ననుకోలేదే! నన్ను—అపరాధిని వదిలేసి!"

"మరేం పర్వాలేదులే అనంతం! అమాయకునికెప్పుడూ అపాయం రాదు. నీకు తెలియదూ నేరస్థుని బదులు అన్నం పున్నం ఎరుగనివాణ్ణే ఎప్పుడూ మొట్టమొదట బంధిస్తారని? ... ... నువ్వు సునాయాసంగా పారిపోడానికి వ్యవధి దొరకింది."

వెర్రి ఆశ్చర్యంతో అనంతం రెప్ప వెయ్యకండా అన్నగారి ముఖంలోకి చూడడం మొదలెట్టాడు.

"ఒరేయి అనంతం చూడు! ఈ విషయాన్నిగురించి అంత చులకనగా తీసుకుంటే లాభం లేదు. నువ్వు ప్రయాణానికి సిద్ధపడు. తక్కినదంతా నేను చూస్తాను. ఇదిగో ఈ డబ్బు నీ దగ్గర ఉంచుకో. ... ... ధైర్యంగా వుండరా. నేను తిరిగి కొంత సేపట్లోనే వస్తాను. సిద్ధంగా వుండాలి సుమా!" అంటూ నీలకంఠం వెళ్ళిపోయాడు.

౫

అన్న వెళ్ళిపోయిన దారివేపే బిత్తరిచూపులు చూస్తూ అనంతం మంచంమీద కూర్చున్నాడు. "నిరపాయుడు అపాయంలో వుండడమా!" పోలీసులు బంధించిన మనిషిని గురించి అనంతం తలపోయసాగాడు. పేరు ప్రఖ్యాతులు గడించిన బారిస్టరు నీలకంఠం, మరో ప్రాణిని గురించి ఎంత చులకన చూపాడో! "అన్న సలహా ప్రకారం ఆమెతో దేశాంతరం పారిపోయి సుఖంగా జీవిస్తూంటే, అన్నం పున్నం ఎరుగని ఒక మానవుడు నేను చేసిన నేరానికి కఠిన నరకంలో పడి, నానాబాధలూ పడవలసిందేనా! న్యాయం లేదా ప్రపంచంలో!" పరి పరి విధాల అనంతం మనస్సు క్షోభ పడింది. ఏ పని చేయడానికైనా నిశ్చయపడ్డాడు. కాని నీలకంఠం వచ్చి, పారిపోవలసిందని చెప్పగానే అనంతం ఆలోచనలు పరి పరి విధాల పరువులెత్తాయి. క్రొత్త దేశం! ప్రేమించిన విశాలాక్షితో హాయిగా జీవించవచ్చును! క్రొత్త జీవితం! క్రొత్త అనుభవాలు! అనంతం ఎందుకో అన్నగారి సలహాకు చాలా సంతోషించాడు.

లేవలేక లేవలేక లేచి ఎదురుగుండా ఉన్న కాఫీహోటల్‌కి, కాఫీ త్రాగేందుకు వెళ్ళాడనంతం. బల్లమీద వార్తాపత్రిక కనుపించగానే చదవడం మొదలెట్టాడు. "ఫకీర్ డీ లేన్ హత్య కేసులో ఒక మనిషి బంధింపబడ్డాడు. అతని పేరు రంగారావు. కేసు విచారణ ఈ వేళ పది గంటలనుంచి ప్రారంభ మౌతుంది"

"రంగారావు! ..... రంగారావు! పేరే వేశారుగాని విలాసం ఏమీ లేదే!" అనంతం కోర్టుకి పరుగెత్తాడు.

కోర్టు అంతా జనంతో కిక్కిరిసి వుంది. అనంతం గావించిన హత్యా విచారణే జరుగుతూంది. సంకెళ్ళలో వణకిపోతూ ఒక బీదవాడు బోనులో నిలబడి వున్నాడు. అనంతం ఆ బీదవాణ్ణి క్రితం రాత్రే చూశాడు. ఆ ఆర్చి దగ్గర ఆ బీదవానితో మాట్లాడాడు. అనంతం జరుగుతూన్న అన్యాయానికి తట్టుకోలేకపోయాడు. ముచ్చుమటలు పోశాయి. అక్కడే ఉన్నట్లయితే ఏ నిమిషంలో తన అవస్థ చూసి పోలీసులనుమానపడి బంధిస్తారో అని భయపడ్డాడు. వెంటనే విశాలాక్షి జ్ఞాపకం వచ్చింది. వెర్రిగా, పిచ్చిగా ప్రేమించే విశాలాక్షి ఇంటికి పరుగెత్తాడు. లోపలికి వెళ్లగానే జ్యోతుల్లా వుండే కళ్ళతో తన అనంతాన్ని తనివి తీరా చూసుకుంటూ బాహువుల్లోకి తీసుకుంది. అనంతం ఆమెను దగ్గిరికి తీసుకుని సముదాయించాడు. విశాలాక్షి అతని వాలకం చూసి జాలిపడింది తినడానికి ఏదో తెచ్చిముందర పెట్టి, "చచ్చిపోవాలని అనుకుంటున్నాను! ...... నిన్నొక్క క్షణంకూడా విడిచి వుండలేను." అని చంటిపిల్లలా బొరుమని ఏడ్చింది. ఆమెను ఊరుకోపెడుతూ, "విశాలా! ఎవరినో బంధించారు తెలుసా!" అనంతం చాలాసేపు ఆమె బాహువుల్లోనే నిద్రపోయాడు.

నీలకంఠం తిరిగి తన ఇంటికి వస్తానని చెప్పి వెళ్లినసంగతి అనంతానికి హఠాత్తుగా జ్ఞాపకమొచ్చింది. లేచి యింటికి పరుగెత్తాడు. మళ్ళా ఆ బోనులో సంకెళ్లలో దీనంగా నిలబడి ఉన్న బీదవాడు జ్ఞాపక మొచ్చాడు. పిచ్చివానిలా బసచేరుకునేప్పటికి, నీలకంఠం ఎదురైనాడు.

"ఇదిగోరా డబ్బు! ఓ సంవత్సరంపాటు సరిపోతుందిగా. ఒరేయి! ఆ కోర్టు కాగితాలు చూశాను, దాంట్లో ఏమీ లేదులే! రంగారావులాంటివానికి జైల్లో వున్నా బయట వున్నా ఒకటేలే. అందుచేత, ఏదో అన్యాయం జరిగిందని నువ్వు బాధపడకు. అసలు శిక్షించడానికయినా ఆధారాలేవీ కనుపించడం లేదట. అందుచేత ప్రయాణమై పోయి హాయిగా క్రొత్త దేశంలో నువ్వూ ఆపిల్లా సుఖంగా కాలం గడపండి."

అనంతం నవ్వాడు! ఆ నవ్వులో ఏమర్థ ముందో ఎవ్వరికీ తెలియదు.

"అన్నయ్యా! ఐతే నే నిక్కణ్ణించి వెళ్లిపోయి నీ మర్యాద దక్కించాలన్నమాట...... ఇవిగో ఈ నోట్లు తీసుకో! లేకపోతే తగలపెట్టేస్తాను!

ఊఁ! వచ్చి తీసుకో!

నీలకంఠం నోట్లు తీసి జేబులో పెట్టుకున్నాడు.

"అన్నయ్యా! నాలో ఆత్మాభిమాన మింకా చచ్చిపోలేదు. నేను దొంగపాటుగా పారిపోతే? ఇది అన్యాయం కాదూ?"

"అనంతం! నువ్వు చాలా పొరబడుతున్నావు సుమా! వాడికి శిక్షపడదురా! పైగా చచ్చినమనిషిని దోచుకునే చండాలుడు జైల్లోనే వుండతగ్గవాడు. ఆమాటకొస్తే నీవు చేసిన హత్యకంటె వాడు చేసినదే చాలా హీనమైన నేరము!"

అనంతం తల పైకెత్తి!" అన్నయ్యా! తారతమ్యా లెంచకు. హృదయముండే - అది చీకటి నుయ్యి వంటిద :"

"ఐతే నువ్వేం చెయ్యబోతానంటావు? కుటుంబ మర్యాద మట్టిపాలు చేస్తానంటావా? చాలా ఆత్మాభిమానం కలవాణ్ణంటున్నావు చెప్పు, ఏమిటి నీసమాధానం?"

అనంతం తలవాల్చాడు." అన్నయ్యా! పతితుని మీదా పాశుపతాస్త్రాన్ని సంధిస్తున్నావు!"

నీలకంఠం ఏంచేయడానికీ పాలుపోక వెంటనే, మరోమాటాడకుండా వెళ్లిపోయాడు.

౬

ఒక్క వేదాంతుల్ని మినహాయిస్తే, తక్కిన మానవుల కందరికీ కుటుంబ మర్యాదన్నా, స్వాభిమాన మన్నా, ఎంతో పవిత్రంగా కనిపిస్తుంది. నీలకంఠంగురించి వేరే చెప్పవలసిందేమీ లేదు. అతను అనంతంగురించి పడుతూన్న శ్రమంతా, తన ఆబోరు నిలబెట్టకోడానికే! నీలకంఠాన్ని ప్రజ లేమని పిలుస్తారు? హంతకుని సోదరు డంటారు! నీలకంఠం తల్లి నేమని పిలుస్తారు? హంతకుని తల్లి అంటారు :

నీలకంఠం, తన తమ్ముణ్ణి చూసి, కొన్ని వారాలైంది! అనంతం ఏంచేస్తున్నాడో! ఎటువంటి నరకయాతన అనుభవిస్తున్నాడో! తప్పతాగి, ఈ ప్రపంచాన్ని మరచిపో ప్రయత్నిస్తున్నాడా? నీలకంఠంలోని భ్రాతృప్రేమ అనంతం రక్షణకై చేతులు చాచింది. తమ్ముని బసకి బైల్దేరాడు. కాని గది తలుపుకి 'అద్దెకు' అన్న బోర్డు తగిలించి వుంది. అనంతం ఏమయాడు? ఎక్కడికి పోయాడు? పాండుచెరీ పారిపోలేదు గదా? డబ్బులేదే? విశాలాక్షి? నీలకంఠం వెంటనే క్లైవు వీధులోకి వెళ్లి, విశాలాక్షి బసవైపు చూశాడు. లోపల దీపం వెలుగుతూంది. నీలకంఠం లోపల ప్రవేశించాడు. విశాలాక్షి బోర్లా పడుకునుంది. అనంతం అక్కడ లేడనుకున్నాడు నీలకంఠం. కాని ఓమూల చాపమీద అతనూ పడుకునే వున్నాడు. అనంతం ముఖంలో ఏదో తపన, హేళన, ప్రేమ, నిరాశ - అన్నీ - మూర్తీభవించాయి. నీలకంఠం వారిని పల్కరించకుండా వెనక్కి తిరిగి వెళ్లిపోయాడు.

౭

అనంతం స్థితి, నీలకంఠానికి కృతార్థ్యవస్థగా వుంది. తన బస వదిలేసి, విశాలాక్షితో టి ఉంటూన్నప్పటినుంచీ అనంతానికి కొంత మనశ్శాంతి కల్గింది. ప్రేమాంగతలో పడిపోవడం వల్ల కాదు. ఏదో ఆధ్యాత్మికచింత అతన్నావహించింది. అందుమూలంగా మనస్సు కోవిదమైన శాంతి కల్గింది. ఇప్పుడతని మనస్సులో ఒకే నిశ్చయం ఏర్పడింది. "జరిగేది జరుగకమానదు" అని. విశాలాక్షి లేచి, అనంతం దగ్గిర కెళ్లి కూర్చుంది. ప్రపంచం ఒడ్డుమీద కూర్చుని ప్రపంచంలోకి చూసినట్లు ఇద్దరూ చంటిపిల్లల్లా కిటికీలో కూర్చుని వీధిలోకి చూడ్డం మొదలెట్టారు.

"విశాలా! ఒకవేళ మనం చచ్చిపోతామనుకో! ఇద్దరం ఒకరిచేతుల్లో ఒక రుండే చనిపోదాము!"

"ఔను! అంతే! లేకపోతే నేను బ్రతికేం ప్రయోజనం!"

మధ్యాహ్నంపూట బైల్దేరి అనంతం సాధారణంగా కుళ్లూ, హేళనా, బీదరికం - అలముకుని ఉన్న వీథుల్లోకి వెడతాడు. ఆ బీదల దారిద్ర్యాన్నీ, బాధల్నీ చూసి, "వాళ్ల బాధల్లో, నేను పడే దెంత?" అని అనుకుంటాడు. తిరిగి తిరిగొచ్చి, విశాలాక్షి వంటొండుతూంటే, పక్కని కూర్చుని, ఆ కాలుతూన్న కట్టెల మంటల వెలుగునీడలు చూపుతూ, విశాలా! అంతే సుమా జీవితం! అంటూంటాడు. అనంతం, తాగడం, పూర్తిగా మానేశాడు. అన్నగారింటికి వెళ్లడం మానుకున్నాడు. ప్రతిరోజూ, వారాపత్రిక కొని, హత్యావిచారణ ఎంతవరకూ సాగుతూందో చూస్తూంటాడు.

౮

నీలకంఠం ఒక కేసులో, ఆనాడు నెగ్గాడు. అపరిమితమైన ఆనందంతో కోర్టు విడిచి బైటకు రాగానే గోడమీద "ఫకీర్ డీ లేన్ హత్య విచారణ ఈనాడు జరిగి తీర్పుచెప్పడం జరుగుతుంది" అని పోస్టర్ చూశాడు. నీలకంఠం పీడకలచేత బాధపడినట్లు, హఠాత్తుగా మెలకువ తెచ్చుకుని, "అన్నట్లు తీర్పు చెప్పడం ఈవేళేగా! పొద్దున్నుంచీ పత్రిక చూడనేలేదు!" అని పత్రికలమ్మే కుర్రాణ్ణి పిలిచి పత్రిక కొని, కంగారుతో, తిరగేయడం మొదలెట్టాడు.

"ఫకీర్ డీ లేన్ హత్య తీర్పు చెప్పడమైంది. ముద్దాయికి ఉరిశిక్ష వేశారు." నీలకంఠం ఎందుకో కొంచెం చికాకుపడి. "రంగారావు దోషి అని నిర్ధారణ చేయడానికి ఆధారాలేమిటి? అన్యాయం! అక్రమం!" న్యాయాన్యాయాలతో తనకి ప్రమేయం లేదనుకున్నాడు బారిస్టరు నీలకంఠం. రంగారావు ఉరితీయబడినవాడు, అనంతాన్ని ఏం చేయాలనే ఆలోచనే తట్టలేదు నీలకంఠానికి.

అతను తిన్నగా విశాలాక్షి ఇంటికి పరుగెత్తాడు. తలుపు తట్టగానే, ఆమె వచ్చి తలుపు తెరిచింది.

"మాతమ్ముడేడీ?"

"బైటి కెళ్లారు. ఇంకా రాలేదు."

"పోనీ, అత నెక్కడి కెళ్లాడో తెలుసునా?"

"ఉహుఁ! తెలియదు."

"అప్పణ్ణించీ ఇక్కడ నీతోటే వుంటున్నాడా?"

"ఆఁ!"

"అతనిమీద నీ కింకా మోజుందన్నమాట?"

విశాలాక్షికి ఏం సమాధానం ఇవ్వాలో తెలియక తెలతెలపోయింది.

"అనంతంకోసం కొంచెంసేపు ఆగమంటావా?"

"తప్పకుండాను!.........ఇక్కడిలా కూర్చోండి...నానుంచి అతణ్ణిమాత్రం తీసుకుపోరుగదా?......అలా ఐతే నేను చచ్చిపోవలసి వస్తుంది!"

"నీకూ అతనికీ ఎడబాటు కల్గించడం, నా కసలిష్టం లేదు. నువ్వు అతన్నే విధంగానైనా నిలబెట్టుకోడానికి నాచేనైన సాయం చేస్తాను. మీరిద్దరూ కలిసి ఎక్కడికైనా వెళ్లిపోయేందుకు సిద్ధంగావున్నారా?"

"తప్పకుండాను."


"మరి వాడు?"

విశాలాక్షి, చాలా రహస్యంగా, "అతనూ సిద్ధమే కాని, ఆ ముసలివాడు నిర్దోషి! ఆ రంగారావుగురించే మీ తమ్ముడస్తమానం ఆలోచిస్తూంటారు."

"ఆ దరిద్రుడు శవాన్ని దోచుకున్నాడు; ఛండాలుడు; వాడి గురించి ఆలోచనా?"

"కాని వాడంటే ఎందుకో, నా కమితమైన జాలండి! బహుశా, వానికి అప్పుడాకలి వేసి వుంటుంది. నేనూ ఆకలితో అప్పుడప్పుడు బాధ

(22వ పేజీ చూడుడు)



జనవరి 3-వ తేదీని ప్రథమసమావేశం జరిపిన అమెరికన్ శాసనసభ. అధ్యక్షుడు ట్రూమన్ పరిపాలనావిధానం వివరిస్తున్నాడు.

అమెరికాలో శాసనసభ్యులు ప్రజలు

'ఏది చేసినా మాట పడక తప్పదు. ఏది చెయ్యకపోయినా పడక తప్పదు' అని అమెరికాలో శాసన (కాంగ్రెస్) సభ్యులను కోవడం పరిపాటి. పదవికి తగిన గౌరవం ఆదరం వారికి లభిస్తుంది. నిజమే. అయితే 'మా వోట్ల వల్లనే నువ్వు పదవిలో ఉన్నావు సుమా' అని నిత్యం జ్ఞాపకం ఉండేవిధంగా చేస్తారు ప్రజలు. పొగడనూ పొగడుతారు. తిట్టనూ తిట్టుతారు. నలుగురూ చూసి, పరీక్షించి, నవ్వడానికిగాని, దూషించడానికిగాని, భూషించడానికిగాని అమెరికన్ కాంగ్రెస్ సభ్యుడు ప్రదర్శనంలో బొమ్మ వంటివాడు.

ఇప్పటి కాంగ్రెస్ ఎనభయ్యొక్కటోది. జనవరి 3 వ తేదీని మొదటి సమావేశం జరిగింది. జాతీయ వ్యవహారాల్లో కాంగ్రెస్ సభ్యుల బాధ్యత చాలా భారవంతమయింది. కొన్ని వందలకోట్ల డాలర్లతో (డాలర్ అంటే నాలుగు రూపాయలకు తక్కువ) ఖర్చులు మొదలైనవి వీరే నిర్ణయించాలి.

దేశంలో గృహనిర్మాణాలు, భూముల వ్యవసాయం, పరిశ్రమలు, కార్మికవివాదాలు, పన్నులు, వస్తువులధరలు, విదేశ వ్యవహారాలు అన్నీ వీరి వోట్లపైన ఆధారపడివుంటాయి.

కాంగ్రెస్‌లో వోట్లు వెయ్యడంతో వీరి పని తీరిపోదు. వారివారి నియోజకవర్గాల్లో ప్రజల అభిప్రాయాలు గమనించాలి. అక్కడ ప్రజల లాభనష్టాలు ప్రయోజనం మొదలైనవన్నీ గమనించాలి. ప్రజల వ్యక్తిగత వ్యవహారాల్ని చూసి పెడుతూ ఉండాలి. సిఫార్సులు చెయ్యాలి. ఎవరి పని నెరవేరక పోయినా, "ఎన్నికైన తరవాత ప్రజల్ని మరిచి పోయాడు" అని నిందిస్తారు. మళ్లీ ఎన్నికల్లో గెలవాలంటే ఈ శాసనసభ్యులు అందరినీ తృప్తి పరచాలి. సామాన్యంగా ప్రజల అభిప్రాయాలు తరుచు మారడం, విషయాలు లాట్టే జ్ఞాపకం ఉండక పోవడంవల్లనే శాసనసభ్యులికి కొంత బాధ తప్పించుకో గలుగుతున్నాడు.

శాసనసభ్యులు సంవత్సరంలో దాదాపు ఆరు మాసాలు ప్రధాననగరంలో కాంగ్రెస్ సమావేశాల్లో గడపవలసివస్తుంది. మిగతా ఆరు మాసాలు వారి నియోజకవర్గాల్లో ఉండి చర్చించబడుతుండే శాసనాల్ని గురించి ప్రజల అభిప్రాయాలు తెలుసుకుంటూ ఉంటారు. వారి వారి నియోజకవర్గాల్లో ఏమే అవసరాలు తీర్చాలో పరిశీలిస్తూ ఉంటారు.

ఈ పనులు చేసినందుకు వారికి ఒక్కొక్కరికి సాలుకి 15 వేల డాలర్లు ఆదాయం వస్తుంది. ఇందులో 2500 డాలర్లపైన పన్ను ఉండదు. ఇవికాక కొన్ని సౌకర్యాలు, అధికారాలు అనుభవిస్తారు. శాసనసభసభ్యత్వం అంటే ఎన్ని చిక్కులున్నా, ఎంత కష్టం ఉన్నా, అందరూ కోరి తెచ్చుకుంటారు.

కాంగ్రెస్ సభ్యుడు కావడానికి కొన్ని షరతుల్ని రాజ్యాంగం విధించింది. సెనేట్ (మనదేశంలో కౌన్సిల్ వంటిదే. కాని ఎక్కువ అధికారాలున్నాయి) సభ్యత్వానికి పోటీచేసే వారికి కనీసం 30 ఏళ్లైనా నిండాలి. నియోజకవర్గ ప్రాంతంలో తొమ్మిది సంవత్సరాలకి తక్కువ కాకుండా నివసిస్తూ ఉండాలి. రిప్రజెంటేటివ్ హౌస్ (మన దేశములో ఎసెంబ్లీ వంటిది) సభ్యత్వానికి పోటీ చేసేవారికి కనీసం 25 ఏళ్లైనా నిండాలి. ఏడు సంవత్సరాలనుంచైనా నియోజకవర్గ ప్రాంతంలో నివసిస్తూ ఉండాలి.

సంయుక్త రాష్ట్రాల్లో ప్రతి ఒక్క రాష్ట్రానికి సెనేట్‌లో రెండేసి స్థానాలుంటాయి. అంటే మొత్తం సెనేట్‌లో 96 స్థానాలు (రాష్ట్రాలు 48). రాష్ట్రంలో ఎంత జనాభా ఉన్నాసరే రెండే స్థానాలు. సెనేటర్ రాష్ట్రానికి ప్రతినిధి అన్నమాట. రిప్రజెంటేటివ్ హౌస్‌లో స్థానాలు జనాభా సంఖ్య ఆధారంపైన ఏర్పాటుచేయబడినాయి. దాదాపు మూడు లక్షల జనాభాకి ఒక్కొక్క ప్రతినిధి చొప్పున మొత్తం 435 స్థానాలుంటాయి. ఎన్నికలకోసం దేశం అంతటినీ 435 కాంగ్రెస్ జిల్లాలుగా విభజించారు. జనాభానిబట్టి ఈ విభజన జరగడం వల్ల ప్రాంతం సరిహద్దులు నిర్ణయించడంలో ఫలాని నియమమనేది ఏదీ లేదు. జనాభా పలుచగా ఉన్న ప్రాంతాలు హౌస్‌లో ప్రాతినిధ్యం తక్కువైందని ఫిర్యాదు చెయ్యనవసరం లేదు. వారి రాష్ట్రానికి జనాభాతో నిమిత్తం లేకుండా సెనేట్‌లో రెండు స్థానాలుంటాయి. జనాభా అధికంగా ఉన్న రాష్ట్రాలు సెనేట్‌లో మిగతా రాష్ట్రాలతోపాటు రెండే స్థానాలిచ్చారని ఫిర్యాదుచెయ్యనవసరంలేదు. వారి జనాభాకి తగిన ప్రాతినిధ్యం హౌస్‌లో యిచ్చారు.

రిప్రజెంటేటివ్ హౌస్‌కి ప్రతి రెండు సంవత్సరాలకీ ఎన్నికలు జరుగుతాయి. సెనేట్ పద్ధతి వేరు. ఒకసారి ఎన్నికైన సెనేటర్ ఆరు సంవత్సరాలుంటాడు. ప్రతి రెండు సంవత్సరాలకీ మొత్తం 96 మంది సెనేటర్లలోనూ మూడోవంతు, అనగా 32 మందికి, ఆరుసంవత్సరాలూ నిండి, ఎన్నికలు జరుపుతారు.

ఎన్నికలు ఎల్లా జరపాలో ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రమే నియమాలు ఏర్పరుచుకున్నాయి. అసలు రాజ్యాంగమే శాసనాలపైన మాత్రమే గాక పార్టీ రాజకీయాలు, పరంపరగా వచ్చే ఆచారాలపైన కూడా ఆధారపడి వుంది.

కాంగ్రెస్‌లో సంఖ్యాధికత్యతగల పార్టీ వ్యవహారాలన్నీ నిర్వహిస్తుంది. పార్టీ కార్యక్రమాలు, విధానాలు, అభిప్రాయాలనుబట్టి ప్రజలు పార్టీ సభ్యుల్ని ఎన్నుకుంటారు. రాజ్యాంగ వ్యవహారాలు ఈ కార్యక్రమాలు విధానాలపైన నడుపుతారు.

రిపబ్లికన్, డెమోక్రటిక్ మొదలైన పార్టీలు ఎన్నికలముందు తమతమ కార్యక్రమాలు విధానాలు ఫలానివిధంగా ఉంటాయని నిర్వచిస్తారు. ప్రచారంచేస్తారు. అయితే ఆ పార్టీల సభ్యులు ఎన్నుకోబడిన తరవాత వ్యవహారాల నిర్వహణలో ప్రజల అభిప్రాయాల్ని బట్టి అప్పుడప్పుడు పార్టీ విధానాల్ని ప్రతిఘటించడం కద్దు. ఒక్కొక్కప్పుడు కొన్ని శాసనాల సందర్భంలో ఉభయపార్టీల సభ్యుల్లో అనుకూలురు, ప్రతికూలురు కూడా ఉంటారు. మెజారిటీపార్టీ ప్రతిపాదించే శాసనాలు కాంగ్రెస్‌లో అప్పుడప్పుడు వీగిపోవడం ఇందువల్లనే.

పార్టీ పద్ధతి కమిటీల్లో ముఖ్యంగా పని చేస్తోంది. ప్రతి కాంగ్రెస్‌లో స్థాయీసంఘాలు నిర్మాణమౌతాయి. ఒక్కొక్క సంఘంలో 19 మంది రిప్రజెంటేటివ్ హౌసుసభ్యులు, 15 మంది సెనేట్ సభ్యులు ఉంటారు. ఈ సంఘాల సభ్యుల్ని నియమించేటప్పుడు పార్టీల బలాల్ని బట్టి ఆ హెచ్చుతగ్గులు పాటిస్తారు. వీనికి ఎప్పుడూ అధ్యక్షుపదవికి మెజారిటీపార్టీ సభ్యులే నియమించబడతారు.

శాసనాల్లో ఆంతరంగికవిదేశవ్యాపారాలకు సంబంధించిన దొకటి, విదేశ వ్యవహారాలకు సంబంధించిన దొకటి, కార్మిక వ్యవహారాల కొకటి; బాంకింగ్, ద్రవ్యచలామణి వ్యవహారాల కొకటి, బడ్జెట్ ఖర్చుల ఏర్పాటు కొకటి, పన్నులు విధించే వ్యవహారాల కొకటి—ఈ విధంగా స్థాయీసంఘాలు నియమించబడతాయి.

ఈ స్థాయీసంఘాలు వానికి సంబంధించిన శాసనాల్ని పరిశీలించి చర్చిస్తాయి. స్వయంగా కూడా ఇవి శాసనాలు తయారుచేసి ప్రతిపాదించవచ్చును. ప్రతిపాదింపబడే శాసనాల్ని పరిశీలించడంలో ఈ సంఘాలు ప్రజాభిప్రాయాల్ని, నిపుణుల అభిప్రాయాల్ని తెలుసుకుంటాయి. స్వయంగా కొందరు ప్రముఖుల అభిప్రాయాల్ని వింటాయి. శాసనాల్ని సమగ్రంగా చర్చించి సవరణలు చెయ్యవచ్చును. ఒక్కొక్కప్పుడు పూర్తిగా మార్చి కొత్త శాసనాలుగా తయారు చెయ్యవచ్చును. అవసరం లేవని అనుకున్న శాసనాల్ని బుట్టదాఖలు చెయ్యగలవు కూడా. ఈ సంఘాలు ఆమోదించిన శాసనాలే కాంగ్రెస్‌లో ప్రతిపాదించబడతాయి. ఆమోదించని వానిని కాంగ్రెస్‌లో ప్రవేశపెట్టాలంటే ప్రతిపాదకుడు సెనేట్‌లోగాని హౌస్‌లోగాని మెజారిటీ సంపాదించి ప్రతిపాదనకు తెచ్చుకోవచ్చును.

కొన్ని శాసనాలకి ఎంతో విచారణ జరుపవలసివుంటుంది. యూరోపియన్ రాజ్యాలకి ఆర్థిక సహాయం చెయ్యడం కోసం తలపెట్టబడిన మార్షల్ ప్లాన్ తయారుచెయ్యడానికి అనేక మాసాలు కృషి చెయ్యవలసి వచ్చింది. కొందరు నిపుణులు యూరప్ తిరిగి ఎక్కడ ఎవరికి ఏ అవసరాలున్నాయో పరిశీలించారు. విదేశాంగ శాఖోద్యోగులు, నిపుణులు చర్చించారు. ప్లాన్ తయారుచేశారు.


తరవాత ప్లాన్ ఆశయాలు ప్రకటించారు. ప్రజాభిప్రాయం తెలుసుకున్నారు. పారిశ్రామిక వేత్తలు, రాజనీతిజ్ఞులు మొదలైనవారనేక మంది స్వయంగా వారివారి అభిప్రాయాలు నివేదించారు. తరువాత కాంగ్రెస్‌లో ప్రవేశపెట్టారు.

శాసనాలు కాంగ్రెస్‌లో ఆమోదించబడాలంటే ప్రజాభిప్రాయం చాలా ప్రధానంగా పరిగణిస్తారు. శాసనసభ్యులు ఏమి చేస్తున్నారో, ఏమి చెపుతున్నారో అంతా పత్రికలద్వారానూ, రేడియోలద్వారానూ ప్రచారమవుతుంది. దాన్ని బట్టి ప్రజలు నిర్ణయానికి వస్తారు. వారు వారి నిర్ణయాల్ని వారి నియోజకవర్గాల్లో ఎన్నికైన సభ్యులికీ, స్థాయీసంఘాలికీ తెలపవచ్చును. దీన్నిబట్టి శాసనాల్లో మార్పులు కూడా జరుగుతాయి. అనుభవం ఉన్న శాసనసభ్యుడు నియోజకవర్గం నుంచి వచ్చే ఉత్తరాల్ని చాలా జాగ్రత్తగా పరిశీలిస్తాడు. వాటి నంతగా పాటించనివాడు సామాన్యంగా తిరిగి ఎన్నికల్లో విజయం సాధించలేడు.

ఈ స్థాయీసంఘాలుగాక తాత్కాలికంగా ప్రత్యేకావసరాలకి శాసనపరిశీలన సంఘాలు (సెలక్టు కమిటీలు), విచారణ సంఘాలుకూడా నియమించబడతాయి. సామాన్యంగా ప్రతి సంవత్సరం కాంగ్రెస్‌లో అనేక వేల శాసనాలు ప్రతిపాదించబడతాయి. ఇందులో అనవసరమైన వాటిని తొలగించటానికీ, అవసరమైన వాటిని సంస్కరించడానికీ, అవసరమైన కొన్ని శాసనాల్ని స్వయంగా తయారుచేసి ప్రతిపాదించడానికీ ఈ స్థాయీసంఘాలు, తాత్కాలిక సంఘాలు అవసరం.

(18-వ పేజీ చూడుడు)

హిందూమతసంస్థలు స్వయంగా నిర్వహించడానికి మదరాసు ప్రభుత్వ శాసనం



హిందూమఠాలశాసనంపట్ల అసమ్మతి సూచకంగా నిరాహారదీక్షపూనిన స్వామి సత్యానంద సరస్వతిగారు.

హిందూమత ధర్మాదాయ సంస్థలు, దేవాలయ మాన్యాలు, (తిరుపతి దేవస్థానములో సహా) అన్నిటిని స్వయంగా సక్రమంగా నిర్వహించాలనే ఉద్దేశంతో మద్రాసు ప్రభుత్వం ఫిబ్రవరి 4-వ తేదీని ఒక శాసనాన్ని చెన్నరాష్ట్ర శాసనసభలో ప్రతిపాదించింది. ధర్మాదాయ సంస్థలంటే వైశ్య సత్రాలు, బ్రాహ్మణ సత్రాలు మొదలయినవి, ఆ ధర్మసంస్థల నిర్వహణలో ఉన్న విద్యాలయాలు, మొదలైనవి అన్నీ కూడా చేరతాయి. దక్షిణదేశంలో పేరు పొందిన మఠాలు, పీఠాలుకూడా సర్కారు అజమాయిషీలోకి వస్తాయి.

ఏ మతానికి ప్రాధాన్య మివ్వకుండా, ఏమతం పట్లనూ పక్షపాతం చూపకుండా సర్వమతాల వారినీ, మత సంస్థలనూ సమానదృష్టితో పరిగణిస్తున్న ప్రభుత్వం ఒక మతానికి చెందిన సంస్థలను స్వయంగా నిర్వహించ పూనుకోవడం మత స్వాతంత్ర్య సూత్రానికి భంగకరమని ఈమధ్య అనేకులు పత్రికల్లో ప్రకటిస్తూ వచ్చారు. దీనివలన హిందూమతం స్వేచ్ఛావికాసానికీ, పరిణామానికీ భంగం కలుగుతుం దని కొందరు చెప్పారు. కాని ఈ సంస్థలు ధర్మకర్తల నిర్వహణలో చాలా నష్టం పొందినా యనీ, వానిని హిందూప్రజానీకానికి రక్షించడం కోసమే ఈ శాసనం తలపెట్టబడిం దనీ ప్రతిపాదకులు వాదించారు.

ఈ శాసనాన్ని శుక్రవారంనాడు శాసనసభలో ప్రతిపాదిస్తూ డా॥ రాజన్‌గారు శాసనావశ్యకతను వివరిస్తూ ఈ క్రింది విషయాలు తెలిపారు :

హిందూమత ధర్మాదాయ సంస్థల్ని నిర్వాహకులు సరిగా నిర్వహించడం లేదనీ, అనేక చోట్ల ధనాపహరణ జరుగుతున్నప్పటికీ ఎవ్వరూ అరికట్టజాలకుండా ఉన్నారనీ, పానగల్ రాజాగారు ప్రధానిగా ఉండగా అనేకమంది ఆందోళన చేశారు. ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని ఒక పక్షం, చేసుకోకూడదని ఒకపక్షం వాదించనారంభించారు. ఉభయపక్షాలకూ తృప్తి కలిగించే ఉద్దేశంతో పానగల్ రాజాగారు 1926 లో హిందూమత ధర్మాదాయసంస్థల శాసనాన్ని (హిందూ రెలిజియస్ ఎండోమెంట్స్ బోర్డు ఆక్ట్) అమలు జరిపారు. ఆ శాసనం ప్రకారం పై సంస్థలు సక్రమంగా నిర్వహించే విధంగా వానిమీద అజమాయిషీ చెయ్యడం కోసం ఒక బోర్డు నిర్మించబడింది. ఈ బోర్డు ధర్మ సంస్థల నిర్వహణను కొంత సక్రమమార్గంలోకి తీసుకువచ్చినప్పటికీ, ఇవ్వబడిన అధికారాలు చాలనందువలన, తృప్తికరంగా సంస్కరించలేకపోయింది. పైగా ధర్మసంస్థల ధనాదాయం దుర్వినియోగం చేయబడుతుండగా బోర్డు ఏమీ చేయజాలకపోయింది. ఏదైనా చేయడానికి యత్నించినా, కోర్టులు బోర్డు నిర్ణయాలను రద్దుపరిచేవి.

ధర్మాదాయ సంస్థల్ని రక్షించాలనే ఉద్దేశంతో రాజాజీ ప్రధానిగా ఉన్నప్పుడే ఇటువంటి శాసనం ఒకటి డా॥ రాజన్ గారి చేతనే తయారుచెయ్యబడింది. అప్పుడు ఆ శాసనం మంత్రివర్గంఆమోదం పొందినప్పటికీ, మంత్రివర్గం రాజీనామా చెయ్యడంవల్ల ప్రతిపాదించడానికి వీలులేకపోయింది. ఇట్టి శాసనం ఎప్పుడో అమలు జరగవలసింది.

మైసూరు, తిరువాన్కూరు, కొచ్చిన్ సంస్థానాల ప్రభుత్వాలు ధర్మ సంస్థల్ని స్వయంగా నిర్వహిస్తున్నాయి. అక్కడ వీని నిమిత్తం ప్రత్యేకశాఖలుకూడా ఉన్నాయి.

ఇకనుంచి ఈ హిందూమత ధర్మ సంస్థల్ని ఏ ఒక్క వర్గం కోసం కాకుండా అన్ని వర్గాల వారికీ వినియోగింపచేయడం ప్రభుత్వోద్దేశ మని కూడా డా॥ రాజన్‌గారు చెప్పారు.

హిందూ జనాధిక్యత గల మన రాష్ట్రంలో, హిందూ ప్రాతినిధ్యం అధికంగా గల ప్రభుత్వం ఈ హిందూ సంస్థల్ని దుర్వినియోగపరుస్తారని భయపడవలసిన అవసరం లే దన్నారు. హిందువులలో బీదవారనీ భాగ్యవంతులనీ భేదం లేకుండా హిందూసమాజం అంతకీ సమానంగా వినియోగపడేవిధంగా ఇకనుంచి ప్రభుత్వం వీనిని నిర్వహిస్తుం దన్నారు.

రాజ్యాంగ నిర్మాణ సూత్రాలలో ప్రాథమిక స్వత్వాలలో ప్రధానమైన వానిలో ఒకటిగా పరిగణింపబడిన 20 వ నియమానికీ శాసనం విరుద్ధంగా ఉన్నదనే విమర్శ సరి కాదని డా॥ రాజన్‌గారన్నారు. ఈ విషయమై న్యాయ శాస్త్రజ్ఞుల్ని, నిపుణుల్ని, విచారించగా, రాష్ట్ర ప్రభుత్వానికి ఇట్టి అధికార మున్నట్లు స్పష్టపడిం దని చెప్పారు.

శ్రీ వైద్యనాథయ్యర్ గారు శాసనాన్ని ప్రతిఘటిస్తూ డా॥ రాజన్‌గారు నిపుణులచే పరిశీలింప చేసినది, పూర్వ నియమాల ప్రకారమే గాని నూతన రాజ్యాంగనియమాల ప్రకారం కాదన్నారు. నూత్న రాజ్యాంగంలో, ప్రాథమిక స్వత్వాలకు సంబంధించిన నియమాలన్నిటినీ రాజ్యాంగ పరిషత్తు అప్పుడే ఆమోదించింది.

వానిలో 20 వ నియమం ప్రకారం స్పష్టముగా మతస్వాతంత్ర్యానికి భంగం కలిగించే శాసనాన్ని ప్రభుత్వం అమలు జరపరాదు. ప్రజాభిప్రాయం ఈ శాసనానికి విరుద్ధంగా ఉన్నందువలన ప్రభుత్వం త్వరపడకూడ దనీ, ప్రజాభిప్రాయం తెలుసుకోవడానికి వ్యవధి నివ్వవలెననీ వైద్యనాథయ్యర్ గారు సూచించారు.

మనదేశంలో ప్రత్యేకకులాలవారి ఉపయోగం నిమిత్తం ఆ కులాలలోని ధనవంతులు ధర్మసంస్థల్ని స్థాపించారు. ఈ విధంగా ధర్మం చెయ్యడానికీ సహాయం పొందడానికీ ప్రతి కులానికీ ప్రతి వర్గానికీ హక్కున్నది. ఇప్పుడు వీనిని ఆయా కులాలవారిచేతగాక అన్యులచేత నిర్వహించ యత్నించడం న్యాయవిరుద్ధ మని వైద్యనాథయ్యర్‌గారన్నారు. ధర్మదాతల ఆశయాల్ని నెరవేర్చాలి. ధర్మకర్తల వర్తన సక్రమంగా లేదన్న కారణంచేత ధర్మదాతల దానాన్ని నిరర్థకం చెయ్యకూడదన్నారు. ధర్మకర్తలపైన అభియోగా లుంటే వారిని తొలగించడానికి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 92 వ నియమం ఆధార ముంది.

ఏ దేవాలయానికే ఉత్సవాలు ఎప్పుడు జరపాలో, ఏమి నైవేద్యా లివ్వాలో ఇవన్నీ ప్రభుత్వోద్యోగులు ఇకనుంచి నిర్ణయిస్తారా?

ఈ విధంగా మతవిషయాల్లో ప్రభుత్వం జోక్యం చేసుకోవడం హిందూమత సక్రమ వికాసానికి, పరిణామానికి భంగకర మన్నారు.

మత కుల వర్గాల నిమిత్తం స్థాపించబడిన ధర్మ సంస్థల ఆదాయం పై పన్నులు విధించరాదని నూతన రాజ్యాంగంలో 21 వ నియమం స్పష్టంగా విధించుచుండగా ప్రస్తుత శాసనంలో 62 వ నియమం ప్రకారం నిర్బంధంగా అట్టి ఆదాయాలపై పన్నులు విధించాలని నిర్ణయించబడింది. అన్యాయం జరిగిందని ఆయా మఠస్థులు న్యాయవిచారణ కోరుకున్నప్పటికీ అది వీలులేకుండా ప్రభుత్వ నిర్ణయాలకు విరుద్ధంగా కోర్టుల్లో కేసులు విచారించరాదని 85 వ నియమం నిరాకరిస్తున్నది. ఇదికూడా ప్రాథమిక స్వత్వాలకు భంగకరమైనదే.

మనరాష్ట్రంలో దాదాపు ఆస్తి మొత్తాలలో మూడోవంతు మతానికి సంబంధించిన వే. వీనిపై ఆధారపడి ఉన్న మన హిందూమతాన్ని నాశనం చెయ్యదలుచుకొంటే ప్రభుత్వం ఈ శాసనాన్ని అమలు జరుపవచ్చునని వైద్యనాథయ్యర్ అన్నారు.

కాంగ్రెస్‌పార్టీ వైఖరి

ఈ శాసనాన్ని శాసనసభలో ప్రవేశపెట్టడానికి ముందు చాలా వాదోపవాదాలు జరిగాయి. శాసనాన్ని ప్రకటించి సంవత్సరం పైగా దాటిపోయింది.

తరువాత ప్రభుత్వం దీన్నిగురించి యోచించనే లేదు. తిరిగి ఈమధ్య అకస్మాత్తుగా ఈ విషయం లెజిస్లేచర్ కాంగ్రెస్ పార్టీలో తేబడింది. తీవ్రవాదోపవాదాలు జరిగాయి. న్యాయశాస్త్రజ్ఞులు, నిపుణుల అభిప్రాయం తీసుకోవాలని అనేకులు సూచించారు. జనవరి మూడోవారంలో ఈ విషయాన్ని పార్టీ క్రమంగా మూడురోజులు చర్చింది. మూడువరోజున మొత్తం 190 మందిలోనూ 70 మంది మాత్రమే హాజరైనారు. వీరిలో నలభైమంది మాత్రం వెంటనే ఈ శాసనాన్ని ప్రతిపాదించాలనే తీర్మానంపై సుముఖంగా వోటు చేశారు. ఈ వోటుఆధారంపైన డా. రాజన్‌గారు శాసనాన్ని ప్రవేశపెట్టారు. ఈలోగా దీనికి విరుద్ధంగా అనేకమంది న్యాయవాదులు, పత్రికా ప్రకటనలు చేశారు.

హిందూ సనాతన ధర్మాచరణ సంఘ సంస్థాపకులైన స్వామి సత్యానంద.సరస్వతిగారు పదిహేను రోజులనుంచి ఆమరణాంత నిరాహారదీక్ష పూనినారు.

——



పాటియాలా ప్రథమ కాల్బలదళాన్ని పాటియాలా మహారాజాగారు తనిఖీచేస్తున్న చిత్రం.

భారతీయ శాసనసభలో

★ ప్రపంచబాంక్‌కు ఋణందరఖాస్తు ★ ఆహారపరిస్థితిపై చర్చ ★ వ్యాపారసంస్థల శాసనాల సవరణ

భారతీయ శాసనసభ బడ్జెట్ సమావేశం ఢిల్లీలో ఫిబ్రవరి 1 వ తేదీ మంగళవారం ఉదయం ప్రారంభమయింది. సమావేశం మొదటి వారంలో, అనగా శుక్రవారంవరకూ ప్రతిపాదించబడిన మొత్తం తొమ్మిది శాసనాల్లోనూ జినీవా వ్యాపారపు టొడంబడికను అంగీకరించే శాసనం ఒక్కటే ఆమోదించబడింది. బాంకులకు, ఇతర వ్యాపారసంస్థలకు, తేయాకు పరిశ్రమకు సంబంధించిన మిగతా శాసనాలన్నీ సెలక్టు కమిటీల పరిశీలనకు ఒప్పగించబడ్డాయి. ఇవిగాక ఆహారపరిస్థితినిగురించి డా॥ మన్ మోహనదాస్, ఆర్. కె. సిధ్వాగార్ల తీర్మానాలపై తీవ్రమైన చర్చ రెండురోజులు జరిగింది.

మొదటిరోజున ప్రశ్నల కాలానంతరం ఆర్థికశాఖామంత్రి ప్రపంచ బాంక్‌లో ఋణానికి భారతప్రభుత్వం పెట్టిన దరఖాస్తును గురించీ, తత్ఫలితంగా భారతదేశం వచ్చి ప్రస్తుతం పర్యటిస్తున్న బాంక్ రాయబారవర్గం గురించీ ఒక ముఖ్యప్రకటన చేశారు. బుధవారం ఉదయం ప్రధానమంత్రి పండిట్ నెహ్రూ దర్బాన్‌లో భారతీయులపై జరిగిన దౌర్జన్యంగురించి ఒక ప్రకటన చేశారు.

ప్రపంచ బాంక్‌లో భారతప్రభుత్వం పెట్టిన ఋణం దరఖాస్తుగురించీ, అంతర్జాతీయ ద్రవ్యనిధిని భారతదేశం ఎట్లు వినియోగించుకుంటున్నదీ ఆర్థికమంత్రి డా. జాన్ మత్తయ్ ప్రకటన చేస్తూ ఈక్రింది వివరాలు తెలిపారు:

భారతదేశంలో వ్యవసాయ పారిశ్రామికాభివృద్ధికిగాను ప్రభుత్వం ప్రపంచ బాంక్‌నుండి ఋణం కోరుతూ దరఖాస్తు పెట్టింది. ఈ ఋణం ఇవ్వడానికి వరకు లింకా నిర్ణయం కాలేదు. షరతులు, ఎంత ధనం ఋణంగా మనకు కావలసినదీ, వారివ్వడానికి అంగీకరించేదీ, ఇంకా సంప్రదింపుల అనంతరంగాని నిర్ణయం కావు. దేశంలో పరిస్థితులు, ఏయే కార్యక్రమాలకు ఎట్టి అవసరాలుండేదీ పరిశీలించడానికి ప్రపంచ బాంక్ తరఫున ఒక రాయబారవర్గం భారతదేశం వచ్చింది. వారి పరిశీలనఅనంతరం సంప్రదింపులు జరుగుతాయి.

ప్రపంచబాంక్, అంతర్జాతీయ ద్రవ్య వ్యాపారనిధి (ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్) రెండూ విడి సంస్థలు. నిధిలో భారతదేశానికి సభ్యత్వ ముంది. 40 కోట్ల మిలియన్ల డాలర్లు (అధికారరీత్యా మారకం ప్రకారం నూరుకోట్ల రూపాయలు) భారతదేశం నిధిలో పెట్టుబడి పెట్టింది; బాంక్ పెట్టుబడిలోకూడా మూలధనంలో భారతదేశం పెట్టుబడి ఇంతే, వివిధదేశాల ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలను అమలు జరపడంలో మారకం, ఋణం ఇచ్చి బాంక్ సహాయపడుతుంది. నిధిమాత్రం వ్యాపారానికి సంబంధించిన మారకం మాత్రమే ఇవ్వగలదు. ఈ నిధిని భారతప్రభుత్వం 1948 మార్చినుంచి వినియోగించుకోవడం ఆరంభించింది. ఇప్పటికి దాదాపు 80 మిలియన్ల డాలర్లను (దాదాపు రు. 20 కోట్లు) వినియోగించుకున్నారు.

ప్రపంచ బాంక్ ప్రతినిధివర్గం దేశంలో వివిధ పరిశ్రమలు, ప్రాజెక్టుల స్థానాలను పరిశీలిస్తుంది. ఇందులో రామపాదసాగరం పరిశీలించాలని భారతప్రభుత్వం సూచించిందా అని శ్రీ రంగాగారు ప్రశ్నించగా, ఆ విషయం జ్ఞప్తి లేదని ఆర్థికమంత్రి చెప్పారు.

తరవాత జినీవా ఒడంబడికను ఆమోదించడానికిగాను ఇండియన్ టారిఫ్ ఆక్టు సవరణ నొకదాన్ని వాణిజ్యమంత్రి ప్రవేశపెట్టారు.

అంతర్జాతీయ వ్యాపారం నిమిత్తం వివిధ దేశాలు జినీవాలో 1948 ఆగస్టులో సమావేశమై చేసుకున్న ఒడంబడికను ఆమోదించుటకుగాను వాణిజ్యశాఖామంత్రి ఇండియన్ టారిఫ్ ఆక్టును స్వల్పంగా సవరణ చేయవలసియున్నదని చెప్పారు. దీనిపై చర్చ జరిగినప్పుడు భారతదేశం దిగుమతుల విషయంలో బ్రిటన్‌కు పూర్వం గల సౌకర్యాలను పూర్తిగా ఎందుకు తొలగించలేదని కొందరు విమర్శించారు. దీనివలన దేశీయ పరిశ్రమల వృద్ధికి భంగం కలుగుతుందన్నారు. ఆహార పదార్థాలధికంగా దిగుమతి చేసుకోవలసిన భారతదేశం బర్మా, సయాంవంటి దేశాలతో వ్యాపారపు టొడంబడికలు చేసుకోడానికి యత్నించాలనీ, పశ్చిమ దేశాలకంటె తూర్పుఆసియాదేశాలతో వ్యాపారాన్ని ప్రధానంగా పరిగణించాలనీ అనంతశయనం అయ్యంగారన్నారు. జినీవా ఒడంబడికవల్ల మనకు నష్టం ఉందన్నారు. పశ్చిమదేశాల్నించి ఏ వస్తువుల్ని ఎంతెంత ఎగుమతి దిగుమతి చేసుకోవాలో నిర్ణయించారు కాని ఆసియాదేశాల్లోని ముడిపదార్థాలను ఎవరిమట్టుకు వారు బేరాలాడుకునికొని, దిగుమతిచేసుకోవచ్చునని జినీవా ఒడంబడికలో నిర్ణయమయింది. ఇది ఆసియాదేశాలకి నష్టం కలిగిస్తుందనీ, ఆర్థికంగా అమెరికా, బ్రిటన్, హాలండువంటి దేశాలపై ఆసియాదేశాలు ఆధారపడి వుండేలా చేస్తుందనీ వారన్నారు. ఈ విధంగా పశ్చిమ దేశాల్నించి కొనవలసిన యంత్రపరికరాల్ని కూడా ఎందుకు విడిచిపెట్టలేదు?

భారతదేశ వ్యాపార స్థితిగతులకు జినీవా ఒడంబడిక అనుకూలంగా లేదని జాతీయ ఆర్థిక శాస్త్రవేత్తయైన ప్రొఫెసర్ కె. టి. షా వాదించారు. ఉత్పత్తి వస్తువులను అపారంగా ఎగుమతి చెయ్యడంవల్లనే అమెరికా బ్రిటన్ దేశాల ఆర్థిక బలం అంతా ఆధారపడి వుంది. కాని భారతదేశం పరిస్థితి దీనికి విరుద్ధమైనది. ఆర్థికస్వయంసంపూర్ణత సాధించడానికి భారతదేశానికి అవకాశం ఉందన్నారు.

వాణిజ్యశాఖామంత్రి కె. సి. నియోగిగారు సమాధాన మిస్తూ జినీవా ఒడంబడిక మనపై నిర్బంధం కాదనీ, అవసరమనితోస్తే నిరాకరించడానికి భారతీయ శాసనసభకు అధికార ముందనీ చెప్పారు. అయితే షా గారు చెప్పినట్లు భారతదేశం స్వయం సంపూర్ణతను వెంటనే సాధించగల అవకాశం ఉన్నదనడం పొరపాటన్నారు. దేశవిభజన అనంతరం భారతదేశం కూడా ఆర్థికసంపదకి ఎగుమతులపైనే ఆధారపడవలసిన స్థితి వచ్చింది. పూర్వం ముడిపదార్థాలను ఎగుమతిచేసి ఉత్పత్తిఅయిన వస్తువుల్ని దిగుమతి చేసుకునేవారు. కాని ఇప్పుడు ముడిపదార్థాలను దిగుమతిచేసి ఉత్పత్తి చేసిన వస్తువుల్ని ఎగుమతి చెయ్యవలసిన అగత్యం కలిగింది. దీనితోపాటు ఆహారపదార్థాలుకూడా దిగుమతి చేసుకోవలసివస్తోంది. ప్రత్తి, నార దిగుమతి చేసుకోవాలి. ఆస్ట్రేలియా మొదలైన దేశాలు భారతదేశంలో తయారైన వస్త్రం మొదలైనవి కొంటున్నాయి. దిగుమతి పన్నుల విషయంలోనూ దిగుమతి ఏర్పాట్ల విషయంలోనూ, బ్రిటన్‌నుంచి వచ్చే సరుకులకంటే భారతదేశంనుంచి వచ్చేవానికి అధికసౌకర్యాలివ్వగలరని తెలుస్తోంది.

తరువాత జెకోస్లోవాకియా మొదలైన దేశాలతో భారతదేశం వ్యాపారపు టొడంబడికలు చేసుకుంటున్న వివరాలను మంత్రిగారు వివరించి భారతదేశ ఎగుమతి వ్యాపారం వృద్ధిపరచడానికి ప్రభుత్వం తీవ్రయత్నాలు చేస్తున్నదని చెప్పారు.

తరవాత బాంకుల్లో వాటాదార్లలో ఎవరికీ నూటికి 20 వంతులుకంటె వాటా లుండరాదని నియమంవిధిస్తూ ఒక శాసనం, వ్యాపారసంస్థలు వాటాదార్లకిచ్చే డివిడెండ్లను పరిమితంచేసే శాసనం ఒకటి, చార్టర్డ్ ఎకౌంటెంట్స్ నిర్వహణను నియమబద్ధంచేసే శాసనం ఒకటి మొదలైన ఎనిమిది శాసనాల్ని సెలక్టు కమిటీల పరిశీలనకు ఒప్పగించారు.

బుధవారంనాడు పండిట్ నెహ్రూ దర్బాన్‌లో భారతీయులపై జరిగిన దౌర్జన్యాలను గురించి ఒక ప్రకటనచేస్తూ, భారతీయులకూ ఆఫ్రికన్లకూ మధ్య వైషమ్యాలకు ఏవో పెద్ద కారణాలుండి ఉండాలన్నారు. దక్షిణాఫ్రికా ప్రభుత్వం విచారణ జరుపుతున్నందువల్ల ఇప్పుడే పక్షాన్ని చెప్పడం ఉచితం కాదన్నారు.

ఆహారపరిస్థితి

గురువారం, శుక్రవారం ఆహారపరిస్థితిపై డా॥ మన్‌మోహన్‌దాస్, సిధ్వాగార్ల ప్రతిపాదనలపైన తీవ్రచర్చ జరిగింది.

అధికాహారోత్పత్తి ఉద్యమం విఫలమైపోయినందువల్ల ఈ విషయమై ప్రభుత్వం విచారణ జరపాలని డా॥ దాస్‌గారు సూచించారు.

మన దేశంలో వ్యవసాయం ఇప్పటివరకూ వర్షాలపైనే ఆధారపడి ఉండడంవల్ల నిత్యం పంటలు పాడుకావడం, క్షామాలు రావడం సంభవిస్తోందని రంగాగారన్నారు. మనదేశంలో ప్రధాన పరిశ్రమల్లో ఒకటైన వ్యవసాయానికి, నీటివనరు ఏర్పాటుకి ప్రభుత్వం ఎంతైనా కృషి చెయ్యవలసి ఉంటుందన్నారు. రామపాదసాగరం వంటి ప్రాజెక్టులపట్ల ప్రభుత్వం అశ్రద్ధ వహించకూడదన్నారు. వ్యవసాయం నిమిత్తం ఆర్థిక సహాయసంస్థ నొకదాన్ని స్థాపించాలన్నారు. కర్షకులకు పంటల హామీలపై ఋణాలివ్వాలన్నారు.

దేశంలో సమగ్రమైన వ్యవసాయాభివృద్ధికి కేంద్రంలో ఒక అభివృద్ధిశాఖ, వివిధరాష్ట్రాల్లో రాష్ట్రశాఖలు, ప్రతిజిల్లాలోనూ ఇట్టి శాఖలు స్థాపించి బీడుపడిఉన్న భూముల్ని సాగులోకి తేవడానికీ, సాగులోఉన్న భూముల్ని బాగుపరచడానికీ ప్రభుత్వం కృషిచేయాలని శ్రీమతి రేణుకారాయ్‌గారు సూచించారు.

ఆహారధాన్యాల అమ్మకాన్ని మధ్యవర్తుల బారినుండి రక్షించాలని, ఆర్థికశాఖవారు ఇప్పటికన్న కొన్నిరెట్లు ధనం వ్యవసాయాభివృద్ధికి వెచ్చించాలనీ విశ్వనాథదాసుగారు సూచించారు.

ఆహారవిషయమై ప్రభుత్వం తగు శ్రద్ధవహించడం లేదని విమర్శిస్తూ, ఆహారశాఖను పండిట్ నెహ్రూగాని, పటేల్‌గాని తీసుకుని, రాష్ట్రప్రభుత్వాల మధ్య సామరస్యకృషి సాధించడానికీ, వ్యవసాయోత్పత్తిని చురుగ్గా వృద్ధిపరచడానికీ కృషిచెయ్యాలని ఫ్రాంక్ ఆంథోనీ చెప్పారు.

ఆహారశాఖామంత్రి దౌలత్‌రాంగారు చర్చకు సమాధాన మిస్తూ అధికాహారోత్పత్తి కార్యక్రమం తృప్తికరంగా సాగడంలేనిమాట నిజమేనని అంగీకరించారు. ఆహారపరిస్థితిని చక్కబరచడానికి ప్రభుత్వం అసలు విధానాన్ని పూర్తిగా మార్చుకోవలసిన మాట నిజమేనన్నారు. అయితే ప్రస్తుత క్లిష్టపరిస్థితికి ముఖ్యహేతువు రాష్ట్రప్రభుత్వాల ధాన్యసేకరణ, ఉత్పత్తి వృద్ధి కార్యక్రమాలు తృప్తికరంగా లేకపోవడమేనని చెప్పారు. వివిధ ప్రభుత్వ శాఖలమధ్య సహకారం లేకపోవడం కూడా ఒక ముఖ్యకారణమని అంగీకరించారు. ఆహారోత్పత్తికి ప్రభుత్వం మొత్తం వ్యయంలో నూటికి 8 వంతులే ఇప్పుడు వెచ్చిస్తున్నది. గతసంవత్సరం అధికాహారోత్పత్తి కార్యక్రమంప్రకారం తొమ్మిదిలక్షల టన్నులు, అధికంగా పండించాలనుకుని అయిదుకోట్ల రూపాయలు వెచ్చించారు. కాని ఏడులక్షల టన్నులు మాత్రమే అధికంగా పండింది.

గతసంవత్సరం (1948) దేశంలో ఆహారం లోటును తీర్చడానికి $28\frac{1}{2}$ లక్షల టన్నులు ఆహారపదార్థాల్ని విదేశాల్నించి రు. $129\frac{1}{2}$ కోట్ల రూపాయలకు కొని దిగుమతిచేశారు. 1949 లో 40 లక్షల టన్నుల లోపం రానున్నట్లు అంచనా వెయ్యబడింది. ఈ సంవత్సరం గతసంవత్సరం



జయరాందాస్ దౌలత్‌రామ్

కన్నా దేశంలో ఉత్పత్తి తక్కువగా ఉంటుంది.

జపాన్‌లో ఎకరానికి 3000 పౌనుల ఆహారధాన్యం ఉత్పత్తిఅవుతుంది. మనదేశంలో 900 పౌనులు చొ॥ మాత్రమే ఉత్పత్తిఅవుతోంది.

మనదేశంలో పరిశోధక కేంద్రాలు బొత్తిగా తక్కువగా వున్నాయిసరికదా, ఉన్నవైనా కర్షకులకు ప్రయోజనం లేకపోతున్నాయి. పరిశోధన దారి పరిశోధనదీ, కర్షకుల దారి కర్షకులదిగా ఉంది. జపాన్‌లో దేశమంతటా 400 కేంద్రాలు పనిచేస్తున్నాయి. పరిశోధన ఫలితాలు కర్షకులకు అందుబాటులో ఉన్నాయి.

భారతదేశంలో ఈ పరిస్థితిని వెంటనే చక్కబరచవలసిన అవసరాన్ని గుర్తిస్తున్నారని మంత్రి దౌలత్‌రాంగారు అన్నారు. మంత్రివర్గ స్థాయిలో పరిస్థితిని చర్చించి ప్రభుత్వం పెద్ద పెద్ద మార్పులు చెయ్యగలదని వాగ్దాన మిచ్చారు.

శ్రీమతి రేణుకారాయ్ చేసిన సూచనను, అనగా అభివృద్ధిసంస్థలస్థాపనను యోచించగలరన్నారు. మంత్రిగారి వాగ్దానంపైన ప్రతిపాదకులు తీర్మానాల నుపసంహరించుకున్నారు.

[ఈసందర్భంలో చెన్నరాష్ట్రంలో పరిస్థితినీ, గుజరాత్‌లో పరిస్థితినీ ఇక్కడ సూచించడం అవసరం. గుజరాత్‌లో ఇప్పుడు భయంకర క్షామం తాండవిస్తోందని వార్తలు వస్తున్నాయి. కథియవార్‌లో అన్నాతురులైన ప్రజలు పల్లెలు విడిచి పట్టణాలకు వేలాదిగా వలసలు పోతున్నారు. వీరి రక్షణార్థం సౌరాష్ట్రప్రభుత్వం రక్షణ శిబిరాలను స్థాపిస్తోంది.

చెన్నరాష్ట్రంలో 1947-48లో అధికాహారోత్పత్తి కార్యక్రమం నిమిత్తం వెచ్చించడానికి కేంద్రప్రభుత్వం రెండున్నరకోట్ల రూపాయలు మంజూరుచేసింది. రాష్ట్రప్రభుత్వం కూడా ఈ కార్యక్రమానికి అంతే ధనాన్ని వెచ్చించాలనే షరతు విధించబడింది. కిందటిసారి మద్రాసు శాసనసభలో ఆహారపరిస్థితిపై చర్చ జరిగినప్పుడు మద్రాసు ప్రభుత్వం కోటిరూపాయలైనా వెచ్చించలేకపోయిందనీ, అందువల్ల భారత ప్రభుత్వం మంజూరుచేసిన ధనం అల్లాగే నిరర్థకంగా ఉండిపోయిందనీ తెలిసింది. మన రాష్ట్రంలో మిగత రాష్ట్రాల్లోకంటెకూడా కార్యక్రమం కుంటుపడింది.]

భారతదేశములో - క్రొత్త ప్రాజెక్టులు

శ్రీ నందివాడ కృష్ణమూర్తి



ఎస్. వి. రామమూర్తిగారు

ఈ యంత్రయుగములో ఏదేశపు సౌభాగ్యమైనను, అందలి విద్యుచ్ఛక్తి, నీటి సరఫరా సదుపాయములపై నాధారపడియుండును. విద్యుచ్ఛక్తి లేనిచో పారిశ్రామికాభివృద్ధి జరుగజాలదు. వ్యవసాయిక పెంపుదలకు నీటివసతి ముఖ్యావసరము. ఈ రెండు విషయములందును, హిందూదేశము చాల వెనుకబడియున్నది. దీనికి కారణము దేశములో ప్రకృతి సహజమగు నైశ్వర్యము లేకపోవుటగాదు, రహస్యముగానున్న ఈ ఐశ్వర్యములను సంపాదించుమార్గము తెలిసికొనకపోవుటచే, మహానదుల ప్రవాహస్థలమైనను, దేశము నేటికిని దుర్భిక్షముగా నున్నది. దేశసౌభాగ్యమున కతిముఖ్యమగు నీ విషయముపట్ల ఉదాసీనత కనపర్చుట క్షమించుటకు వీలులేని తప్పు. పొంగిపొర్లుచున్న నదీజలముల నదుపులోనికి తీసికొనుటకు ప్రయత్నముచేయక, అతివృష్టి, అనావృష్టిలవల్ల కల్గు నష్టములను తీర్చలేక భారతీయులను దారిద్ర్య దేవతకు బ్రిటిష్ ప్రభుత్వము ఆహుతిచేసియుండిరి. పరిమితికాలములో తిరిగివచ్చుచున్న వరదల నాపుటకుగాని, ప్రవాహమునుండి విద్యుత్తును సంపాదించుటకుగాని ఎట్టి ప్రయత్నమును జరుపబడలేదు. కాని స్వాతంత్ర్యము వచ్చి కొద్దిమాసములే యయినను కేంద్రప్రభుత్వ మీ విషయముపట్ల చూపిన విశేష శ్రద్ధకు దేశములోని ప్రజ లందరును కృతజ్ఞులు. కొలది కాలములోనే యింతటి విజయము సాధించినందులకు వారలకు జోహారులు! దేశమందంతట ననేక ప్రాజక్టులు తలపెట్టబడినవి. కొన్ని వానియందు మహత్తరమయినవి. మరికొన్ని చిన్నవయినను ముఖ్యమగు నవసరములను తీర్చగల శక్తివంతములై యున్నవి.

అమెరికాలోని టెన్నెసీ వాలీ డామును ప్రమాణముగా (*Tennesee valley authority*) తీసికొని, దాని కనుగుణ్యమగు ప్లాను ప్రకారము దామోదర్ డాము (*Damodar dam*) కట్టబడుచున్నది. దీనిని పూర్తిచేయుటకు సుమారు 55 కోట్ల రూపాయలు కావలసియున్నవి. ఈ డాముమూలముగా 763,000 ఎకరములు సాగుబడి క్రిందకు రాగలవనియు, 200,000 (*K. W.*) కిలోవాట్ల విద్యుచ్ఛక్తి పుట్టింపవచ్చుననియు, మరి 150,000 కిలో వాట్ల థెర్మల్ పవరును (*Thermal power*) ఉత్పత్తిచేయవచ్చుననియు, తన్మూలముగా మరి 200, 000 టన్నుల ఆహార పదార్థములను పండింపవచ్చు ననియు అంచనా వేయబడినది. ఈ డాము కట్టడపు పనులన్నియు నప్పుడే ప్రారంభింపబడిన వనియు, నేటినుండి సుమారు 15-20 సం॥ లలో కట్టడము పూర్తి కాగలదని దామోదర్ వాలీ కార్పొరేషన్ అధ్యక్షుడు శ్రీ యస్. యన్. మజుందార్ గారు శెలవిచ్చియుండిరి. కాని ఆపుదలలేకుండ పనులు కొనిచ్చినచో ఈడాము యుపయోగములను 5 సం॥ లలోనే పొందదగు నని అనుకొనుచున్నారు.

దామోదర్ వలెనే హిరాకుద్ డాము (***HiraKud Dam***) మనదేశమున రెండవ మహత్తరమైన ప్రాజక్టు కాగలదు. ఈడాము మరియొక పెద్ద ప్లానలో నొకభాగముగా నెంచబడుచున్నది. ఈ డాముపలన మహానదీ జలములు, మూడు ప్రదేశములవద్ద బంధింపబడుచున్నవి. ఈ డాము పూర్తియగుసరికి, మహానది కడ్డముగా మూడుమైళ్ళపొడ వుండునట. ఈడాము మూలముగా సుమారు 1. 1 మిలియన్ యకరములు సేద్యములోనికి రాగల వనియు, 350,000 కిలోవాట్ల విద్యుచ్ఛక్తిని పుట్టించవచ్చు ననియు నంచనా వేయబడినది. అంతటితో మహానది ప్రాముఖ్యముగూడ హెచ్చగలదు. ఇకపై నీ నది వాణిజ్యవసతుల కనుకూలము కాగల దనియు, పెద్దఓడలు ఈ నదిలో చాల దూరము వరకు దేశములోనికి వచ్చుటకు వీలగు ననియు నాశించుచున్నారు. ఇకపైన సమయమనుకూలముగా నున్నప్పుడు టిక్కర్ పేరా లేక నారాజ్ (*Tikker Pera or Naraj*) ల [illegible]ములు కట్టినప్పుడు మహానది ప్రాముఖ్యము మరింత హెచ్చు కాగలదు. ఈ డాము మూలముగా మహానదిపై నొక రైలుబ్రిడ్జికూడ కట్టబడుచున్నది. ఈ బ్రిడ్జిపైకి వేయవలసిన రోడ్డులకే ఒకకోటి రూపాయలు ఖర్చగునట. ఈ ప్రాజక్టుమూలమున విస్తారమగు భూములు సాగుబడిలోనికి వచ్చుటచే నేటివరకు వెనుకబడియున్న ఒరిస్సారాష్ట్ర మికపై ప్రాముఖ్యము పొందగలదు. అందువలననే ఈ రాష్ట్రమును హిందూదేశపు యుక్రేయిన్ (*Ukraine of India*) కాగల దని భావించుచున్నారు.

ఇక దక్షిణ హిందూదేశములో మరి రెండు మహత్తర డాములు కట్టుట కాలోచనలు జరిగెను. అందులో తుంగభద్రా ప్రాజక్టు ఒకటి. రెండవది రామపాదసాగర ప్రాజక్టు. ఈ విషయమం దవసరమగు ప్రారంభ పరిశోధనలన్నియు ముగింపబడినవి. కాని దీనిని నిర్మించుటకు మాత్ర మాలస్యమగుచున్నది. దీనికి కారణము మద్రాస్ ప్రభుత్వమువారి ఉదాసీనతయే! గత సంవత్సరము నవంబరు నాల్గవ తేదీన వర్క్సు అండ్ మైన్సు మంత్రికిని, మద్రాస్ ప్రభుత్వమునకును జరిగిన సమావేశములో, మద్రాస్ మంత్రులు తామార్థికంగా నీరసస్థితిలో నుంటిమనియు, 127 కోట్లు కేంద్ర ప్రభుత్వము అప్పియవలెననియు కోరిరట. ప్రప్రథమముగా కేంద్ర ప్రభుత్వమందుల కంగీకరించినను తర్వాత నిరాకరించెను. తత్కారణముగా రామపాదసాగర్ ప్రాజక్టు ఆపబడినది. ఇక తుంగభద్రా ప్రాజక్టు గత సంవత్సరమే ప్రారంభింపబడినను, హైదరాబాదు అల్లరివల్ల కొంతవర కాపబడి మరల యిప్పుడు పూర్తిశక్తితో జరుగుచున్నది. ఈ డాము పూర్తియగుసరికి 82,000 అడుగులు పొడుగు, 160 అడుగులు ఎత్తు ఉండునని అభిజ్ఞులు తెలియజేయుచున్నారు. దీనివలన 600,000 యకరములు మద్రాసురాష్ట్రములో నూతనముగా సాగుబడిలోనికి రాగలవు. 150,000 కిలో వాట్ల విద్యుత్తు ఉత్పత్తి కాగల దనియు తెలియుచున్నది.

క్రొత్తగా కట్టబడుచున్నవానిలో యీ నాల్గు డాములును ముఖ్యమైనవి. మూడు ప్రాజక్టులను కట్టుటకు డబ్బు చూపించగల్గిన కేంద్రప్రభుత్వము రామపాదసాగర్ ప్రాజక్టున కప్పియలేమనుటలో అర్థమేమి? ఒక్క రామపాదసాగర్ ప్రాజక్టు కట్టినచో 16,95,000 ఎకరములు నూతనముగా సాగుబడిలోనికి రాగల వనియు, ప్రప్రథమముగా 1,50,000 (K. W.) కిలో వాట్ల విద్యుచ్ఛక్తిని పుట్టింపవచ్చుననియు, తరువాత అభివృద్ధి పద్ధతుల ద్వారా 2,00,000 కిలో విద్యుచ్ఛక్తి నధికముగా నుత్పత్తిచేయవచ్చు ననియు అంచనా వేయబడినది. ఇది పూర్తియగుసరికి 129 కోట్ల రూపాయిలు ఖర్చగుననియు లెక్క వేయబడెను. అయినను, ఇంతటి ఉపయోగకరమగు ప్రాజక్టును ప్రారంభించుటకు డబ్బు లేదనుట సమంజసము కాదు.

స్థైర్యముగా అయిష్టతను చూపుటకు బదులు మద్రాసు ప్రభుత్వము వేరు కారణముల చూపుచుండుట హాస్యాస్పదము. ప్రభుత్వములో నుండియు ఆంధ్రాభివృద్ధి కెంతమాత్రము పాటుపడకుండిన ఆంధ్రమంత్రు లావశ్యకత ఏమి? ఆత్మాభిమానమే లేని ఆంధ్రజాతి నాదరించువారెవరు? మొన్నటివరకు ఆర్థికముగా వెనుకబడియుండి, తమ నిత్యఖర్చులకు గూడ కేంద్ర ప్రభుత్వపు పారితోషికములపై నాధారపడియుండిన ఒరిస్సా రాష్ట్రము, మహత్తరమైన హిరాకుద్ డాము (*Hirakud Dam*) కట్టుట కెట్లు యత్నించుచున్నది? పెద్దరాష్ట్రములలో నొకటియగు మద్రాసు అప్పడుగుట ఏమి? డబ్బు కొరతపడినవారు ముమ్మందుగా మద్యపాననిషేధము నేల తలపెట్టవలెను. పోనీ అట్లు చేయుటచే నిరుద్యోగులైన కల్లుగీతవారిని, పోషించుట కెట్టి ప్రయత్నమును జరుగలేదు! ఇంతకు నిష్ఠూరపడవలసినవా రాంధ్రులే. ఆంధ్రమంత్రుల ఉదాసీనత, ఆంధ్రనాయకుల చేతకానితనమే ఈనాటి మన దారిద్ర్యమునకు కారణము. ఆంధ్రుల ఓట్లపై మంత్రులైన ఆంధ్రులు తమ దేశమునకే సాయపడగల బలము లేనిచో మంత్రి పదవులనుండి వైదొలగుట మంచిది. కాని పెరిగి పెద్దదగుచున్న ఆంధ్రద్వేషమునకు తామే ముందు లొంగిపోయి, పొరుగింటి పుల్లకూర రుచి మరిగి కూర్చున్నచో వారికిగాని, వారి రాష్ట్రమునకుగాని ఎట్టి ప్రతిష్ఠయు తెచ్చినవారు కాజాలరు. రామపాద సాగర ప్రాజక్టును బుట్టదాఖలు చేయుట ఆంధ్రులకు చేసిన తీరని అన్యాయము. టెన్నెసీవాలీస్కీము (*Tennesse valley Scheme*) ఇంజినీరులే యీ స్కీము సులభసాధ్యమని అనేకసారులు చెప్పియున్నారు. అయినను ఇంకా యిది అనుమానాస్పదమైన విషయమనుటలో నర్థము లేదు. సర్ యస్. వి. రామమూర్తిగారివంటి మహనీయు లీ విషయమం దత్యంతశ్రద్ధ చూపించుచున్నందుల కాంధ్రులు వారికి కృతజ్ఞులుగా నుండకపోరు. ఈ ప్రాజక్టు ఏనాటికైనా వచ్చితీరునని చెప్పుచున్నారు. ఈ ప్రాజక్టు నిలచియున్నంతవరకు శ్రీరామమూర్తిగారి పేరు ఆంధ్రలోకముననే గాక భారతదేశమందంతటను చిరస్థాయిగా నిలవగలదు. ఆంధ్రమంత్రులు, ఆంధ్రనాయకుల మని చెప్పుకొనుచున్న మహనీయులు, చేయలేని పనిని చేయించుటకై ప్రయత్నించుచున్న శ్రీరామమూర్తిగారికైన ఆంధ్ర ప్రజలు సహాయపడుట మంచిది. రాష్ట్రప్రభుత్వము, కేంద్రప్రభుత్వములు గూడ సహాయపడకపోవుటచే ఈ డాము కట్టుటకు ప్రజాసహాయ మత్యంతావసరము. ఇందులకుగాను ఒక కార్పొరేషన్ స్థాపింపబడు ననియు, ఈ ప్రాజక్టువలన ముమ్ముందు లాభము పొందగలవా రందరు యకరమునకు 10 రూ. చొప్పున కార్పొరేషన్ షేరుల కొనవలెననియు అట్లు సమకూడిన 2, 3 కోట్ల రూపాయలతో పని ప్రారంభించుటకు ప్రయత్నములు చేయబడు ననియు, ప్రస్తుత నిస్సహాయ పరిస్థితిలో పనులు ప్రారంభించుట కిది యొకటే శరణ్యామార్గ మనియు పెద్దలాలోచించుచున్నట్లు వార్తలు వచ్చుచున్నవి. తమ మంత్రులే తమకు సహాయపడనప్పుడు, తమ నాయకులే తమకు ఈ విషయము నాందోళన జరుపకుండినందులకు తముపై జనించిన ద్వేషమే కారణముగా అప్పనియ్య కేంద్ర ప్రభుత్వము నిరాకరించినప్పుడు ఆంధ్ర ప్రజలందరీ పనిని తమ బాధ్యతగా నెంచి ఈనాటికైన మేల్కొంచవలసియుండును. చిన్నదైనను ఒరిస్సారాష్ట్రము సాధించిన కార్యమును, ఆర్థికంగా మహత్తరమైన ఆంధ్రదేశము నెరవేర్చుకొనలేకపోవుటకు తమ బానిసత్వమే కారణము. మద్రాస్ ప్రధాని ఆంధ్రుడన వచ్చును. కాని బాగుపడినవారలందరూ అరవలే నన్న సంగతి గమనింపవలెను. మనకు రాష్ట్రము వచ్చినచో ఈ సవతిబాధలైన తప్పునుగదా! రాష్ట్రవిభజన చేసినచో నీ ప్రాజక్టును కట్టుటకు ధనము చాల దని వాదించిన అరవ నాయకులు అవిభాజ్యమైన ఆంధ్రరాష్ట్రముపట్ల నిట్టి అన్యాయము చేయుటకు కారణ మేమి? దీనికి ఆంధ్రుల చేతకానితనమే కారణ మని యనుకొనవలసి యుండును.

రామపాదసాగర్ ప్రాజక్టు అన్న పేరులోనే ఎంతో ఆనందము, అర్థము ఉన్నవి. కాని ఆ ఆనంద మనుభవించుటకు తగిన ఆవేశ మాంధ్రులలో లేదు. పవిత్రసాగరజలముతో భద్రాద్రిరాముని పాదములను కడుగలేకపోయిన ఆంధ్రులు నిద్రావస్థనుండి ఎప్పుడు మేల్కొంటారో!

ఈ నాలుగు ముఖ్యమైన ప్రాజక్టులుగాక చిన్నచిన్న ప్రాజక్టులు అనేకములు తలంపబడినవి. అస్సాము రాష్ట్రములోని బ్రహ్మపుత్రా నది ననేకవిధములుగా నుపయోగింపవచ్చునని సెంట్రల్ వాటర్ పవరు యిరగేషన్ నేవిగేషన్ కమిటీ (*Centra water power Irrigation and navigation Committee*) వారి అభిప్రాయమై ఉన్నది. అందువలననే బ్రహ్మపుత్రా ఉపనదులపై అనేక డాములు కట్టవచ్చునని సలహా చేయబడినది.

డిహాంగ్ నదిపై (*Dihangh River*) పాసీఘాట్ వద్ద 500 అడుగుల డామును కట్టవలెననియు, అందుమూలముగా 2 మిలియన్ల కిలో వాట్ల విద్యుత్తును పుట్టింపవచ్చుననియు;

బారక్ (*Barak*) నదిపై 480 అ॥ డామును కట్టుటచే 1½ మిలియన్లకిలో వాట్ల విద్యుత్తుద్భవించగలదనియు;

మర్రాస్ (*Marras* నదిపై 400 అ॥ డామును కట్టినయెడల 1½ మిలియన్ల విద్యుచ్ఛక్తి తయారగుననియు;

సోమేశ్వరినదిపై డాముద్వారా 90,000 కి. వా. (K. W.) విద్యుచ్ఛక్తి రాగల దనియు అంచనా వేయబడినది.

ఇక తూర్పుపంజాబు నదులపైగూడ డాముల ప్రాజక్టులు విస్తారముగా కట్టబడుచున్నవి. వీనిలో నంగల్ (*Nangal*) బక్రా (*Bakhra*) ప్రాజక్టులు అప్పుడే ప్రారంభింపబడినవి. వీని మూలముగా 4½ మిలియన్ ఎకరముల సాగుబడి కాగల దనియు, 300,000 K.W. విద్యుచ్ఛక్తిని పుట్టించవచ్చును. 1955 సం॥ నాటికి ఈ కట్టడము పూర్తికాగల దనియు తెలియుచున్నది.

ఇవియునుగాక ప్రాథమిక పరీక్షా దశలోనున్న ప్రాజక్టులుగూడ చాలగలవు. నేపాల్‌లో కోసి డాము (*Kosi Dam*)ను, మహానదిపై టిక్కర్ పార్, లేక నారాజ్ డాములును, ఒరిస్సాలో ముచికుంద (*Muchkund*) డామున్ను, మధ్యరాష్ట్రములో నర్మదా, తపతి, సోమేశ్వరి, లోయలలో డాములు కట్టుటకును, సంయుక్తరాష్ట్రములో చంబల్, సోన్ లోయలలోను, కర్ణాటకములో కాళీనది (*Kali river*) పైన డాములు కట్టుటకు యత్నములు చేయబడుచున్నవి. వీటన్నిటి మూలముగా మరి 4½ మిలియన్ కిలోవాట్ల విద్యుచ్ఛక్తియు, 20 మిలియన్ ఎకరముల సాగుదలయు, లభింపగల వని ఆశించుచున్నారు.

ఇంతటి శక్తిని వినియోగపర్చక మనల ననాథులుగా నుంచిన బ్రిటిష్‌వారికి కృతజ్ఞులము. కాని ఈ ప్రాజక్టులే పూర్తియైనచో దేశమునం దిక దుర్భిక్షము నుండజాలదని ఖచ్చితముగా చెప్పవచ్చును. సిరిసంపదలతోను, ఆరోగ్యవంతులగు నాబాలగోపాలముతోను, సస్యశ్యామలమై దేశము వెలుగొందగలదు. తిన తిండికై పరదేశీయుల బిచ్చమెత్తుచున్న దుర్దినములు పోయి, దుర్భిక్షమయిన యితరదేశములకు మన మాహారము పంపగల పరిస్థితులు రాగలవు. అపారమగు విద్యుత్తును సరిగా నుపయోగింపగల్గినచో దేశమందలి పరిశ్రమల పని సులభ మవగలదు. దేశసౌభాగ్యముతో, దేశీయుల జీవితప్రమాణములు అధిక మగుటయేగాక, వారి ఆదాయములుగూడ అధిక మవగలవు. అంతటితో, మన దేశచరిత్రలో మరియొక స్వర్ణయుగము ప్రారంభ మవగల దని ఆశించవచ్చును.

కథానిక :

వాస్తవిక జగత్తులో

నేను - మా ఆవిడ

శ్రీ భమిడిపాటి రామగోపాలం

అసలు మా ఆవిడ అంటే ఎవరు? నా పెళ్లాం. మా...అని ఉంది గదా, నీ పెళ్లాం అంటావేవిటి? అనబోకండి. దానికి కేవలం వ్యతిరేకం మా ఆవిడతో పంథా మా...అన్నది ఎంతో మందికి చెందదు. నా కొక్కడికే. మా—అంటే నాయొక్క. అది Royal we కి సంబంధించిన ఒక జాతీయం. ఒక్కొక్క జాతీయానికి తెలుగు భాషలో యిలాటి పరిస్థితులే సంభవిస్తాయి. యిక పదండి.

నాకు మా ఆవిడకీ పెళ్లి కాకముందటి సంగతి. నన్ను భర్తగా పొందాలని ఆ పిల్ల (అంటే మా ఆవిడ చిన్నప్పుడు) కోరలేదు (ఎవర్నీ కోరలేదు). ఆ పిల్ల వయస్సు పది సంవత్సరాలు. కాని నన్ను ఆమె పొందడం, నేను ఆమెని పొందడం కేవలం అదృష్టం బట్టే జరిగింది. అయితే నామట్టుకు నేను ఆ పిల్లని పెళ్లిజేసుకోవాలని కోరేను. యేవంటే అప్పటికీ మా ఆవిడలో సౌందర్యరేఖలు తొంగి జూస్తూ ముఖానికి వో దివ్యమైన కళ యిస్తున్నాయి. పువ్వు పుట్టగానే పరిమళిస్తుందంటారు.

నేను మా ఆవిడని పెళ్లి కాకముందుట్నుంచీ ప్రేమించుతున్నానని చెప్పేను కదూ! అయితే నా నోటమ్మట యిప్పుడు ప్రేమ అనే ముక్క, బుద్ధిపూర్వకంగానైనా, పొరపాట్నైనా అయినా, జారితే, ఆ ముక్క అనొద్దని మా ఆవిడ శాసిస్తుంది. అసలు యీ ముక్క దాంపత్యంమధ్య కెందుకు రావాలి? అని నేను తీరుబడిగా కూర్చొని ఆలోచిస్తూ వుంటాను. కాని ప్రేమ లేనిదే సృష్టే లేదు. అని వెంటనే తట్టుతుంది. అయితే మీ దాంపత్యంలో ప్రేమ అనే ముక్క యెప్పుడెప్పుడొస్తుంది? అంటారు మీలో కొందరు. చెప్పుతున్నా. మా ఆవిడకి అప్పుడప్పుడు ప్రణయకోపం వొస్తూంటుంది (పిల్లలు పుట్టకముందు ప్రతివాడిఆవిడకీ వొస్తుందని నా నమ్మకం.) ఆ ప్రణయ కోప సందర్భంలో ఆ కోపాన్ని చల్లార్చుదామని "యిందుకేనా నేను నిన్ను ప్రేమించాను?" అని అడుగుతాను. "ఆ ముక్క అనొద్దు" అని సున్నితంగా శాసిస్తుంది మా ఆవిడ. యేమి? అంటారు. మా ఆవిడకి కొంచెం (కొంచెమేమి? చాలా) పూర్వకాలపు వాసన. ఆమె మతంలో, ప్రేమ అనేది వొక కొత్త పదం; ప్రేమించడం వన పని గాదు.. ...అయితే యిహ, నామటుకు నేను, యీ 'ప్రేమ' అనే ముక్క నోటమ్మట వొదలకుండా వుండగల్నా?...ఊఁహూఁ! వుండలేను. యేమంటే నేను కొత్తకాలప్మనిషిని. నేను చదువుకున్న వాటిలో మాకు వుపవాచకాలన్నీ ప్రేమకథలు. నేను చూసిన సినీమాలూ, నాటకాలూ, అన్నీ ప్రేమమయం. నేను చదివిన నవల్నుకి ఆధారం ప్రేమ. కొన్ని సినీమాల్లోనూ నాటకాల్లోనూ ప్రేమదృశ్యాలు ఘోరంగా వుంటాయి. కొన్నింట్లో ప్రేమమయ మీ జగము; ప్రేమే దైవం, దైవమె ప్రేమ; యింత బ్రతుకూ ప్రేమమయం అని ఉద్బోధించారు. అంత ప్రేమమయప్రపంచంలో పుట్టి పెరిగిన నేను, 'ప్రేమ' అనే ముక్క నోటమ్మట కచ్చట్టకుండా వుండగల్నా..?

ఆడవాళ్లతో వ్యాపారం అంతా సున్నితం. మాట సున్నితం, పని సున్నితం; ఆలోచన సున్నితం. అంతా సున్నితమయప్రపంచం. తమ కొవలిసింది భర్త(ల) దెగ్గిర్నుంచి రాబట్టుకోవడంలో యెంతైనా సున్నితంగా వర్తిస్తారు. మా ఆవిడ ప్రతీనెలా యిరవైఆరో తారీకు నించి మంచి మంచి చీరెలు యెవరింట్లో వున్నాయో, యెవరు కట్టుకుంటున్నారో, బాగా (బాఘా) పరీక్షిస్తుంది. తెలియనిచోట ధరలుకూడా వాకబు చేయిస్తుంది. ముప్పయ్యో తారీకునించీ, మళ్లీ నెల యేడో తారీకు వరకూ చాలా ప్రేముగా, ముద్దుగా, చనువుగా, అప్పుడే కొప్పులో ముడుచుకున్న సంపంగిపువ్వంత సున్నితంగా ప్రవర్తించుతుంది. చెప్పిన పనెల్లా వెంటనే చేస్తుంది. అయిపోగానే పక్కని వొచ్చి కూచుంటుంది. నా విషయమయిన అలంకరణాల్లో శ్రద్ధ యెక్కువ చూపుతుంది. అనుకుంటే, నిజంగా, సినిమాలో హీరాయిన్ అయినా హీరోమీద అంత ప్రేమతో వర్తించదు. ప్రతీనెలా రెండో తారీకునాడు సినిమాకు వెళ్తాను. అప్పుడు మా ఆవిడనికూడా తీసుకెళ్లాలి. (అది మా ఆవిడ చేసిన సున్నితమైన గృహశాసనాల్లో వొకటి.) ఇక సినిమాలో అన్నిటికంటే ఆవిడకళ్లకి ఆకర్షణీయంగా కనిపించేది యేమిటో తెలుసా?

మూడో తారీకునాడు పొద్దున్నే కాఫీ పట్టుకొచ్చి, అది తాగుతూంటే అతి సున్నితంగా అడుగుతుంది. ఆ సున్నితంలోనే నిలవ దియ్యడం వుంది. "యేమండీ! చూచారా! పురాణం శాస్తుర్లుగారి కోడలు యెలాటిచీర! కట్టుకుందో! అలాటిది నా కొనాడన్నా కొని పెట్టేరూ? చుక్కల్చుక్కలూ గళ్లుగళ్లూ యెంచక్క జల్తారంచూ, యెంత బావుందండీ' ఆఁ...చక్కా అలాంటి చీరె కట్టుకుంటే చూడాలని మీకుమాత్రం లేదూ?... పైకి ఏదో లోకువయిపోతారని...... డబ్బు ఖర్చు అంటారుగాని మీకూ వుంది చీరెల సరదా! మరి యీ నెల జీతంలో అలాటి చీర కొంటారు గదూ! పదహారు రూపాయలేనట! ఆకాశపు వాళ్ల కొట్టు మీద దొరుకుతాయట!" (లేకపోతే నిన్న సినిమాలో కథానాయిక కట్టుకున్న చీరెలాంటిది) అంటూ, బుజాలు పట్టుకొని (అప్పటికి కాఫీ తాగడం అయిపోతుంది) వూపేస్తూ "అబ్బా! కొంటాను వూరుకోవే!" అనేవరకూ విడిచిపెట్టదు...అవును. కొంటానని చెప్పటం నాది తప్పే. కాని, యే మొగాడూ సున్నితపు జాతి (Gentle Sex) అయిన వాళ్ల సున్నితపు శాసనాలకి అడ్డుచెప్పడు. అది అంతఃపురరహస్యాల్లో వొకటి.... ఆఁ...... పైజెప్పిన రెండు చీరెల్లోనూ ఏదో వొకటి కొనాలి. లేకపోతే సమ్మె కట్టతుంది. యే సమ్మెకయినా ఆగొచ్చు గాని దీనికి ఆగలేం. శరీర మాద్యం భోజనంతో వుంది. గృహలక్ష్మి అలిగితే భోజనం...? లేకపోతే, అన్నిటికంటె సున్నితమైన ఆయుధం · యేడుపు ప్రయోగిస్తుంది. స్త్రీలకున్న ఆయుధాల్లో(అన్నీ సున్నితమైనవి;) అన్నిటికన్నా యిది సున్నితమైంది. యిదే పురుషుణ్ణి యెక్కువగా బాధపెట్టుంది... సరిగదా. యేడుస్తూన్న పెళ్లాన్ని బుజ్జగించకుండా... నేనే కాదు, యీ భూప్రపంచకమ్మీద... యే మొగుడూ వుండలేడు. ఇది అంతఃపురరహస్యం నెం. 2.

అదృష్టవశాత్తు మా ఆవిడ పచ్చి పల్లెటూరి పిల్లయినా, కళల్లోకెల్లా కళ, సంగీతం బాహా నేర్చుగుంది. వాళ్ల వూళ్లో బళ్లో అయిదో క్లాసు పేసయి పదకొండో యేట మా యింట మెట్టింది. మరి మూడేంళ్లు సంగీతం ఒక్కటే చెప్పించింది మా అమ్మ. చిన్నప్పుడు మా అక్క నేర్చుకుంటున్నప్పుడు నేనూ పక్కని కూర్చునేవాణ్ణి. అంచేత నాకు మా ఆవిడకన్నా బాగా వొచ్చు సంగీతం. తీరుబడిగా వున్నప్పుడు నేను ఆలాపన చేస్తూ వో రాకమాలికో, లేక త్యాగరాజయ్యగారికృతో పాడుకుంటాను. ఇంతలో హంసనడకలతో మా ఆవిడొచ్చి పక్కని కూర్చొని వొక్కొక్క రాగం చెప్పేసి, మహా వొచ్చినదానిలాగ ఆలాపించబోతుంది. కాని రాక వూరుకుంటుంది. నేనప్పుడు వికటంగా నవ్వుతాను. ఆ నవ్వు మా ఆవిడకి కోపం తెప్పించుతుంది. వెంటనే లేచి వెళ్లిపోతుంది.

ప్రతీ నెలా చీరెలు కొనమని మా ఆవిడ యిబ్బంది పెడుతూండడం నాకు సంవత్సరం నరతో విసుగెత్తింది. వో నెల రెండో తారీకుని వో కృతిలాంటిది తయారుచేసేను వొచ్చీ రాని కవిత్వంతో. ఆ వేళ సాయంత్రం మామూలుగా సినీమాకి వెళ్లేం. మొన్నాడు పొద్దున్నే పడకకుర్చీలో కూర్చుని ఆలాపన చేస్తున్నాను పల్లవిని. యింతట్లో నవ్వుమొహంతో, అతి సున్నితంగా, కంకల్లాడుతూ కాఫీ పట్టుకొచ్చి "ముందు ఈ కాఫీ కొంచెం ఆలాపన చెయ్యండి; తరవాత ఆ కాఫీ ఎలాగా అవుతుంది!... ఊఁ! కానీండి! లాపోతే చల్లార్తుంది!" పల్లవి కాఫీ రాగంలో "రామ నా మొరాలకింపుమా!" రామ శబ్దం స్త్రీయర్థంలో వుపయోగించేను. యిదేదో త్యాగరాయకృతి అనుకుని పక్కని కూర్చుని, తాళం వేస్తూంది. చరణంలో—

"చీటికి మాటికిని - చీరెలు తెమ్మంటావు" అన్నది మహా స్పష్టంగా పాడి,

"మరి యిక తెమ్మనకుమీ!" అని వొక్కమారు ఆపుచేశాను. అప్పుడు మా ఆవిడ మొహం చూస్తే (నిజంగా కెమేరా లేదు గాని) ఫోటో తియ్యా లనిపించింది. అంతవరకూ నిత్యసుహాసిని అయిన ఆ ముఖాన్ని అలా మార్చిన నన్ను నేను అభినందించుకోవాలో తిట్టుకోవాలో నా కేమీ తెలీలేదు......పైగా ఆవేళ మూడో తారీకు; నిన్న సినిమాలో చీరో, లేక పొరుగింట సీతమ్మ చీరో, ఆవిడకి నచ్చిందని సున్నితంగా నేను కాఫీ తాగుతూ వుంటే చెప్పడానికి వొచ్చింది. వొఖమారు యిలా మార్చేసేను. చటుక్కున అక్కణ్ణించివెళ్లిపోయింది. తరువాత అన్నాళ్ల కోమారు చీరెవూసు నేనే యెత్తేవాణ్ణి. ఆవిడకి భయమే చీరెవూసెత్తడానికి. అవునండీ! యింట్లో అధమం వో పదిహేను చీరెలయినా వుంటాయి. ఇంకా గాదెవారి నరసమ్మగారు కట్టుగున్నలాంటిదీ, చల్లావారి రమణమ్మ కట్టుగున్నలాంటిదీ, సినిమాలోలాంటిదీ యెందుకు చెప్పండి? నన్ను చూడండి! అరడజను పంచెలూ రెండు లుంగీలూ, ఎనిమిది వర్టులతో కాలక్షేపం చేస్తున్నాను. యీమధ్యనే మూడు ఫేంట్లూ మూడు ఫుల్‌షర్టులూ కుట్టించుకోవాలని అనుకుంటున్నాను. అనుకున్నది ఆచరణలో పెట్టడం కొంచెం కష్టమయిన పని - ముందు మా ఆవిడ చీరెలని ఎనక్కి నెట్టాలి. ఆనక నా బట్టలు. ఆ వుద్దేశం మీదే 'యీ చీరెలు ఒక్కొక్కటే పదిహేను రూపాయలు మింగుతాయి కనీసం" అన్నాను అంటే మా ఆవిడ. "యేం కబుర్లండీ! మీ హాప్‌నూట్లో? పన్నెండు రూపాయ లవుతాయి. దానికీ దీనికీ వ్యత్యాసం యెంత? మూడేగా!" అంటుంది. మా కుటుంబ దేశంలో, నిజంగా యీ బట్టల సమస్య వొకటి కష్టసాధ్యంగా వుంది పరిష్కరించుకోడానికి. అందికే నే దీన్ని మీఅందరిముందూ పెట్టి బట్టబయలు చేసేను.

మా ఆవిడ పల్లెటూరిపిల్లని చెప్పేను; మంచి సౌందర్యవతి అనికూడా చెప్పివుంటాను. అందులోనూ నీతను కోరిన చీరెకొని, అది కట్టుకున్న తరవాత చూస్తే (తనుకోరిన చీరెకనక తనకి నచ్చుతుంది; తనకి నచ్చితే నవ్వు మొహంతో వుండాలి; నవ్వుమొహంతో వుంటే) ఇంకా అందంగా వుంటుంది. అదే నే నావిడని ప్రేమించడానికి కారణం. ఒక్క విశేషం వుంది. ఆవిడకి తను సౌందర్యవతినని తెలీదు. మా ఆవిడ సౌందర్యం సహజం. అంతేకాని స్నో పవుడర్ల మహత్యంకాదు. అందుకే మా యింట్లో స్నో పవుడర్లుండవు. ఒక్క మైసూరు సాండల్‌వుడ్‌సోప్ తప్ప. అదీ నాకోసమే. పైవాళ్లు (నాకోసం) యెవరైనా వొస్తే వెంటనే లోపలి కెళ్లిపోతుంది. ఎవ్వరితోనూ మాట్లాడదు; ఎవ్వర్నీ చూడదు. అసలు నా వుద్దేశంలో అంత ముభావంగా వుండమని యేం కాదు. కాస్త కలివిడిగా వుండమనే. అలా అంటే కలివిడి చాలా ప్రమాదం అంటుంది.

నేను మా ఆవిణ్ణి చూసి, ఆ సౌందర్యంచూసి, అనుమానపడక్కర్లేదు; దానిపేరు ఒక పతివ్రత పేరు; ఆ పేరు నిలబెట్టుకోగల సామర్థ్యం ఆమెకి వుంది. పై మొగాడెవడైనా తనవేపు చూసినట్టు (ఆమెకి తెలీదు.) తెలిస్తే వెంటనే వాణ్ణి ఒక నీచమయిన పురుక్కింద కట్టేస్తుంది. వాడి వూసు యెత్తితే కోపమొస్తుంది. అట్టే అవసరం అయితే నా పాతచెప్పులకీ, గొరకచీపుళ్లకీ పని కల్పిస్తుంది బూజులు దులపకుండానే. ఆ గుణం పరీక్షిద్దామనే ఓ నాడు సాయంత్రం నిశ్చయించుకున్నాను.

అందరాడవాళ్లల్లాగా మా ఆవిడకి సాయంత్రం మంచిచీరె కట్టుకొని వీధుల్లో నిలబడ్డం అలవాటు లేకపోవడంవల్ల మా యింటి కెళ్లేసరికి తలుపులు బిడాయించి వున్నాయి. నేను గొంతు మార్చి—

"యేమండోయ్!" అన్నాను.

"యెవరది?" లోపల్నుంచి గంభీరంగా ఓ ప్రశ్న వొచ్చింది.

"నేనండి!"

"మా ఆయన లేరు!" ఇంకా తలుపు తియ్యలేదు. తలుపుతీస్తే నేను అనుమానపడడానికి కొంచెమేనా అవకాశం వుంటుంది.

"మీ కోసమే వచ్చానండీ! ఆయన లేకపోతే మరీ మంచిదీ! మన పని కింక అడ్డే వుండదు. ఇన్నాళ్లకి నాకు సమయం దొరికింది!" అన్నాను.

"ఎవ్రడా నువ్వు! వుండొస్తాను!" అని వెళ్లి తిరిగొచ్చి రౌద్రంగా తలుపు గడియ తీసింది. చేతులో ఓ పాత చెప్పుంది. నన్ను చూడగానే ఘటాల్ని ఆ చెప్పు పారేసింది. నాలో నేను ఋజువుపర్చుకున్నాను యింక అనుమానపడక్కర్లేదుగదా అని.

"అబ్బ! పోనిద్దురూ! యేమిటీ ఆటలు?" అంది నవ్వూ విసుగూ కలిసిన స్వరంలో.

"ఆఁ...యేం లేదు మాట వరసకి!" అన్నా. కోటూ చొక్కా విప్పుకుంటూవుంటే అవి అందుకుని లోపలపెట్టడానికి నుంచుని—

"కాదుగాని యెవడో ఆకతాయివెధవ అనుకొని, దవడ పచ్చడిజేద్దామని చెప్పు తీసుకొచ్చేను. నయం! చూసుకోకుండా నాలుగంటించేనుగాదు!" అంది.

"యేం? నాలుగంటించకపోయావా?"

"పోదురూ! మీరూ మీ మాటలూను! యెవరైనా వింటే నవ్వగల్రు!" అని కోటూ చొక్కా తీసుకుపోయింది.

మా వూరికీ, మా ఆవిడపుట్టిన వూరికీ మధ్య ఓ అరనైమైళ్లు రైలుమీద వెళ్లి, మూడుమైళ్లు బస్సుమీద వెళ్లి నాలుగుమైళ్లు నాటుబండీమీద వెళ్లాలి. మొత్తం వెళ్లి రావడానికి రెండురోజులు కనీసం పడుతుంది. అక్కడికి సంవత్సరాని కోసారి, లేదా రెండుసార్లు వెడుతుంది మా ఆవిడ. వెళ్లి అందరూ చేసినట్టు వో రెణ్ణెల్లు అక్కడ వుండిపోదు. పదిహేనరోజుల్లో వొచ్చి తీసుకురండి అని చెప్తుంది. వెళ్లిపోతూ వెళ్లిపోతూ మా ఆవిడ నాకిచ్చే మహోపదేశం ఈ విధంగా వుంటుంది. "పదిహేన్రోజుల్లో వొచ్చితీసుకురండి. లేకపోతే మీ రిక్కడ కాఫీ దగ్గిర్నుంచి హోటళ్లకి తగలేస్తారు. అప్పడాలూ వొడియాలు వున్నాయి. పెరట్లో కూరలు కాస్తయి. యేదో తీరుబడి చూసుకొని కూరచేసుకోండి. అంతగా కావ్పాతే అప్పడమో వొడియమో చేసుకోండి. నిష్కారణంగా బద్ధకించి హోటళ్లకి తగలెయ్యకండి సొమ్ము. పొద్దున్నే లేవగానే వో అరశేరు బియ్యం కుంపటిమీద వేసుకున్నారంటే వో అరగంటసేపులో వుడుకుతుంది. అత్తిసరు పెట్టుకోండి మీరు వార్చలేరు...నె య్యయిపోయిందిగావున్ను...రేపు ఆదివారంనాడు పైడెమ్మ వొస్తుంది వో పావుశేరు కొలిపించుకోండి..." యింకా యెంతో.

వెళ్లి వుత్తరమేనా రాయదు. రాయగల్దు. కాని యేమో? "ఏం వుత్తరమేనా రాయలేదు?" అని అడుగుతాను వొచ్చేక. "వుత్తరం రాయగల్నుగాన్ని మావూళ్లోవాళ్లు నవ్వుతారు, మొగుడికుత్తరాలు రాసిందే! అని. మొన్న రాసిన వుత్తరం, మా వెంకప్పగాడి చేతికిచ్చి 'వొకే పోస్టులో పడేరా. యెవ్వరడిగినా చూపెట్టకు.' అని చెప్పేనండోయ్. వాడేం జేసేడూ! కాలేటబ్బికూతురు సోదెమ్మ నెరగరూ! అది పిల్చి అడిగితే చూపెట్టేడు. అక్కణ్ణించీ 'దీని విడ్డూరం చూడండి! మొగుడికుత్తరం రాసిందే!' అని చాటుతోంది. నే రాస్తాను! నా యిష్టం! నా మొగుడికి రాసేనా యింకెవర్తి మొగుడికేనా రాసేనా? మధ్య దీని కెందుకో!... [illegible]నోటా అనోటా పడి మా అమ్మ వింది. అసలదే రాయ

(16వ పేజీ చూడుడు)



కృష్ణదేవరాయు నిర్మితమైన ఆలయప్రాకారముపై ఒక శిల్పకళాఖండము.

"సంధ్యారంభ విజృంభితం, శ్రుతిశిర
స్థానాంతరాధిష్ఠితం,
సప్రేమభ్రమరాభిరామ, మసకృ
త్సద్వాసనాశోభితం,
భోగీంద్రాభరణం, సమస్తసుమనః
పూజ్యం, గుణావిష్కృతం,
సేవే శ్రీగిరిమల్లికార్జునమహా
లింగం, శివాలింగితమ్."

"భృంగీచ్ఛానటనోత్కటః కరిమద
గ్రాహీ స్ఫురన్మాధవా,
హ్లాదో నాదయుతో మహాసితవపుః,
పంచేషుణా చాదృతః;
సత్పక్షస్సుమనోవనేషు సపున
స్సాక్షాన్మదీయే మనో
రాజీవే భ్రమరాధిపో, విహరతాం
శ్రీశైలవాసీ విభుః".

శ్రీశంకరభగవత్పాదులు శివానందలహరిలో భ్రమరాధిపుడైన శ్రీగిరిమల్లికార్జునస్వామిని భావస్ఫోరకము, హృదయానందకరము, అయిన రెండు మనోజ్ఞమైన శ్లోకాల్లో స్తుతించారు. శ్రీశైలక్షేత్రమునుగాని, శ్రీశైలేశునిగాని, ఇంతకన్న ఉత్కృష్టంగా మన కండ్లఎదుట ప్రత్యక్షమయ్యేట్లు అభివర్ణించిన కవితల్లజుని మరొకణ్ణి కానము: "శ్రీశైలశిఖరం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే" అని మన పెద్దలు చెబుతూ ఉంటారు.

మనుష్యుడికి పుట్టినది మొదలు గిట్టే వరకూ జీవితమే ఒక యాత్ర. ఈ జీవితయాత్రలో అనంతంగా కొట్టుమిట్టాడుతూన్న జీవికి పవిత్ర తీర్థక్షేత్ర సందర్శనం దైవదర్శనం శాంతి, సుఖదాయకమూ ఇహపరానందకారకమూది. అట్టి పవిత్రక్షేత్రములలో ఉత్తమోత్తమమైన శ్రీశైలయాత్ర అంత సులభసాధ్యమైనదికాదు. ఏతన్మార్గం దుర్గమమైనందున, ఏడుగురు యాత్రికులు క్రిందటేడు మార్గమధ్యంలో బండిలోయలో పడిపోయినందువల్ల ఈ జన్మే లేకుండా పునరావృత్తిరహితు లయ్యారు. తెనుగుదేశంనుంచి ప్రధానంగా శివరాత్రికి, కర్నాటక దేశంనుంచి ఇతర ప్రాంతాలనుంచి సంవత్సరాదికి ప్రవాహంగా యాత్రికులు వస్తూ ఉంటారు.

మహాభారతంలోను, స్కాందపురాణంలోను దీని ప్రసక్తి ఉన్నది. శ్రీశైలమాహాత్మ్యాన్ని గూర్చి స్థలపురాణం ఇల్లా చెబుతోంది. శిలాదుడనే మహాముని శివునిగూర్చి ఈ ప్రదేశంలో ఘోరమైన తపస్సుచేశాడు. శివకటాక్షాన నందీశ్వరుడు, పర్వతుడు అనే పుత్రు లిద్దరు అతనికి కలిగారు. పర్వతుడుకూడా తండ్రిలాగానే శివుని గూర్చి తపస్సుచేశాడు. శివుడు ప్రత్యక్షమై నీకేం కావాలో కోరుకోమన్నాడు. అప్పుడు పర్వతుడు కైలాసాన్ని వదిలేసి ఈ శైలంమీదే స్థిర నివాసం తాము కల్పించుకోవలసింది మహాప్రభో" అని విన్నవించాడు. ఆ మహాభక్తుని ఈప్సితార్థానుసారంగా పర్వత లింగాకృతిలో శివుడు అచ్చట శాశ్వత నివాసిగా ఉండిపోయాడు. ఈ విధంగా శ్రీశైలమన్న నామం వచ్చింది. ఇదేగాకుండా

శ్రీశైల

మరోగాథ ఉంది. వసుమతి అనే ఋషికన్య బ్రహ్మ నిమిత్తమై గాఢతపస్సు చేసి శ్రీదేవి అని పేరు సంపాదించింది. ఆ ప్రకారం శ్రీగిరి అనే పేరు సార్థకమైంది. ఇంకో కథ ఉంది. చంద్రగుప్తుడు యుద్ధానికి వెళ్లివచ్చేసరికి కుమార్తె పుట్టి యుక్తవయస్సురాలై కూర్చుంది. ఆమె కుమార్తె అని చెప్పినా అతడు వినక ఆమెను బలాత్కరింపపోయాడు. ఆమె తప్పించుకొని అల్లా అల్లా తిరిగి చివరకు శ్రీశైలానికి చేరుకుంది. ఆమె మల్లికాపుష్పాలతో శ్రీశైలేశుని పూజచేసింది. శివుడు భక్తురాలికి ప్రత్యక్షమై పాతాళగంగవరకు వచ్చిన ఆమె తండ్రిని "పచ్చని శిలకమ్మ"అని శపించి ఆమెను రక్షించాడు. మల్లికాపుష్పాలతో పూజింపబడిన శివుడు చాలా ప్రీతుడై మల్లికార్జునుడని పేరు దాల్చాడు.

బ్రహ్మగిరి, విష్ణుగిరి రుద్రగిరుల మధ్య ప్రవహించుచున్న కృష్ణాస్రవంతి కొంత ఆకుపచ్చగాను, కొంత నీలివర్ణముగాను ఉండుటకు కారణము శివుని శాపముచే అక్కడ పడిఉన్న పచ్చని శిలయే నని చెబుతారు: కృష్ణమ్మతల్లి గభీరమై, నిశ్చలమై, ప్రశాంతమై అక్కడే నిలిచిపోయిందా అన్నట్లు ఉంటుంది.


శ్రీరామచంద్రుడు రావణసంహారానంతరం, లంకను జయించి, బ్రహ్మహత్యాదోషనివారణకై శ్రీశైలప్రదక్షిణంచేసి, సీతాసమేతుడై శ్రీగిరినిలయుని అభిషేకముచేసి అర్చించినట్లు చెబుతారు. పాండవులుకూడా అజ్ఞాతవాసంలో ఇక్కడ ఉన్నట్లుల ఆలయంలో ఉన్న పంచ పాండవుల గుళ్లు నిదర్శనం. శ్రీశైలమార్గంలో భీముడు తపస్సుచేసిన స్థలానికే భీముని కొలను అని పేరు వచ్చింది.

శ్రీకృష్ణదేవరాయ లీప్రాంతమును జయించి శ్రీశైలరాజ్యాన్ని నిర్మించాడనీ, ఒక గవర్నరును నియమించాడనీ గుడిపైన ఉన్న శాసనాలు చెబుతున్నయి. గుడిచుట్టూ కోటకట్టించాడు. కోటగోడలపై గిరితనయ తపోదీక్ష, శివుని ప్రత్యక్షము, మున్నగుపురాణ గాథలు, ఏనుగులు, గుర్రాలు, చేపలు, మున్నగు మనోహరమృగాల దృశ్యాలు అపూర్వముగా చెక్కించాడు. సింహద్వారమున కెదురుగా ఉన్న రాచవీథిని చూస్తే హంపీబజారు స్ఫురణకు వస్తుంది. ముష్కరులైన తురుష్కుల బారినుండి ఈకొండమీదనే శివాజీమహారాజు తలదాచుకొన్నాడు. భవానిని అర్చించి విజయుడైనాడు. అతను కట్టించిన గోపురాన్నే శివాజీ గోపుర మని పిలుస్తున్నారు.

ద్వాదశజ్యోతిర్లింగాలలో శ్రీశైలలింగం ఒకటి. మల్లికార్జునస్వామిని చేతితో పట్టుకొని, శిరస్సుతో తాకి అర్చించవచ్చు. వీరశైవుల కిది



శ్రీశైలదేవాల




కృష్ణాతరంగిణికి పోవుదారిలో గంగమ్మగుడి రాతిస్తంభముపైని శిల్పిచూపిన ప్రజ్ఞాచాతుర్యములు.



పాతాళగంగ (కృష్ణ)

క్షేత్రము

మహాక్షేత్రం. స్వామివారి ఆలయంలో ఒక జంగం, భ్రమరాంబాలయంలో బ్రాహ్మణుడు అర్చనచేస్తూ ఉంటాడు. ఏటా శివరాత్రికి 50, 60 వేల భక్తులు శివనామ సంకీర్తనముతో యాత్రకి వస్తారు. భీముని కొలను దగ్గిర కొంతకాలంక్రితం ఒక జంగమదేవర బంధువులందరినీ పిలచి షడ్రసోపేతంగా విందు చేశాడు. వాళ్లని అక్కడే ఉంచి, ఇప్పుడే వస్తానని చెప్పి, కొలనుపై వెరపుగొలిపేట్లు తొంగిచూసే పర్వ




ద. సింహద్వారము

తాగ్రంపైకి ఎక్కి 'మల్లికార్జునా' అని ఒక్క ఉరుకు ఉరికాడు. సహస్రవక్కలై శివసాయుజ్యాన్ని చెందాడు. పూర్వకాలంలో భ్రమరాంబకు నాలుకలుకూడ బలిఇస్తూ ఉండేవారని చెబుతారు. జంగాలు, కర్నాటకులు ఎక్కువ ఉగాదికి వస్తారు. వచ్చి 'మా దేవుణ్ణి వదలిరమ్మంటానికి మీ రెవరు' అని గుళ్లో ఎక్కువ హారాం చేస్తూ ఉంటారు. చైనా యాత్రికులైన ఫాహియాన్, హ్యూన్‌స్టాంగ్ శ్రీపర్వతాన్ని గూర్చి తమ చరిత్రలో చెప్పిఉన్నారు. తమిళ భాగవతశిఖామణులు అప్పర్, సుందరర్, సంబన్ధరులు తేవారములలో శ్రీశైలస్వామిని గూర్చి గానముచేసిఉన్నారు.

మా యాత్ర:

'శ్రీశైలస్య ఈశాన్యదిగ్భాగే, కృష్ణాగోదావరిమోర్మధ్యదేశే' అని త్రికాల సంధ్యావందనమునందు చెప్పుకోవడమేగాని ముప్ఫయ్యేళ్లు వచ్చేదాకా ఆ శ్రీశైలక్షేత్రమును దర్శించు భాగ్యము అబ్బిందికాదు. 'అబ్బో శ్రీశైలం అంటే మాటలే. నిటారైన మెట్లు ఎక్కేసరికి కీళ్లు పట్టేస్తాయి' అని యాత్రికులు చెబుతూ ఉంటే అది అంత అసాధ్యంగా భ్రమపడుతూఉండేవాణ్ణి. అయితే 'బవమానవమానస తిరస్కారత్వ రాహంకృతిః' చరించడానికి సిద్ధుడు ప్రవరాఖ్యునికి ఉపదేశించి దివ్యౌషధమువంటి పాదలేపమేమైనా దొరికితే బాగుండు ననిపించేది. క్రిందటేడు, 70 ఏండ్ల మాఅమ్మగారు శివరాత్రికి శ్రీశైలం వెళ్లివచ్చేసరికి అంత ముదుసలి ఆమెయే ధైర్యంతో వెళ్లిరాగా లేనిది ఈ శివరాత్రికి మనం వెళ్లితీరాలనే స్థిరసంకల్పం కలిగింది. ఇంతలో మిత్రులు హాలహర్వి సీతారామరెడ్డి, మాధవమీనన్ గారలు శ్రీశైలయాత్ర సంకల్పించుకొన్నారు. ప్రసంగవశాత్తు ఈసంగతి తెలిసి సీతారామరెడ్డిగారి ప్రోత్సాహంతో డిసెంబరు 24 న పట్నంలో బయలుదేరి 25 కర్నూలులో మకాము చేశాము. ఈ ప్రయాణానికి ముందు గూడా జిల్లా అధికారులు అది ఘోరారణ్యమనీ, చలి కాళ్లు కొంకరలు పోయేట్లు చేస్తుందనీ చెప్పారు. ఈశ్వరేచ్ఛ బలీయమైందవటంచేత, మా ప్రయాణానికి ఎట్టి అంతరాయం కలుగలేదు. 26 ఉదయం కర్నూలునుంచి బయలుదేరి ఆత్మకూరు మీదుగా 9 గంటలకల్లా పెద్ద చెరువు చేరాము. మార్గమధ్యాన ఒకట, నెమళ్లగుంపు అడవి కోళ్లగుంపులు కనిపించినవి. కర్నూలునుంచి ఆత్మకూరు 44 మైళ్లు. ఆత్మకూరునుంచి నాగలూటి 12 మైళ్లు. నాగలూటినుంచి పెద్దచెరువుకు పదిమైళ్ళు కొండలమీంచిపోవాలి. మేము ఒక స్టేషన్ వేగను సంపాయించాము. మా బండిలో సీతారామిరెడ్డి, మాధవమీనన్ దంపతులూ ఉభయ



శివాజీగోపురము

పరివారమూ మొత్తం 8గురు ఉన్నాము. మా వెనక జీపులలో జిల్లా ఉద్యోగస్థులు కొందరు వచ్చారు.

శ్రీశైలం

సముద్రమట్టానికి శ్రీశైలం 1500 అడుగుల ఎత్తున ఉన్నది. తూర్పు, పడమరలుగా మూడు నాలుగు మైళ్లవరకున్నూ, ఉత్తర దక్షిణాలుగా ఆరేడు మైళ్లు ఈ కొండలు ఉన్నాయి. నల్లమల కొండల్లో ఉత్తరాగ్రాన కర్నూలుజిల్లానంది కొట్కూరుతాలూకాలో ఉంది క్షేత్రరాజం. కృష్ణానది తూర్పు పశ్చిమ ఉత్తర దిశల ఈ శైలాన్ని చుట్టి వస్తున్నది. దక్షిణదిశను మటుకు ఒక కొండవాగు భీముని కొలనుమీదుగా వెడుతోంది. ఈ ప్రాంతాన్నే భీముడు తపస్సుచేసిన స్థలమని ఒక మండపాన్ని చూపిస్తారు.

భోజనం చెయ్యడంతోనే ముందు గుర్రాలపైనా, కూలీలతోను మాసామాన్లు పంపించాము. 11½ గం||లకు బయలుదేరి 'జై పరమేశ్వరా' అని పెద్దచెర్వునుంచి ఒక మైలు మటుకు కారులో వెళ్లి, అక్కడనుంచి కొండ ఎక్క లంకించుకున్నాము. మొత్తం వందమంది దాకా తయారయ్యారు. నడవలేనివారికోసమని ఆరు డోలీలుసిద్ధంగాన మా వెంటవస్తూనేఉన్నయ్. రెండు గడలకు నర్సరావుపేటకుర్చీ కట్టి నల్గురు మనుష్యులు మోసేట్లుగా తరకం డోలీలను నమర్చారు. ఈ డోలీలుమోసేవాళ్లు మామూలుగా ఆత్మకూరు, నాగలూటి మున్నగు గ్రామాలనుంచి రప్పించబడ్డారు. పెద్దచెర్వుదగ్గర రకుగాలీల సెటిల్మెంటు, వాళ్లకు కొన్ని పశువులు, ఆస్పత్రి, బడి ఉన్నయ్. అక్కడ మలేరియా బాధ అధికమైనందున ప్రతిఇంట్లోనూ ఒకళ్లూ ఇద్దరూ చలిజ్వరపీడితులై ఉండనే ఉంటారు. వాళ్లు మామూలుగా ఫారెస్టు డిపార్టుమెంటువాళ్లిచ్చే పనులు చేస్తారు. ఒక్కొక్కసారి తెల్లవారేసరికి అడవిమధ్యకుపోయి దొరికిన దుంపలు తినివస్తూ ఉంటారు. చింతగింజలువంటి బూడిదలో కలిపి ముద్దలుచేసి తింటూ ఉంటారు. కొర్రలూ, జొన్నలూ వండుకుతింటారు. వెదుళ్లనుంచి బద్దలుతీసి, కొందరు కూలిచేసి జీవితం గడుపుతారు. ఇక్కడ మలేరియా వల్ల వైద్యులూ, ఉపాధ్యాయులూ కూడ ఉండరు. ప్రస్తుతం వైద్యుడు ఉన్నాడుగాని ఉపాధ్యాయుడు లేడు. పిల్లలు అతిథాయులుగా గంతులు వేస్తూ ఉంటారు. శివరాత్రికి వీళ్లు మూటలు మోస్తారు. డోలీలవాళ్లు శివరాత్రికైతే రూ 50/- వరకూ వసూలు చేస్తామని ఇప్పుడు ప్రభువులచిత్తమనీ అన్నారు. మా బృందంలో భీమునికొలనులోపు అలసిపోయిన ఇద్దరు ముగ్గురు తప్ప అంతా కాలినడకనే చేశారు. భీమునికొలను దరిచేరేసరికి ప్రకృతికాంత తన సౌందర్యాన్ని విరియబోసుకున్నట్లు అనిపించింది. ఒకవైపు పర్వతశృంగంపై ప్రకృతే శిల్పాన్ని చెక్కినట్లు అచ్చెరువు గొలిపింది. మరొకచోట అభేద్యకుడ్యంగా పరిణమించింది. అక్కడే కొండ అంచువిరిగి ఒకరిద్దరు మరణించారట. అక్కడ అల్లా విరిగిపడిపోతూన్న భాగాలను కూల్చి ప్రమాదం లేకుండా చెయ్యాలి. నాల్గు గంటలకల్లా భీమునికొలను చేరి చల్లని జలాలతో సేద తీర్చుకొన్నాము.

కైలాసద్వారం సాక్షిగణపతి

ఇక్కడి మెట్లుఎక్కడం కొంచెం కష్టం. మొదటికొండ ముగించేసరికి ఒక గండం గడిచినట్లే అనిపిస్తుంది. భీమునికొలనుకు పెద్ద చెర్వు

(17-వ పేజీ చూడుడు)



భ్రమరాంబాసహిత శ్రీశైల మల్లికార్జునుని అభిషేకార్చనల ముగించినమీదట ఆలయప్రాంగణమున చేరిన భక్తబృందము. మధ్యన సీతారామరెడ్డి, మాధవమీనన్ దంపతులు, దీపాలుట్ల విశ్వనాథరావు, కోటయ్యనాయుడు గారలు, ఇతర ఉద్యోగులు ఉన్నారు.



"దేవకన్యా - రాజకుమారుడు"-కథ

శ్రీ కాపగంటి చిన్నసర్వేశ్వరరావు

అనగా అనగా ఒక పట్టణములో ఒక రాజు వుండెను. ఆ రాజునకు యిద్దఱు భార్యలు వుండిరి. ఆ యిద్దఱికి కూడా సంతానము లేదు. ఆ రాజుపుత్రులకొఱకు కాళికాదేవి పూజ చేయుచుండెను. ఆ వూరిలో వున్న గుడికి పోయి పూజచేసి మరలి వస్తూవుండేవాడు. ఒకరోజున కాళికాదేవి ప్రత్యక్షమై 'రాజా, నీవు యీ ఫలము పుచ్చుకొని నీ యిద్దఱు భార్యలకు యిమ్ము; కొన్నిరోజులకు ఇద్దఱకు రాజకుమారులు పుట్టుదురు. నీ రెండవ భార్య కుమారుని పదవయేఁడు వచ్చిన పరువాత నాకు మరల బలి యివ్వవలెను. లేనిచో నీకు పుత్రులు కలుగరు" అని చెప్పి యంతర్ధానమయ్యెను. వెంటనే రాజు సరేనని అనుకొని యింటికి బయలుదేఱెను. ఇంటికి వచ్చి కాళికాదేవి చెప్పినట్లుగా యిద్దఱకును యిచ్చెను. కొన్నిరోజులు గడచిన తరువాత యిద్దఱకును గర్భములు వచ్చెను. వచ్చి కొన్ని నెలలకు రాజు ఇద్దఱు భార్యలకు యిద్దఱు రాజపుత్రులు పుట్టిరి. రాజకుమారులు దినదినమునకు పెరుగుచుండిరి. రెండవ కుమారునకు కృష్ణపరమాత్మని మీద భక్తి యధికమగుచుండెను. రెండవ రాజకుమారునకు పదియవ సంవత్సరము పూర్తి అయినది. ప్రొద్దుటనే లేచి తల్లి కుమారునకు తలకి నీళ్లు పోయుచుండగా తల్లి కంటనీరు రాజకుమారుని శిరస్సుమీద పడెను. ఆ రాజకుమారుడు తల్లివైపునకు చూచెను. తల్లి కంట నీళ్లు పెట్టుట చూచి 'అమ్మా, నీవు కంటిధార పెట్టుటకు కారణము ఏమిటో చెప్పుము.' అని రాజకుమారుడు విచారముతో అడిగెను. తల్లి 'నాయనా' నీవు నాకు లేక లేక కాళీవరప్రసాదము వల్ల పుట్టితివి. నిన్ను పది సంవత్సరములు పూర్తి అయిన వెంటనే కాళికకు 'బలి యిమ్మని అడిగినది. మీ నాన్నగారు వప్పుకొనిరి. నిన్ను ఈ రోజున కాళికి బలి యిచ్చెదరు. అందుచేత నేను విచారిస్తూయున్నాను. అని చెప్పి మఱింత యేడ్వ సాగినది. రాజకుమారుడు తల్లిని ఓదార్చి కాళి గుడి దగ్గఱకు బయలుదేఱెను. రాజకుమారుడు గుడి దగ్గఱకు వెళ్లి 'కాళికా, రా, నన్నుతిను' అని గట్టిగా కేక వేసెను. కాళికకు భయము వేసెను. వెంటనే 'ఎవరు ?' అని లోపలనుంచి అడిగెను. రాజకుమారుడు నన్ను యీ రోజున నీకు బలి యివ్వవలసినది అని మా నాన్నగారితో నీవు చెప్పినావట యిప్పుడు నేను వచ్చితిని. తలుపు తీయుము' అని కేక వేసెను. కాళిక చిన్న కన్నము క్రింద తలుపు తీసి 'దానిలో నీ కుడిచేయి పెట్టుము' అని చెప్పినది. వెంటనే రాజకుమారుడు కుడిచేయి ఆ కన్నములో పెట్టెను. కాళిక చేయి తినివేసెను. మరల ఎడమచేయిని పెట్టుమనెను. రాజకుమారుడు ఎడమ చేయిని పెట్టెను. కాళిక ఆ రాజకుమారుని ధైర్యమునకు మెచ్చుకొని, 'నీవు ఎక్కడకు వెళ్లినను జయముకలుగును' అని చెప్పి మంత్రముచేత కుడిచేయిని మామూలుగా చేసెను. కాళికాదేవి దీవించి రాజకుమారుని యింటికి పంపివేసెను. రాజకుమారుడు యింటికి వచ్చునప్పటికి, రాజకుమారుని తండ్రీ, తల్లీ ఏడ్చుచుండిరి. రాజకుమారుడు వెళ్లగానే యేడ్పులు మానివేసి సంతోషముతో రాజకుమారుని కౌగలించుకొనిరి. రాజకుమారుడు కాళికాదేవి చెప్పినది అంతా తండ్రితోను, తల్లితోను చెప్పగానే తండ్రి ఆశ్చర్యపోయినాడు. మరునాడు వుదయమున రాజకుమారుడు తండ్రిగారితో 'నాన్నగారూ నేను దేశసంచారము వెళ్లిరావలెను' అని చెప్పెను. రాజుగారు రాజకుమారునితో 'నాయనా నీవు యీ రాజ్యములో నున్నంతవఱకును మాకు ఏ ఆపదలును రాలేదు నీవు వెళ్లిన మాకు ఏమియును తోచదు' అని తండ్రి చెప్పెను. రాజకుమారుడు తండ్రి అనుమతిమీద ఆరుమాసములలో వచ్చుటకు బయలుదేఱెను. వెళ్లేటప్పుడు దారిలో తినుటకు కొంత ఆహారమును, ఒక గుఱ్రమును, కొన్ని పుష్పములను తీసుకొని వెళ్లెను. రాజకుమారుడు గుఱ్రము మీద కూర్చొని కృష్ణపరమాత్మని మీద పూజ చేయుచు వెళ్లుచుండెను. కృష్ణుడు యితని భక్తికి మెచ్చి కొంత దూరములో ఒకమేడ సృష్టించెను. కృష్ణుడు ముసలిబ్రహ్మణుని వేషము వేసికొని రాజకుమారుని యెదుటకు వచ్చి 'నాయనా, నాకు ఆకలి అగుచున్నది; ఆహారము పెట్టుము' అని అడిగెను రాజకుమారుడు తన దగ్గరయున్న ఆహారము పట్టుకొని క్రిందకు దిగి ఆ, ఆహారము యిద్దఱు తిని విశ్రమించుటకు ఆ మేడలోనికి ముసలి బ్రాహ్మణుడు తీసుకొని వెళ్లెను. రాజకుమారుడు ఆ ముసలి బ్రాహ్మణుని తాతగారూ అని పిలుచుచుండెను. 'తాతగారూ' మీకు ఏమి కావాలని అడిగెను. తాతగారు' పూజ చేయుటకు పుష్పములు తీసుకురా నాయనా, అని చెప్పిరి. రాజకుమారునితో 'రాజకుమారా' నీవు పుష్పములు తీసుకొని వచ్చేటప్పుడు, తూర్పు దిక్కునకు, పడమర దిక్కునకు, ఉత్తర దిక్కునకు పోయి, తెమ్ము. దక్షిణ దిక్కుకుమాత్రము వెళ్లవద్దు, అని చెప్పెను. రాజకుమారుడు రోజూ మూడు దిక్కులకు వెళ్లి పుష్పములు తెచ్చుచుండెను. ఒకరోజున రాజకుమారుడు నాల్గవ దిక్కున ఏమి వున్నదోయని బయలుదేఱెను. అక్కడ దేవకన్యకలు స్నానము చేయుచుండిరి. రాజకుమారుడు తిన్నగా యుండక అక్కడ వున్న కోకలలో ఒక అందమయిన కోక తీసుకొని పరుగున, పరుగున వచ్చుచుండెను. ఆ కన్యకలు చూచియజమానురాలితో చెప్పిరి. ఆ కోక యజమానురాలిది. ఆమె వెనకాల వచ్చుచుండెను. రాజకుమారుడు ఎవరయినా వచ్చుచున్నారేమోయని వెనుకకు తిరిగి చూచెను. రాజకుమారుడు చూచేసరికి వెంటనే శిల అయ్యెను. యిక్కడ మన తాతగారు యీ రోజున త్వరగా రాలేదే అని ఎదురు చూచుచుండిరి. ఏదోజరిగి వుండును అది ఒక కమండలముతో కొంచెము నీళ్లు, ఒక బెత్తము చేతితో పుచ్చుకొని దక్షిణ దిక్కునకు బయలుదేఱిరి. దారిలో మన తాతగారికి మన రాజకుమారుని శిల కనబడెను. తాతగారు ఆ శిలపై కొంచెము నీళ్లు చల్లి బెత్తము పుచ్చుకొని కొట్టెను. వెంటనే రాజకుమారుడు లేచి తాతగారికి నమస్కారము పెట్టెను. యిద్దఱు కలసి మేడదగ్గఱకు బయలుదేఱిరి. రెండవ రోజున తాతగారు రాజకుమారునితో 'రాజకుమారా' నీవు కోక పట్టుకొని పరుగెత్తుకొని వచ్చేటప్పుడు వెనుకకు తిరుగకు, అని చెప్పిరి. రాజకుమారుడు బయలుదేఱెను. రాజకుమారుడు క్రింద రోజు వెళ్లి తీసిన కోక యిప్పుడునూ తీసి పరుగెత్తుకొని వచ్చుచుండెను. ఆ కన్య వెనకాల పరుగెత్తుచు 'దాహము, దాహము' అనెను. రాజకుమారుడు వెనుకకు తిరిగి చూచెను. రాజకుమారుడు మరల శిల అయ్యెను. యీరోజున కూడా ఎందుచేత రాలేదు అని తాతయ్య కమండలముతో నీళ్లు బెత్తము పట్టుకొని బయలుదేఱెను. దారిలో మన రాజకుమారుడు శిల అయిన చోటు వచ్చినది. తాతయ్య మంత్రము నీళ్లు చల్లి బెత్తముతో కొట్టెను. రాజకుమారుడు వెంటనే లేచి తాతగారికి నమస్కరించెను. యిద్దరు కలసి యింటికి వెళ్లిరి. మూడవ రోజున రాజకుమారునితో, 'రాజ కుమారా' నీవు వెళ్లేటప్పుడు, ఒక చెంబులో నీళ్లు ఒక చెప్పులజత, ఒక కండువా పట్టుకొని వెళ్లు. ఆ కన్య దాహము అనినప్పుడు ఆ చెంబు వదలి వేయుము. వంటిమీద గుడ్డ లేకుండ ఎంతదూరము రాగలను అనినప్పుడు ఆ కండువా వదలి వేయుము ఎండలో కాళ్లు కాలిపోవుచున్నవి అని అనినప్పుడు చెప్పుల జత వదలి వేయుము. వెనకకు తిరిగి చూడకుండా వచ్చి వేయుము' అని చెప్పిపంపెను. రాజకుమారుడు మరల క్రిందటిరోజున తీసిన కోక తీసుకొని పరుగెత్తుకొని వచ్చుచుండెను. ఆ కన్యపరుగెత్తుచు దాహము అనెను. రాజకుమారుడు చేతిలో వున్న చెంబును వదలెను. మరల వంటిమీద గుడ్డ లేకుండ ఎంత దూరము రాగలను అని అనెను. రాజకుమారుడు పైమీద వున్న కండువా వదలెను. మరల ఎండలో కాళ్లు కాలిపోవుచున్నవి ఎంత దూరము రాగలను అనెను. రాజకుమారుడు కాళ్లనున్న చెప్పులజత వదలెను. ఇంతలో మేడ వచ్చెను. రాజకుమారుడు కోక పట్టుకొని వచ్చి తాతగారికి యిచ్చెను. తాతగారు ఆ కోకను రాజకుమారుని తొడలో పెట్టి రాజకుమారుని బల్లిగా మార్చి తన వీపుమీత పెట్టుకొనెను. యింతలో దేవకన్య వచ్చి 'కృష్ణా' నీకు యిది న్యాయమా? నాచీర నాకు యిప్పించుము' అని వేడెను. 'కృష్ణుడు' అతడు నిన్ను ప్రేమించినాడు గనుక అతనిని పెండ్లి చేసుకొనవలెను' అని చెప్పెను. దేవకన్యక, కృష్ణుని మాటమీద వప్పుకొనెను. కృష్ణుడు బల్లిని రాజకుమారునిగా మార్చెను. ఆ దేవకన్య రాజకుమారునకు తన తల వెంట్రుక ఒకటి తీసి యిచ్చి 'నీవు దీనిని దులిపినప్పుడు వచ్చెదను, అని చెప్పి తన చీర పుచ్చుకొని వెళ్లిపోయెను. యిలా వుంటూ వుండగా ఒకనాడు తాతగారు రాజకుమారునిపిలిచి 'నాయనా' నేను రేపు చనిపోయెదను. నీకు రెండు వరములు యిచ్చెదను. అవి యేమి అనగా తాడన్న, దుడ్డన్న, అవినీ శత్రువులు వచ్చినప్పుడు ఎంతమందినైనను నరే తాడన్న అనగానే అందఱను ఒక్కసారిగా కట్టివేయును. దుడ్డన్న అనగానే కొట్టివేయును' అని చెప్పెను. మరునాడు మన తాతగారు చనిపోయినారు. రాజకుమారుడు విచారముతో కర్మలు చేసి యింటికి బయలుదేఱెను. అక్కడ తన తండ్రి రాజ్యము, మన రాజకుమారుడు వెళ్లిన కొంత కాలమునకు శత్రురాజులు వచ్చి రాజకుమారుని తండ్రిని ఓడించి రాజ్యమును లాగుకొనిరి. తండ్రి, తల్లి, అన్నగారు, పుల్లలు అమ్ముకొని జీవించుచుండిరి. రాజకుమారుడు వెళ్లి రాజ్యము ఓడిపోయిన సంగతి తెలిసికొని, ఒక పేరాసి పెద్దమ్మ యింటిలో బస చేసెను. 'పెద్దమ్మా, యీ వూరిలో

(20-వ పేజీ చూడుడు)


(పిల్లల కథ)

ఎత్తుకు పై ఎత్తు

చి. ఏకా జయలక్ష్మి

గోపాల్‌కు సాయంత్రం కాంగానే తనతో చదువుకునే పిల్లలతో ఆడుకోటం అలవాటు. రోజూ చీకటి పడీ పడక ముందే ఇంటికి చేరుకునేవాడు. ఒక రోజున ఆడుకునేందుకు స్నేహితులెవరూ కనపడలేదు. ఏం చేద్దామన్నా తోచక బజారువెంట పోతున్నాడు. కొంత దూరం పోంగానే పకోడీల వాసన కొట్టింది. అక్కడ ఆగి ఎటునుంచి వస్తున్నదా అని తేరిపార చూచేసరికి ఎదురు గొందిలో ఉన్న మిఠాయి దుకాణంలో పకోడీలు వండుతున్నట్లు గోచరించింది. సరాసరి పోయి మిఠాయి దుకాణం దగ్గర నుంచొని ఆ వాసన పీలుస్తున్నాడు.

పకోడీలు కొనుక్కోటానికైనా జేబులో కాసీ డబ్బు లేదు. పాపం ఏం చేస్తాడు? నుంచోని నుంచోని నిరాశతో పోబోయెను. అప్పుడా దుకాణదారు ఎదురువచ్చి ఆపి కదలటానికి వీలు లేదు. అప్పటి నుంచీ పకోడీల వాసన పీలుస్తున్నావు. దానికి ఎంత డబ్బు చెల్లించగలవో చెల్లించి కదలమని దబాయించాడు. పకోడీలు కొనుక్కోటానికి కాసీ డబ్బులేక బాధ పడిన గోపాల్ ఏమీ తోచక ఆ దుకాణంలోనే కూలబడ్డాడు. రోజూ చీకటి పడీ పడక ముందే ఇల్లు చేరుకునే గోపాల్ ఈ రోజు ఎందుకు ఆలస్యం చేశాడా అని ఇంట్లోవాళ్లు ఖంగారు పడటం ప్రారంభించారు. అందరూ బజారుకు టక్కొక్కరు వంతున గోపాల్‌ను వెతికేందుకు పోయిరి. గోపాల్ అన్న ఒక బజారున పోతూ గొందిలో ఎదురుగా ఉన్న మిఠాయి దుకాణంలో తమ్ముణ్ణి చూసి అక్కడకు వెళ్ళి చీకటిపడ్డా యింటికి ఎందుకు రాలేదంటూ పోదాం పద మని చేయిపట్టుక లేవతీయబోయే సరికి దుకాణదారు అడ్డువచ్చి తీసుక వెళ్ళటానికి వీల్లేదు. ఇందాకటి నుంచి పకోడీల వాసనంతా పీల్చాడు. దానికి తగినంత డబ్బు చెల్లించి తీసుక వెళ్ళ వచ్చునని గోపాల్‌అన్నతో దుకాణదారు అన్నాడు. అతనికి ఏమీ తోచక అటూ ఇటూ చూసి జేబులో నాలుగు రూపాయినాణాలు ఉన్నందుకు సంతోషించి జేబులో చెయ్యిపెట్టి అవి గలగల మ్రోగునట్లు అటూ ఇటూ కొంచంసేపు కదలించాడు. ఇంక పోదాం పద మని తమ్ముడితో పోబోయే సరికి ఇందాక చెప్పినమాట ఏమిటి మరల ఈ మొండిపట్టు దేని కని దుకాణదారు తిరిగి అడ్డువచ్చాడు. దానికి గోపాల్ అన్న నవ్వుతూ నా తమ్ముడు పకోడీల వాసన పీల్చాడు, నీవు రూపాయినాణాల గలగలశబ్దం విన్నావు, రెండింటి సరి పోయింది. ఇంక చింతించవలసిన అవసరం లేదని తమ్ముడితోసహా వెళ్ళాడు. దుకాణదారు ముఖం తెల్ల పోయి ఎత్తుకు పై ఎత్తు వేశాడే అని తన అవివేకానికి చింతించాడు.



తాళ్ళపాకవారి పదములు

శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

౧౩

పెద తిరుమలయ్య రచన: (సంపు. ౨; ప. ౩౬౯)

వరాళిరాగం - రూపకతాళం

[పల్లవి]

(౧) , సరి గరిగ మ-గరి సరిస | , ససా రి సని ధ గా రి సారిగసరి
అట్టె పెంచితే బెరుగు నడచితే నడంగు ను

(౨) , ని సరిగరి గమ పా, మగా సరిస | , స సా గరిస ని ని ధ గా మ మ గ గ రి రి
అట్టె పెంచితే బెరుగు నడచితే నడం గు ను

(౩) సని సరిగరి గమ మధమ గరిస | , ససామ గరిని నిధ గా మమగగ రిరి
అట్టె పెంచితే బెరుగు నడచితే నడం గు ను

(౪) సని సరిగరి గమ పాధని ధపమా గరిస | సరిస నిధధ గగ మమపధ సాం రి నిధప మమ గగరి రి
అట్టె పెంచి తే బెరుగు నడచి తే డం గు ను

సని (అట్టె)

[అనుపల్లవి]

(౧) , గగ పమగా గమ పాధ పాధనిధప | మగ గా మపా మధమ గరిసరిసరి
దిట్టలై వివేకులార తెలుసుకో రో

(౨) ని గగ పమగా గమ పాధ సనిధని ధపమా | గ గ మపామ పమగమపధ నిధపమగరి
దిట్టలై వివేకులార తెలుసుకో రో

(౩) సని గగ పమగా గమ ధా సని సరిగరిసా | సరి నిస పధ మపగమపధని సరిస నిధపమగరిగరి
దిట్టలై వివేకులార తెలుసుకో రో

సని (అట్టె)

[చరణం]

, పపాప ధపమగగా | మా పధపప | , పమా పధా ని ధా పా పమగరి
తలచకుం డగవలె తలచితే కామాదులు

గమ పపాధ పమగమపధ సాం నిధపమ గరిస | , సని గా గా పమగమ పా, , , ,
పాలుచని ప్పల నేయి పోసినట్లు

(౧) , ధపామ ధా, నీధ నిసస | , స సా రి సరి గా గరి స సనిసరిసా
కలగకుం డగవలె కలగితే మనసు

(౨) , ని ధపామ ధపపమగగ మపధని సగరిసస | , స సా ని గా, మ మ గగరి సరిస
కలగకుం డగవలె కలగితే మనసు

(౧) , ని పధ నిసరిగ సా సరి సనిధా సాస | సా నిధ రి సనిధా నిధమగరిస
చెలగి చీమల పుట్ట చిమ్మిరేగి నట్లుండు

(౨) ,, ,, ,, | సా ని ధరిసనిధప పమగమపధనిధపమగరి|| సని (అట్టె)
చిమ్మిరేగి నట్లుండు

ఇట్లే ఈ క్రింది చరణాలు:

(౨) - ఎడ మియ్యకుండవలె - ఎడ మిచ్చితే గోపము
విడివడ్డ కోతికి - వెఱ్ఱి తినట్లు;
పొడగట్టకుండవలె - పొడగట్టితే నాసలు
కడళ్ళతో సముద్రము - కడతేరనట్లు || (అట్టె)

(౩) తగులకుండగవలె - తగిలితే భోగములు
జిగురుగండె బత్తులు - చిక్కినట్లు;
తగ శ్రీ వెంకటేశ్వరు - దాసు లిందు బ్రమయరు
జిగి మించిన యమృతము - చేతి కిచ్చినట్లు || (అట్టె)

లఘుటీక :

కడళ్ళు = తెరలు; సముద్రములో తెరలు ఎప్పటికిని శాంతింపనట్లు, ఆశలు ఒకమారు పొడగట్టితే తరువాత ఎప్పటికిని అణవనట్లు. జిగురు గండె = బంకపూసిన దార్వపుకండె; పక్షులను పట్టుటకు పనికి వచ్చేది, అంటితే వదలనిది.

ముద్రితపాఠములు :

గ్రామాదులు, కలుగకుండగ, పొడిగట్టకుండ, జిగిమించెనమృతము.

నేను - మా ఆవిడ

(11-వ పేజీ తరువాయి)

నియ్యదు, 'కావలస్తే తమ్ముడిచేత రాయించక పోతే, అన్నయ్యొచ్చేకరాయించు. నువ్వురాయడ మేవిటీ?' అనికూకమిలేసింది. పోనీగాని, వెంకప్ప రాయగల్డండీ? నాలుగో క్లాసు చదూతున్నా డన్నమాటేగాని కూడబలుక్కునే చదువు తాడు. అయినా వెంకన్న మేస్టారు చచ్చి పోయింతరవాత ఆబడి కెవ్వడూ శ్రద్ధబెట్టక అలా తగలడుతోంది...ఇక మా అన్నయ్య.. పదిహే న్రోజుల కోమా రొస్తాడు. నే నున్నప్పుడు వొస్తాడో రాడో! వాడొచ్చినప్పుడు నే నుంటానో వుండనో!...అంచేత మీకు మరి వుత్త రాలు రాయడం కుదరదు...కావలస్తే మీరు రాయండి!.. అయినా మీరు రాస్తే అలా యిలారాయరు. ప్రేమ గీమ అంటూ వోపుస్తకం రాస్తారు! అక్కణ్ణించీ 'యేమిట్రాసేడే నీ మొగుడూ!' అంటూ వొస్తుంది మాఅమ్మ. యేబుటీ! యింక ఆ వుత్తరం దానికి చదివి విని పించాలి. నాకు సిగ్గేస్తుంది సుమండీ? మొన్న వారం వుత్తరం చదవమంది. వెంకప్పగా డొకడు. బడీ చదువూ అన్నీ వొదిలి వెనకాలే కూచున్నాడు. అప్పుడు, యేవో ఆ ముక్కలు తప్ప తక్కింది చదివేను. వెంకప్పగాడు వెనకొత ల్నించి 'అమ్మా! అక్క కొంత చదివి కొంత దాచేస్తోందే!' అన్నాడు. అయినా దానికి మాత్రం కనపడదూ! 'వోసి నీయిల్లు బంగా రంగానూ! యిదేనుటే అంత గ్రెంధవ్వూనూ?' అని సాగదీసుకుంది. మీరు రాసింది మూడు కౌయితాలు. రెండుకౌయితాలు ఆప్రేమచెత్తే. నాకు వొళ్లు మండిపోయిందిసుమండీ! నేను రాస్తే ఆతంటా మీరు రాస్తే యీతంటానూ!... మనం మరి వుత్తరాలు రాసుకోనే వొద్దు. పది హేన్రోజుల్లో యేం కొంప మునిగిపోదు."

మా ఆఫీసువాళ్లమంతా వోసారి 'రేవతి'అనే సాంఘికనాటకం వేశాం. నేను అందర్లోనూ బాగా పాడగల్ననీ, నాకు హీరోపాత్ర యిచ్చేరు. ఆ నాటకానికి మా ఆవిడని తీసు కెళ్లి, ఓ రిజర్వుడు కుర్చీలోకూర్చోపెట్టి "నేను నాటకంలో వేస్తాను!" అనిచెప్పి వెళ్లిపోయాను. ఒక ప్రేమదృశ్యంలో నేను కథానాయకురాల్ని కవుగలించుకోవలసి వచ్చింది. ఆ దృశ్యంలో అట్లా చెయ్యాలని జ్ఞాపకం వొస్తే నేను మా ఆవిణ్ణి తీసుకురాకపోయేవాణ్ణి. కాని యేం జేదును! మొదటి దృశ్యంలో నన్ను చూసి పొంగి పోయిన మా ఆవిడ పరస్త్రీని కౌగలించుకుం టున్న నన్ను చూసే. అసహ్యించుకొని వెళ్లి పోయింది. బయట ఆఫీసుప్యూను రామస్వామి వుంటాడు. జట్కా వుంటుంది. ఆ దృశ్యంలో మరి బాగా నటించలేకపోయాను. నాటకం ఆఖర్న యింటి కొచ్చి చూద్దును మా ఆవిడ; యేడుస్తోంది.

"హయ్యొ పిచ్చిపిల్లా! నాటకంచూసి యిల్లా ఏడుస్తారా యెవరైనా; లే! అది వొట్టి నాటకం తెలుసా! పైని అసలు అలా జరగనిస్తానా?"

"ఈరోజు నాటకాలే వేస్తారు. రేపు.. "

"అమాటంటావని నాకు తెలుసు! అనకు!" అని, ఆమాటనకుండా నోరు నానోటితో మూస్సేను.

"మరి నాటకాల్లో వెయ్యొద్దండీ! యేదో భగవంతుడిచ్చింది డబ్బూ మర్యాదావున్నాయి; మనకి మరి నాటకాలొద్దు!"

"పోనీ, నువ్వుకూడా వెయ్యి నాటకాల్లో!"

"చాల్లెండీ! సౌభాగ్యం! ఇంకా చాలక నన్నుకూడా వెయ్యమంటున్నారు! ఛీ! మీ లాగ నే నేం వాచి కూర్చోలేదు......నలుగురి యెదుటా—వేదికమీద...ఫలానివాడి పెళ్లాం... అని అందరూ ఆడిపోసుకోవాలా యేం?

"నువ్వు నాతోతప్ప యింకెవ్వరితోటీ నటిం చకు!"

"ఏమో బాబు! మీరు వెయ్యొద్దు, నేను వెయ్యను. మీరువేస్తే నన్ను చంపుకుతిన్నట్టే,"

"అలాగేలే."

మూడురోజులు గడిచేయి. ఆనాడు మా ఆఫీసుగుమస్తా ఒకడు నా కో ఫోటోగ్రాఫు ఇచ్చేడు. నాటకంలో నేను సరస్వతి పాత్ర ధారిణిని కౌగలించుకొన్నప్పుడు చాకచక్యంగా ఫోటో తీసేడు. నేను దాన్ని జేబులో దాచి వుంచేను యింటి కొచ్చిన తరవాత-

"అయితే, నువ్వు నాటకం యెంతవరకూ చూశావ్?" అని మా ఆవిడని అడిగేను.

"అప్పుడే నా కసహ్యంవేసి లేచి వెళ్లి వొచ్చేను. నాటకమంతా చూడలేదు!" అన్నది.

"మరోసారి చూస్తావా?" అని జేబులో వున్న ఫోటో చూపించేను.

"ఛీ! దరిద్రం!" అంటూ చించి, పారేసింది.

"పోనీ! నేను నాటకాల్లో వేస్తే వొచ్చిన నష్ట మేమిటి?"

"నష్టవేవిటా? మొదట నాటకాలే వేస్తారు. తరవాత, స్వర్గసీమసినిమాలోలాగ..."

"నీకు గాకుండా పోతానంటావ్! పిచ్చి దానా! నాటకాల్లో వేసినంత మాత్రంలో నీమేద ప్రేమ తగ్గిపోతుం దంటావా?"

".. ......" ఏడుపుమొహమే నాకు జవాబు.

"పోనీ మరి వెయ్యనులే!"

"అంతే గాదు. అవూసుకూడా యెత్తకండి!"

"అయితే...నాటకానికి తీసికెళ్తే వొస్తావా?"

"నేను రాను!"

"యేం?"

"ఆవేళలాగ నన్నక్కడ కూర్చోబెట్టి మీరు నాటకం వేస్తా నని వెళ్తారు! నన్నేడిపించ డాని కెలా అయితేనేం?"

"నీయిష్టం!"

నిష్కారణంగా మా ఆవిడని యేడిపించడం యిష్టం లేక నేను మరి నాటకాల్లో వెయ్యలేదు. ఎప్పుడైనా నాటకం వొస్తే నన్ను వొదల్దు మా ఆవిడ, సినిమాకైనా వెళ్లనియ్యదు. అస లిల్లు కదల్నియ్యదు. దాని అనుమానం మరేం లేదు. కొంపదీసి నాటకంలో వేసేస్తానేమో అని! ఆమె వుద్దేశం యేమిటంటే, నాటకంలో వేసి నప్పుడల్లా అలాంటి పరిస్థితి సంభవిస్తుందని... మా ఆవిడకి భయపడే, నేను వో నాటకంలో హాస్యగాడి పోర్షనుకూడా వొదిలీసేను.

కొన్నాళ్లకిందట నే నొక కల్పితశృంగార స్వీయానుభవం రాసేను. అది స్వీయానుభవంగా మార్చడానికి కారణాలు లేకపోలేదు. నిజమని నమ్మాలి ప్రపంచం. అనుభవకర్త మనస్సులో వూహాలు అతిసులువుగా ఎత్తి చూపొచ్చు. అది వో పత్రిక్కి పంపించాను. ఖర్మవశాత్తూ అది ఆ పత్రికవాళ్ళు ప్రచురించేరు. అభివందనాలతో వొక పత్రిక(సంచిక) పంపేరు మాకు. పోస్టుమేన్ చేతుల్లోంచి (నే నింటిదగ్గర లేక పోవడంవల్ల) మా ఆవిడ అందుకుని ఆ కథ చదివింది. ఆ కథ కల్పితం అని మా ఆవిడకి తెలీదు.

"చేసిన పని చేసిన ట్టూరుకోక,—అందరికీ తెలిసేట్టు అచ్చుకొట్టించుతారా? అదికూడా ఒక కేపర్ ఏమిటి?"

"ఏమయింది?" అని నేను మెల్లగా అడిగేను. నా కథపత్రికలో వేసినట్టూ, ఒక కాపీ నాకు వొచ్చినట్టూ నా కేమీ తెలీదు.

"మీరు బియ్యే చదివే రోజుల్లో...మీ మేన మామగారింట్లో...ఆయనకూతురు శకుంతలతో ...యెంత హాయిగా వుండేవాడండీ?" కోపం, అసూయ, మిళితమైన స్వరంలో ధమాయించి అడిగింది. జ్ఞాపకం తెచ్చుకోవడం కష్టమయినా, జ్ఞాపకమొచ్చిన తరవాత—

".. సికేలా తెలిసింది?"

"నాకేమిటి? లోకానికంతటికీ తెలిసేటట్టు అచ్చు..." అంటూ ఆపుస్తకంతీసి, పేజీవిప్పడం కష్టంకూడా నాకులేకుండా "ఇదిచిత్తగించండి" అంటూ దమాయించింది.

నాస్థితి ఆలోచించండి! "ఆఁహాఁ! పడ్డదీ!" అంటూ నేను సరదాగా వున్నాను.

"అబ్బ! యేమి కులాసా! వొక్కమారు జ్ఞాపకమొచ్చిందిగాబోలు.. శకుంతల!...అంద గత్తె. పదహారేళ్లపడుచు.. " నేనుపకపక నవ్వి "అదంతా నిజమనుకుంటున్నావా వెర్రిదానా! ప్రతీదానికీ యిలా అపార్థాలుతీసుకుంటేయెలా? నేను బియ్యే యెప్పుడు చదివేనో నీకు జ్ఞాపకం లేమా! నువ్వు కొత్తగా మా యింటికొచ్చి నప్పుడే! యెక్కడ చదివేనో తెలుసా! మాయింట్లోనే, యిక్కడే. ఆరోజుల్లో యెవ రైనా నిన్ను మీబావ యేం చేస్తున్నాడని అడి గితే, బియ్యే చదువుతున్నారు అని చెప్పేదానివి! జ్ఞాపకం తెచ్చుకో! పోనీ అసలు సంగతి యేమిటో చూశావా? మా మేనమామ లిద్దరికీ కొడుకులే గాని కూతు ళ్లెక్కడ? కూతు రుంటే..." మా ఆవిడ యింతసేపూ వింటూంది తల వొంచుకొని చిన్న చిరునవ్వుతో. యిప్పుడు మధ్యలో కల్పించుకొని, "కూతురుంటే నన్నెందుకు పెళ్లాడతారూ...?" అని సాగ దీసింది.

"ఆ కథ వొట్టి కల్పితం. యిప్పటికే నా తెల్సిందా?"

"సరే గాని," మాఆవిడ మూతి ముడుచుకొని అంటోంది.

"మీ రింక కథలు రాయకండి!"

"రాస్తే యేం?"

"ఎప్పుడో ఓనాడు నన్నుగూడా వీథిన పెడ తారు...అచ్చువేయించుకూ?"

"నేను రాసేవన్నీ అబద్ధాలూ! నీ కేం?"

"అబద్ధాలూ వొద్దు నిజాలూ వొద్దు! యీసారి రాస్తే......"

"అఁ అఁ అఁ అఁ...వొట్టెయ్యకు! రాయన్లే!"

ఆనాటినుంచీ నేను మరి కథలు రాయడం మానుకున్నాను మా ఆవిడకి భయపడి. యేమిటి నువ్వు మాటాడితే మీఅవిడకి భయపడుతావ్! మొగాడివి కావుటోయ్! అనకండి. అలా భయ పడాల్సిందే. స్త్రీఅంటే యేమి టనుకున్నారు?. ఊఁహుఁ! యేం లేదు...ఆనక దీన్నిగురించి వో పుస్తకం రాస్తాను... ఆఁ! యేమిటీ? భయ పడాలికదూ! అవును! గాంధీఅంతటి మహా పురుషుడికి తప్పలేదు భార్యకి భయపడ్డం. అయినా, కాకపోయినా అమాయకురాలు ఆమెని యేడిపించడం యెందుకనేనా వూరుకో వాలి.

"ఫోటో తీయించుకుందామా?" అని అడి గేను వోసారి మా ఆవిడని. ఆవిడకి, ఫోటో అంటే యేమిటో తెలుసు. మాయింటో మా నాన్న గారివీ, మాఅమ్మవీ, యిద్దరూ కలిసున్నవి, మా అక్కయ్యకి పెళ్లి కాకముందు మేమందరం తీయించుకున్నది, మా అక్కా నేనూ, సంగీతం మేస్టారూ వున్నదీ, నా యింటర్మీడియేట్లోదీ యింకా యెన్నో ఫోటోలు రోజూ చూస్తూనే వుంది. కాని అవి యెలా వొస్తాయో తెలీదు. ప్రాథమిక తరగతుల్లో యీ ఫోటోలగురించి సుతరామూ చెప్పరు.

తీయించు అన్నది నొక్కి "ఫోటో తీయించు కోవాలా?" అంది. "అవును." అంటూ ఆ పద్ధతి అంతా యేకరుబెట్టాను.

"అక్కడికి మనం వెళ్లాలా, లేపోతే వాళ్లే వీథెంట తిరుగుతారా అదేదో పట్టుగొని?" అని అడిగింది- వీథెంట కూరలూ అవీ అమ్మే వ్యాపారస్తులు జ్ఞాపకం రాగా.

"మనమే అక్కడి కెళ్లాలి."

"అయితే సరే. మీ రెళ్లి జట్కాబండి తీసుకు రండి!"

"కొంపదీసి యిలాగ వొస్తావేమిటి అక్క డికి? శుభ్రమైన చీరె కట్టుకో. కాఫీకలరు సిల్కు చీ రేమయింది? యిలాంటివాటికి పనికొస్తుం దనే కదూ కొన్నాం? సబ్బుపెట్లో వాసనసబ్బు తీసి వోమారు మొహం అదీ చక్కా తోముకో."

"అబ్బ! ఆ సబ్బునురుగు ముక్కులో దూరి మంటపెడుతుందండీ!"

"పరవాలేదులే!... ఆఁ...నే నొచ్చేసరికి శుభ్రంగా, సిద్ధంగా వుండాలి. యెంత శుభ్రంగా వుండాలో తెలుసా?...చూస్తే... ముద్దు..."

"ఛా! మీ రెప్పుడూ యిలాటి మాటలే!" అంటూ లోపలి కెళ్లి పోయింది.

"వీథితలుపు జాగ్రత్త!" అని నేను వెళ్లి అర గంటలో తిరిగొచ్చేను.

"వో పావుగంటవుండవోయ్! బట్టలు మార్చు కోవాలి!" అని జట్కాఅబ్బితో చెప్పి వెళ్లేసరికి లోపల అప్సరకన్యలాగా వుంది తయారుగా మా ఆవిడ. నాపాఠం నాకే వప్పగిస్తోంది. అక్క ణ్ణించి:

"నన్ను శుభ్రంగా వుండమని మీ రేమి టిలా తయారయ్యేరు?"


"వస్తున్నా." ఒక పదినిముషాల్లో శుభ్రంగా టాయిలెట్టయి వొచ్చేను.

సాధారణంగా, మగాడూ ఆడదీ కలిసి యెక్కడికైనా జట్కామీద వెళ్లాలనుకుంటే మగాడికి ఫుట్బోర్డుమీద కాలేసి కూర్చోడం గొప్ప సరదా. అంచేత ఆడదాన్ని లోపల కెళ్ల మంటాడు. "కొంగు తగుత్తే కోటివేలు" అను కొనే జట్కావాడు "మీదికి రండమ్మా! యింకా! యింకా!" అంటాడు. అది గమ నించి మా ఆవిడ "మీరు లోపలి కెళ్లండి! నేనే పైన గూర్చుంటాను!" అంది. యిదే, స్వచ్ఛమైన మా ఆవిడగుణం తెలియజేస్తుంది.

ఇంకా యిలాంటి కథలు అనేకం వున్నయి మాఆవిడనిగురించి.

మొత్తానికి మా ఆవిడకి సౌందర్యానికి తగిన చిలిపితనం, చలాకీతనం ధర్మం, న్యాయం మొద లైన గుణాలు వున్నయి: చదువుకోకుండా, అంత అక్షరశూన్యురాలు గాకుండా వున్నదాన్ని చేసు కున్నందుకు నేను చాలా అదృష్టవంతుణ్ణి. యిందుకుముఖ్యంగా మాఅమ్మ వందనీయురాలు. (ఆమె ఆత్మ శాంతి నొందుగాక!) దగ్గిరవాళ్లకి పెడసరం యెక్కువ. చదువుకున్నదానికి ప్రపంచం కనపడదు (అందులో మనదేశంలో). చదువుకోనిదాంతో అసలు వేగలేం. యివన్నీ తప్పించి నాకు యీ పెళ్లి జేసినందుకు మాతల్లిని యెంత మెచ్చుకుంటే గ్రంథం విసుగవుతుంది? యింత మంచిపెళ్లాం యింకెవరికీ దొరక దని నా నమ్మకం. కాస్త దొరికినాదుర్వినియోగం చేసు కుంటారు కొందరు మూర్ఖులైన భర్తలు. విని యోగం చేసుకోడం తెలిసినవాడికి యేది దొరి కినా పర్వాలేదు. "కనకపు సింహాసనమున శున కము గూర్చుండబెట్టి పట్టము గట్టినా వెనుకటి గుణం మానదు."


ఆఁ...ఇక ఆఖరుసంగతి. మాసంసారం అంతా యిట్లా వీథి బెట్టానని మా ఆవిడ దెబ్బ లాడదు; తెలిస్తే దెబ్బలాడుతుంది. కాని తెలీ కుండా వుంచగల్ను. ఏమంటే, యీమధ్యనే పుట్టింటి కెళ్లింది. మళ్లీ ఆరేడునెల్లవరకు రాదు. మే మిద్దరం మాతాపితలం (అవబోతున్నాం లెండి!) అయిం తరవాత, మా ఆవి డొచ్చింతర వాత, మీ కందరికీ వో పెద్ద టీపార్టీ చెయ్య గలనని అనుకుంటున్నాను.



బత్తుల కామాక్షమ్మగారు నిర్వహించుచున్న సంస్కృతకళాశాలను రాష్ట్రపతి సందర్శించినపుడు తీసిన ఛాయాచిత్రం.

శ్రీశైల క్షేత్రవ:ం

(13-వ పేజీ తరువాయి)



నుంచి 5 మైళ్లు. అక్కడికి కైలాసద్వారం ఒక మైలు. కైలాసద్వారంనుంచి సాక్షి గణపతికి మూడు మైళ్లు. భీమునికొలనునుంచి కైలాస ద్వారంవరకు నడక సునాయాసం కాదు. సాక్షి గణపతిదగ్గర అన్నివైపులనుంచీ వచ్చే మార్గాలు కలుస్తాయి. ఇహలోకం వదలి జీవుడు యముడి దగ్గర హాజరు పెట్టినపుడు సాక్షి గణపతి 'ఈ జీవుడు ఫలానప్పుడు శ్రీశైలం వచ్చాడు. కనక వీడు స్వర్గార్హుడు అని సాక్ష్యమిస్తాడు. మాకు భీముని కొలనువద్ద ఒక బ్రాహ్మణుడు కలిశాడు. ఆయన మనశ్శాంతినిమిత్తం ఆయా పుణ్య క్షేత్రాలు దర్శిస్తూ వస్తూ మహానంది వచ్చాడు. అక్కడ కలలో ఈశ్వరుడు కనిపించి ఫలాన రోజున నువ్వు బయలుదేరి వెడితే సుఖంగా దర్శనం అవుతుంది అని చెప్పాడట. అతడు మమ్మల్ని చూసి ఈశ్వరలీలకు ఆశ్చర్యచకితుడై నమోవాకము లర్పించాడు. శివుణ్ణి స్మరిస్తూ, శివానందలహరి వర్ణిస్తూ, సాక్షిగణపతిదగ్గరకు చేరుకున్నాము. ఆ ప్రాంతాలనుంచి శ్రీశైలశిఖరాన్ని దర్శించాము. అక్కడే బెజవాడవైపునుంచి వినుకొండ, గుండ్లకమ్మ, మార్కాపురం, గాజులపల్లి, నంద్యాల స్టేషన్లలో దిగి యాత్రికులు కలుసుకుంటూ ఉంటారు. వినుకొండ, గుండ్లకమ్మమార్గం 75 మైళ్లు. వినుకొండనుంచి శివపురానికి పదిమైళ్లు. శివపురంనుంచి త్రిపురాంతకం 12. మైళ్లు త్రిపురాంతకంనుంచి దిగువపాలెం 10 మైళ్లు. దిగువపాలెంనుంచి గడ్డమీదిపల్లివరకు ఆరు మైళ్లు. గడ్డమీదపల్లినుంచి ఎగువపాలేనికి నాల్గు మైళ్లు, అక్కడనుంచి జంగాలపాలెం 9 మైళ్లు. ఇంతవరకు బళ్లమీద రావచ్చు. అక్కడనుంచి అడవి మార్గం. జంగాలపల్లినుంచి ఎడంబావి 6, తెలుగురాయనిపాలెం 4, చినరూట్లవారు చుక్కలపర్వతంమీదుగా 6 మైళ్లు, అక్కడనుంచి శిఖరేశ్వరానికి నాల్గుమైళ్లు, అక్కడనుంచి పాలధార 1 మైలు, హాటకేశ్వరం 1 మైలు, సాక్షి గణపతి 1 మైలు.

చుక్కలపర్వతం 27 మెలికలు ఉన్నది. ఒక్కొక్క మెలికకు 27 మెట్ల చొ॥ 15 727 మెట్లు మొత్తం ఉన్నవి. ఇది చాలా కష్టమైన మార్గం.

మార్కాపురమార్గం 65 మైళ్లు, మార్కాపురంనుంచి 11 మైళ్ళు మెదిటరోడ్డు ఉంది. అక్కడనుంచి తోకపల్లి 13 మైళ్లు తోకపల్లి నుంచి తోరణాలకు 14 మైళ్లు బండి వెడుతుంది. తోరణాలనుంచి చింతల అడవికి 7 మైళ్లు, జరిగంమిద్దెల 7, చినమాట్ల 5 మైళ్లు ఉన్నవి. వినుకొండ మార్కాపురంరోడ్లు ఇక్కడ కలుస్తయి. నంద్యాల ఆత్మకూరుమార్గం 61 మైళ్లు. మోటార్లు, బళ్లు, గాజులపల్లి, నంద్యాల స్టేషన్లనుంచి ఆత్మకూరువరకూ 30 మైళ్లు. కర్నూలునుంచి ఆత్మకూరు 40 మైళ్లు. ఆత్మకూరునుంచి నాగలూటి 12 మైళ్లు, నాగలూటి నుండి పెద్దచెర్వు 10 మైళ్లు. అంతవరకు బస్సులు, బళ్లు పోతను.

సూర్యాస్తమయం వేళకు శ్రీశైలం చేరుకున్నాము. పాదరక్షలు లేనివాళ్ళకు పల్లేరుకాయలు అడుగడుగునా పల్కరించి వదలిపెట్టినాయి. అధికారులు వస్తున్నారని ఏదో మార్గాన్ని కంటకరహితం చేశారు. దారిపొడుగునా పూచికముళ్లు శివనామస్మరణకు హెచ్చరిక చేస్తూనే ఉన్నయి. అదిగో ద్వారక ఆలమందలవిగో అన్నట్లు శ్రీశైలసింహద్వారం చేరేలోపున చెంచులసుగాలీల గోసంపదకన్నుల పండువ చేసింది. కుమారస్వామి, ఇత్యాది విగ్రహాలు పులకితగాత్రుల చేసినాయ్. మా బృందమంతా చేరుకోవడంతోనే శివదర్శనం భ్రమరాంబదర్శనం చేసుకుని, సత్రంలోకి చేరాము. సలసలకాగే వేణీళ్లలో ప్రయాణభారం కొంత సల్లింది. మేనేజిమెంటు బోర్డు అధ్యక్షులు పాలుట్ల విశ్వనాథరావు, సెక్రెటరీ కోటయ్యనాయుడుగారలు అమర్చిన భోజనంలో క్షుధాగ్నిని తీర్చుకొని ప్రక్కల్లో చేరుకున్నాము. అదివరకు అలవాటేఅయినా మా అదృష్టంకొద్దీ మత్కుణరాజాలు మమ్మల్నిమటుకు పరామర్శించలేదు. మాధవమీనన్ సతి శ్రీమతి కుట్టిఅమ్మాళ్ అమ్మ మాకు వైద్యురాలై పెల్యూడ్రిన్ మాత్రను పడుకోబోయేముందు మ్రింగించింది.

మక్కపొడిచే వేళ లేచి కాలాదికముల తీర్చుకొని రెండు మైళ్లలో ఉన్న పాతాళ గంగకు బయలుదేరాము. ఒకరు బాటరీలైటు, మరొకరు పెట్రోమాక్సులైటు పుచ్చుకున్నారు. కొద్దిసేపట్లో తూర్పారినందువల్ల వాటి అవసరం లేకపోయింది. కృష్ణమ్మతల్లి ఇట్టే ముందు వాకిట ఉన్నట్లే ప్రత్యక్షమై అట్టే అదృశ్యమయ్యేది మధ్యమధ్య సెలయేళ్ల ధ్వనులు వినిపించినయి. ప్రతి పదిఅడుగులకు ఒక శివలింగం ప్రత్యక్షమయ్యేది. సూర్యోదయంవేళకు పాతాళగంగ చేరుకున్నాము. మాలో బాగా ఈదనేర్చిన మాధవమీనన్ దంపతులుతప్ప మిగతావాళ్లు అంత సాహసించలేరు ఎక్కడ పడితే అక్కడ దిగడానికి. అప్పటికే మూసి, తుంగభద్రలు లీనమైన కృష్ణాతరంగిణి గిరిత్రయము మధ్య హారములాగ చూపరులకు వెరపును, వైరాగ్యమును కలిగిస్తుంది. కృష్ణానదీ పవిత్రతోయముల గ్రుంకులిడి, కృష్ణాజలముతో తిరిగివచ్చి మల్లికార్జునస్వామి చుట్టూ చేరి రుద్రాభిషేకం జరిపాము. అక్కడ భగవత్సాన్నిధ్యములో ఈ తడమాత్యుడు, ఈతడు కింకరుడు అనే తారతమ్యభావం లేక ఈశ్వరకైంకర్యంలో తాదాత్మ్యం పొందాము. తరువాత అమ్మవారి నర్చించి, దేవాలయమందలి విశేష శిల్పకళా వైదగ్ధ్యమును చూచి మహదానంద పూరితుల మయ్యాము. అయితే దేవాలయ స్తంభాలు కూలిపోతూన్న దశ చూసి కంట తడి పెట్టనివాడు లేడు. మేనేజిమెంటుబోర్డు అధ్యక్షులు ఇంతవరకు దీనిని ఈమాత్రమైన నిలబెట్టుటకు కృషిచేసిన పాణ్యం రామయ్యగారిసేవను ప్రశంసిస్తూ ప్రభుత్వంవారు దేవాలయమంటేనూ, యాత్రికులంటేనూ శ్రద్ధవహించవలసిందని విన్నవించారు.

ఒకనాడు రాజరాజుల సేవల నంది, మహోన్నతవైభవముల నందిన దేవాలయపూర్వదశను, ప్రస్తుత దైన్యదశను చూస్తే దైవదుర్విపాకానికి ఖేదం కల్గుతుంది.

ఉత్తర, దక్షిణ, తూర్పుదిశల గోపురములు చాలాభాగము శిథిలావస్థలో ఉన్నాయి. పశ్చిమాన అసంపూర్ణమైన సింహద్వారము ఉన్నది. ఉత్తరద్వారాన్ని శివాజీగోపుర మని పిలుస్తారు. కోటమధ్యన ఉన్న గుళ్లో మల్లికార్జునుడు ఉన్నాడు. ముఖమండపం హరహర రాయలు క్రీ. వె. 1404లో కట్టించారు. ముఖమండపానికి తూర్పు సింహద్వారానికి మధ్య అనేకశాసనాలు ఉన్న రెండు మండపాలు ఉన్నవి. అనవేమారెడ్డి 1299 సం॥ లో కట్టించిన వీరమండపం ఒకటి. రెండోది మహానంది ఉన్నది. మూలవిరాట్టుకు ఉత్తరాన చంద్రావతి మల్లికాపుష్పాలతో పూజించిన ఆదివిగ్రహమైన వృద్ధమల్లికార్జునాలయము ఉన్నది. ఈ దేవాలయానికి ఉత్తరాన సహస్రలింగేశ్వరుడు ఉన్నాడు. ఈ గుడికి వెనక బలిపీఠం ఉన్నది. దానిప్రక్కన వీరభద్రుడు ఉన్నాడు. దానికి సమీపంలోనే మల్లికగుండంలో వసంతమండపం ఉంది. ఇక్కడ మల్లికార్జునునికి తెప్పోత్సవం జరుగుతుంది. మూలవిరాట్టుకు పశ్చిమదిశను దగ్గిరలో పంచపాండవుల, శ్రీదేవి గుళ్లు ఉన్నయి. కుమారస్వామి, పంచనందీశ్వరుడు, రాజరాజేశ్వరులగుళ్లు ప్రాకారం దాపులనే ఉన్నయి. కుమారస్వామి గుడిదగ్గరనే 1451 లో కృష్ణదేవరాయల అమాత్యుడైన చంద్రశేఖరరాజులు కట్టించిన కల్యాణమండపం ఉంది. దేవాలయ దక్షిణాన అన్నపూర్ణభవాని సత్రం ఉన్నది. శ్రీశైలరాజ్యకరణం యలికంఠ కామరాజు పుత్రులు దీన్ని ఏర్పరిచారట. అంబగుడి మూలవిరాట్టుదా పశ్చిమంగా ఉన్నది. ఉన్నతస్థలంపై ఉన్నది. అంబాలయానికి దగ్గిరే సహస్రలింగాలు ఉన్న ఆలయం మరొకటి ఉన్నది.

తూర్పు సింహద్వారంనుంచి పాతాళగంగకు పోయే మార్గంలో కృష్ణదేవరాయలు కట్టించిన మండపాలు పడిపోయే స్థితిలో ఉన్నయ్. పాతాళగంగ రెండు మైళ్లు ఉన్నది. అనవేమారెడ్డి కట్టించిన మెట్లవరున ఇంకొకటిఉన్నది. అది ఈమార్గంకన్న సులభమైంది. కాని ఆమార్గం అంత వాడుకలో లేదు. మెట్లు బాగుచేయిస్తే చక్కగా ఉపయోగించవచ్చు. పాతాళగంగదగ్గిర బ్రహ్మగిరి విష్ణుగిరి, రుద్రగిరులవద్ద కృష్ణానది సముద్రజలాలవలె పచ్చపచ్చగా, నీలినీలిగా ఉంటుంది. అనవేమారెడ్డి కట్టించిన మెట్లనే కాదంబరాణి విరలాంబ మరమ్మతు చేయించింది. పాతాళగంగ సమీపంలోఉన్న గుహలో నరసింహస్వామి వెలిసి ఉన్నాడు. శివరాత్రికి వచ్చు యాత్రికులనుంచి తలకు రూ 1-12-0 వసూలు చేస్తారు. ఒక్కొక్కప్పుడు లక్షదాకా యాత్రికులు వస్తారు. వార్లకు, పందిళ్ళు, పాకలు వేసి, భోజనాలు పెట్టడంలో ఆ డబ్బు అయిపోతుందట. శ్రీశైలే గుడికి సెంటు భూమిగూడా లేదట. శ్రీశైల ఆలయ ప్రాంగణంలోనూ ఉన్న ఊటబావులు బాగుచెయ్యాలి. వెనక చెర్వు మరమ్మతుచేయించాలి. శివరాత్రికి వచ్చు యాత్రికుల నిమిత్తం మార్గమధ్యాన, దేవాలయంలోగూడా మంచి నీటివసతి అన్నసత్రవసతి ఏర్పరచాలి. ఆ రోజుల్లో యాత్రికులు ఆలస్యం చెయ్యకుండా సంతతీ ప్రవాహంలా వచ్చిపోతూ ఉండడానికి చక్కని ఏర్పాట్లు చెయ్యాలి.

రోడ్డు వెయ్యాలి

ఇంజనీర్లు శ్రీశైలానికి రోడ్డుకు 3 లక్షలు అవుతుం దని అంచనా వేశారు గాని అది అడుగున పడిపోయింది. పురాతనపరిశోధనశాఖ, ధర్మాదాయశాఖ, ప్రజామంత్రులూ ఈ దేవాలయాన్ని ఉద్ధరించడానికి శీఘ్రంగా పూనుకోవాలి.

శివరాత్రిగాక, ఉగాదికి చైత్రశుద్ధ పౌర్ణమివరకు మైసూరు, హైద్రాబాదు, ఉత్తరహిందూస్థానంనుంచి పదివేలదాకా యాత్రికులు వస్తూ ఉంటారు. మూడుమాసాలపాటు తప్పితే ఈదేవాలయంమన్యజ్వరాలవల్ల సంతతార్చన లేకుండా ఉంటూఉంటుంది. అర్చకులుగూడా చలిజ్వరపీడితులౌతూఉన్నందువల్ల నిలకడగా ఉండరు చైత్రమాసంలో భ్రమరాంబకు వీరశైవులు కర్నాటకులు బలులు, ఇచ్చి, పూజిస్తారు. కట్నాలు కానుకలూ ఇచ్చి తమ ఇంటి ఆడబడుచువలె ఆదరిస్తారు.

దేవాలయంచుట్టూ ఉన్నకోట గోడలపై చెక్కబడిన ఏనుగలూ, లేళ్ళూ, నాపల చిత్రాలు, పురాణదృశ్యాలు దిగ్భ్రమ గొలుపుతయి. శివపురాణగాథలు శిల్పాలు గోడలపై గొలుసులుగా చెక్కేశారు. కృష్ణదేవరాయల కాలంలో ఈ శిల్పచాతుర్యం వెల్లివిరిసింది. మల్లికార్జునని గోపురం తలుపులు, బయటిగోడలు అనవేమారెడ్డి బంగారుపూత పూయించాడు. రోహిల్లాలు, అనంతరం చెంచులు ఇవి పలుచుక్కపోగా మిగతావి అమ్మి కొంత మొత్తం బ్యాంకులో ఉంచారు. శిలాశాసనాలలో ఫలాన ఫలాన జాగీరులు ఫలాన ఫలాన వారు ఇచ్చారని ఉన్నవిగాని ఇప్పుడు శివుడు విభూతి, మారేడు పత్రే ఆస్తిగా ఉన్నాడు. దేవాలయ ప్రాకారంలో పది ఊటబావులు ఉన్నాయ్. అందు నాల్గు బావుల్లోకి సూర్యకిరణాలు రావు.

ప్రభుత్వానికి గమనిక

ప్రభుత్వమువారు ఈ దేవాలయాన్ని గూర్చి, యాత్రికుల సౌకర్యాలను గమనించి ఈ సూచనల శీఘ్రంగా గమనించి చర్య తీసుకోవాలి.

(1) జీర్ణమవుతూన్న ఆలయాన్ని, గోపురాలను పునరుద్ధరించాలి.

(2) యాత్రీకుల సౌకర్యార్థమై వదాన్యుల సహాయముతో అన్నసత్రాలు పెట్టించాలి.

(3) కొండకు మంచి రస్తా వేయించాలి.

(4) మంచినీటివసతి, దీపాలవసతి, పెట్టించాలి. మన్యజ్వరానివారణమార్గాలను పరిశోధన చేయించి సత్వరచర్య పుచ్చుకోవాలి.

(5) కలరా, మున్నగు అంటువ్యాధులు రాకుండా నివారణకార్యాలు అధికారులు ఉత్సవాలవేళ చెయ్యాలి.

(6) కొండపైన, మార్గంలోనూ విశ్రాంతి గృహాలు నిర్మించాలి.

(7) రోళ్లపెంట దాపులలోయలో బళ్లు పడిపోకుండా రస్తాప్రక్కన రాళ్లకట్ట కట్టించాలి.

(8) వైద్యవసతులు చెయ్యాలి.

(9) దేశీయులనేగాక విదేశీయులనుగూడా ఆకర్షించేట్లు 'టూరిస్టు హోంలు' పెట్టి చక్కని వసతు లేర్పరచాలి.

(10) ప్రభుత్వం ఈ దేవాలయ ఉద్ధరణ భారాన్ని వహించి యాత్రికుల సౌకర్యాలకు పూర్తిగా పూనుకోవలసి ఉన్నది.

"సారూప్యం తవ పూజనే, 'శివ,మహాదేవేతి సంకీర్తనే
సామీప్యం శివభక్తిధుర్యజనతా సాంగత్యసంభాషణే
సాలోక్యం సచరాచరాత్మకతను ధ్యానే భవానీపతే,
సాయుజ్యం మమ సిద్ధమత్ర భవతి స్వామిన్ కృతార్థోఽస్మ్యహమ్"

కంగుల్ దీరిన పైఠిణీరవిక

శ్రీ పెండ్యాల వెంకటసుబ్రహ్మణ్యశాస్త్రి

పై వాక్యమును చేమకూర వెంకటకవి 'పిల్ల వసు చరిత్ర' అను ప్రసిద్ధినొందిన 'విజయ విలాసము' అను గ్రంథమున 'సుభద్ర'యొక్క సింగారింపు వర్ణనములో ప్రయోగించియుండు టను లోక మెరిగినదే. కాని వెంకటకవికి బూర్వమే ఈ వాక్యము నుపయోగించిన కవి మరి యొకడు కలడు. అతడు-

ఒడ్డెయ్య మహాకవి.

ఈతడు (1) బాలగోపాలవిలాసము (2) 'శృంగారరసాలవాలము' అను రెండు గ్రంథములను రచించెను.

ఈతనియొక్కయు, ఈతని గ్రంథముల యొక్కయు వృత్తాంతములకు బూర్వము పైఠణిరవికయొక్క యంశమును కొంత చర్చించెదము.

ప్రాచీనకాలమున ఆర్యస్త్రీలకుగాని నాగ-ద్రవిడాద్యనార్య స్త్రీలకుగాని 'రవికలు' అనునవి లేవు. ఆర్యస్త్రీలు పురుషులవలెనే రెండు వస్త్రములను ధరించుచుండువారు. వివాహమునందు కన్యాదాత వధూవరుల కిచ్చు వస్త్రములు (ఇపుడు వీనిని మధుపర్కము లందురు) రెండేసిగానే యుండవలె ననియు నిబంధనము కలదు. కాని ఇటీవల పెండ్లికుమార్తెకు 'రవికగుడ్డ - చీర' యిచ్చుటగా మారినది. ఇప్పటికేని ఆంధ్రులలో 'అశ్వలాయన సూత్రికులు' పెండ్లికూతునకు రెండు చీరలనే యిచ్చుచుందురు.

కొన్ని సమయములం దార్యస్త్రీలు పైవస్త్రమును ధరింపరాదను నిబంధనము కాన్పించుచున్నది. అది స్త్రీబహిష్ఠయైనకాలము-ఇందులకు నిదర్శనము ధర్మరాజు ద్యూతమున ద్రౌపదిని యొడ్డి యోటువడగా దుశ్శాసనుడు ద్రౌపదిని సభలోకి తీసికొని రాబంచుటను ధర్మజు డెరింగి ద్రౌపదికిని క్రింది రీతిని వర్తమాన మంపియున్నాడు:-

ఏకవస్త్రా త్వదో నీవీ
రోదమానా రజస్వలా,
సభా మాగమ్య పాంచాలీ
శ్వశుర స్యాగ్రతో భవ.

ఓ ద్రౌపదీ, నీవు ఒక్కబట్టనే ధరించి రజస్వలావేషధారిణివై ఏడ్చుచు ధృతరాష్ట్రునెదుట నిల్చియుండుమా! అనెను.

ఇచ్చట రజస్వలయైన స్త్రీ పైని బట్ట లేకుండ ఒక్కబట్టనే బొడ్డుక్రిందికి కోకముడి వైచుకొని యుండుట చెప్పబడెను. ప్రాచీనసనాతన ధర్మస్త్రీలును యిట్లే యుండెడివారు. ఈ యంశమును మాయూరి పౌరాణికు డెరుంగక 'అథో నీవీ' శబ్దమునకు ఏదేదో తెలివితక్కువ అర్థము చెప్పుచున్నారు. దాని నట్లుండనిండు. ప్రాచీనపు శిల్పములందును, అజంతా, ఎల్లోరా గుహలయందును గల స్త్రీ విగ్రహములలో రవికలుగాని పైటబట్టలుగాని లేకుండుట గమనింపదగియున్నది.

స్త్రీలకు రవికలు పైట ధరించుటను మనయాంధ్రదేశపు ప్రాచీనరాజధానియగు ప్రతిష్ఠానపురము (పైఠాను) నుండియే ప్రారంభమైనట్లు స్పష్టముగదా. పైఠానుశబ్దముయొక్క వికృతియే పైట. పైఠానీనుండి బయలుదేరిన రవికయే పైఠణీరవిక.

నేను హైద్రాబాద్ రాజ్యమున సంచరించు కాలమున నొక పండితుడును గోల్కొండపత్రికాధిపతులగు శ్రీ సురవరం ప్రతాపరెడ్డిగారును పైయంశమును నాకు నింపుగ చెప్పియున్నారు! శబ్దసిద్ధి లోకంబువలన తెలియునుగదా!

ఇక పైఠణీ రవికశబ్దము నుపయోగించిన మొదటి కవిని గురించి ఈ క్రింద వివరింపుచున్నాను.

బాలగోపాలవిలాసము: ఒడ్డెయ్యకవి

శ్రీ ఒడ్డెయ్య మహాకవిచే రచియింపబడిన బాలగోపాలవిలాసము' అను నీ ప్రౌఢప్రబంధము హృద్యరీతుల నొప్పారుచున్నది. ఆంధ్ర వాఙ్మయవృక్షము 'నన్నయచే నాటబడి తిక్కనాదిమహాకవులచే బెంపబడి, పెద్దనాది మహామహులచే వివిధశాఖలతో వృద్ధినొందింపబడి లోకామోదము గల్గించెను. ఆ వాఙ్మయవృక్షము ఫలవంత మగునాడే వెణుతుర్ల ఒడ్డెయ్య కవిచే నీ బాలగోపాలవిలాసము రచింపబడినది. ఈ కవి శుక్లయజుశ్శాఖీయుడు, కౌండిన్యసగోత్రికుడు, వేంగనామాత్యుని పౌత్రుడు, మంగళగిరి పుత్రుడు. తాను బ్రహ్మవిద్యావిశారదుడ ననియు ఆంధ్రగీర్వాణభాషాకోవిదుడ ననియు, మేదుర శృంగార మృదుకవిత్వధురీణుడననియు' వ్రాసికొనియున్నాడు. ఈ కవి 'శృంగారరసాలవాలము' అను మూడాశ్వాసముల మరియొక గ్రంథమును రచించెను. ఈ రెండు గ్రంథములలో నేది మొదటివో, యేది రెండవదో కవి చెప్పలేదుగాని 'బాలగోపాలవిలాసము' నందు తాను మేదురశృంగారమృదుకవిత్వవిశారదుడ నని చెప్పుకొనుటచే శృంగారరసాలవాలము మొదటి దనియు, నిది రెండవ దనియు నూహింపనగుచున్నది. బాలగోపాలవిలాసము 'ఎగ్గోను శేషన్న' సచివునకు కృతిగా జేయబడి యాతని కోరికచే శ్రీరామమూర్తి కంకిత మీయబడెను. శేషన్న నందవరీకనియోగి, విశ్వామిత్రగోత్రజుడు. బహువిధదానముల నొనర్చిన వాడు. అనేక కారణములచే కృతికర్తయు, కృతిభర్తయు పదునారవ శైస్తవశకాంతపువారనియు, ప్రసిద్ధికెక్కిన శ్రీకృష్ణదేవ రాయల కాలపువా రనియు దలంచితిని.

కాని బాలగోపాలవిలాసమునందలి వర్ణనములలో డల్లసాని పెద్దన్న, నందితిమ్మన్న శ్రీకృష్ణదేవరాయాది మహాకవులయొక్క పోకడలేకాక, పైకవులకు బిమ్మట నుండిన రామరాజభూషణుని వసుచరిత్రలోని వర్ణనా విశేషములు గూడ నిందు జూపట్టుటచే బదునారవ శైస్తవశకము యొక్క కడపటనున్న 'నంద్యాల' రాజగు శ్రీకృష్ణరాజుకడ కృతిపతి యన్నయగు రామయ మంత్రిగా నుండుననియు కృతిభర్తయగు శేషన కృతికర్త ఒడ్డెయ్య కవియు నా కాలముననే యుండియుందు రనియు దృఢముగ దలంపనగుచున్నది. మరియు ప్రసిద్ధికెక్కిన 'విజయవిలాసమునందలి'—

"కంగుల్ దీరిన పైఠిణీ అవికచ
నట్టంటి రాణింపగా
జెంగల్వల్ నెఱికొప్పునందు నొఱపై
చెండం గుబాళింపగా
బంగారందియ ముక్కునం గమిచిపై
పై నంచ యల్లింపగా
సింగారంబగు ముద్దుజిల్క తనకుఁ
జేదోడువాదోడుగాఁ."

అను పద్యములోని 'కంగుల్ దీరిన పైఠిణీ రవిక' అనువాక్యము దీనియందును "పైఠిణీ రవిక కంగుల్ దీరి పొంగారగా" అను మార్పుతో ప్రయోగింపబడుటచే పదునేడవ శైస్తవశకారంభమునందుండిన 'చామకూర వేంకటకవి' కి గూడ నీతడు పిమ్మట నుండె నాయని యనుమానించితినిగాని యాకాలమున నెచటను 'కృష్ణరాజ' నాముడు ప్రభువుగా నుండకపోవుటచేతను, 'పైఠిణీరవిక కంగుల్ దీరుట' అను నానుడి ప్రాచీనకాలమున వాడుకొనబడు పదమని పెద్దలవలన వినియుండుటచేతను, వేంకటపతికి దరువాతి వాడు కాడీతడని చెప్పవలసియున్నది. మరియు 'నరసభూపాలీయము' లో లేనట్టివియు, సంస్కృతమున 'రసమంజరి' మొదలగు గ్రంథములలో లేనట్టివియు, సంస్కృతమున 'రసమంజరి' మొదలగు గ్రంథములలో నభిహితమగునట్టివియు, 'నాయికానాయకరస' నిర్ణాయక బోధకములగు నంశములతో గూడునట్టీతడు 'శృంగారరసాలవాలము' అను గ్రంథమును, 'నరసభూపాలీయము'ను 'భట్టుమూర్తి' రచించినవెంటనే రచించియుండును. అందుచే నీతడు పదునారవ శతాబ్దము చివరనుండిన 'పింగళసూరన' మహాకవికి సమకాలికుడై యుండు నని తలంపనగుచున్నది.

కథాంశము

ఈ కథ హరివంశపురాణమునుండి గ్రహింపబడినది. భాగవతమునందును నీ గాథ కలదుగాని యందు గొంత భేద మున్నది. శ్రీ కృష్ణుడు నందునింటనుండిన బాల్యదశలోనే 'మిథిలాపురి'యందు 'కుంభకుడు' అను గొల్లవానియింట దొల్లి 'తారకామయ' యుద్ధమునందు మహావిష్ణువుచే మడిసిన 'కాలనేమి'యొక్క ఏడు గురు పుత్రులును వృషభరూపముల బుట్టి రైతుల పొలములు బహువిధముల ధ్వంసము చేయుచుండె మిథిలాపురీశునికడకు నా కర్షకులు పోయి వృషభముల దుండగముల జెప్పి బాధానివారణ మొనర్ప వేడిరి. రాజు కుంభకుని రప్పించి వృషభబాధానివారణ మొనర్పు మనియు లేకుండిన శిక్షింతు ననియు జెప్పగా గుంభకుడు రాజాజ్ఞ గైకొని తన బంధువులను రప్పించి ఎద్దుల బట్ట గోరెను. కుంభకుని చుట్టాలను గొల్లలెన్నివిధముల వానిని బట్ట బ్రయత్నించినను నవి లోబడక తమ్ము బట్టవచ్చినవారిపై నెదురుతిరిగి పొడిచి బహువిధముల బాధించెను. తుదకు కుంభకుడు వృషభములను జయించినవానికి 'నీల' యను తన ముద్దుపట్టి నిచ్చి పెండ్లిచేయుదు నని వీర్యశుల్క స్వయంవరము జాటించెను. ఆ స్వయంవరమునకు వచ్చిన గోపప్రముఖులలో బలరామకృష్ణులును, నందాదులును గలరు. నందగోపునిజ్ఞాతియగు ఘోషవంతుడు, తొలుత వృషభముల నిర్జించుటకు వానితో బోరనారంభింప నా ఎద్దు లొక్కుమ్మడి ఘోషవంతుని బొదివి క్రుమ్మి చిమ్మివైవ నాతడు మూర్ఛితుడయ్యెను. అది చూచి శ్రీకృష్ణుడు వృషభములపై గవిసి వానితో గొంత వడిపోరి వానిబరిమార్చి నందాదుల నానందపరిచి 'నీలాదేవి'ని బెండ్లియాడెను. ఈ గాథనే ఒడ్డెయ్యకవికి 'బాలగోపాలవిలాస'మను ప్రబంధముగా రచించెను. ఒడ్డెయ్యకవికి బిమ్మట నొక శతాబ్దమున కుండిన 'కవిసార్వభౌమ కూచిమంచి తిమ్మకవి' పైకథనే 'నీలాసుందరీపరిణయము' అను నచ్చ తెనుగు కబ్బముగా రచించెను. ఇరువురును మూడాశ్వాసముల గ్రంథముగానే కూర్చిరి. వొడ్డెయ్యకవి కూర్పు ప్రౌఢగంభీర పదఘటితమై, ద్రాక్షాపాకయుక్తమైయుండును. తిమ్మకవి కైతి, మృదుమధురమై కదళీపాకలలితముగ నుండును. ఇరువురును కావ్యలక్షణములు పూర్తియగుటకో యనునటుల నాయికా విరహ, చంద్రోదయ, చంద్రాస్తమయ, చంద్రమన్మథాద్యుపాలంభనాదులను, తదితర వర్ణములను గావించిరి. వొడ్డెయ్య, తిమ్మన్నకంటె నెక్కుడుగా వనవిహారజలక్రీడాద్యభివర్ణనములచే వసుచరిత్రయొక్క పోకడలం బోయెను. మూలములో లేనిరీతిని 'నీలాకృష్ణుల' కన్యోన్యానురాగము కలిగించుటకై వొడ్డెయ్యకవి నారదపాత్రమును, తిమ్మకవి వృద్ధబ్రాహ్మణపాత్రమును గల్పించిరి. వొడ్డెయ్యనారదుడు కలహభోజనత్వమును సార్థకపరచుకొనుటకై, కృష్ణుడు ప్రేమించిన గోపికల గర్వ మణచుటకని 'నీల'పై నాతనికి, ప్రేమ పుట్టునట్లు, కృష్ణుని వెంట నిడుకొని మిథిలకు దోడ్కొనిపోయి వనవిహార మొనర్చు నీలం జూపి అన్యోన్యానురాగ మొనగూర్చుటయు, స్వయంవరమునకు బలరామకృష్ణులు వచ్చిరి గాన మీ వీపు జూపు డని వృషభరూపులగు కాలనేమి పుత్రులను రెచ్చగొట్టుటయు విశేషము. తిమ్మకవివృద్ధబ్రాహ్మణు డట్లుకాక సాధారణముగా బెండ్లిండ్లను సమకూర్చి యుభయపక్షములవారిచేతను బహూకరింపబడు వైదిక సత్వగుణప్రధానుడగు పెద్దబాపడు. తక్కిన విశేషములు గ్రంథపాఠకులే గ్రహింతురుగాక!

భాగవతమునందలి కథ వేరువిధముగా నున్నది. అందలి కృష్ణుడు బాలకృష్ణుడు కాడు; ప్రౌఢుడు. అర్జునసహాయుడు. నీల గొల్లది కాదు. కోసలరాజగు 'నగ్నజిత్తు' అనువాని పుత్రిక. "నీలా" నామధేయవతి కాదు. "నాగ్నజితి" అను నామము కలది. ఏడెద్దులుగాథ సమానమే. వృషభములను జయింపలేక పరాజితులైన రాజు లసూయచే శ్రీకృష్ణుడు "నాగ్నజిత్తి"ని జేకొని ద్వారకకు బోవుచుండగా దారివేచి, శ్రీకృష్ణు నిర్జింప దలపడిరి కాని శ్రీకృష్ణునకు దోడునీడగ నుండిన యర్జునుడా రాజులనెల్ల బరాజితులం జేసి తిరిమి మార్గమును సురక్షితమొనర్చెను. ఇదియే విశేషము.

ఒకప్పుడు నేను గ్రంథసంపాదనమునకై దత్తమండలములో దిరుగుచు, అనంతపురంజిల్లా, ధర్మవరముతాలూకాలోని ముక్తాపురము రైల్వేస్టేషనుకు నేడెనిమిది మైళ్లదూరమునందున 'పెద్దచిగుళ్లరేవు' అను గ్రామమునం దీ గ్రంథపు బ్రతిని సంపాదించితిని.

"జిలుగుఁ వన్నెదలిర్చు చేలము తను
ఛ్ఛాయఁ నెరా కావిగా
గులుకుం గుబ్బల పైఠిణీరవిక కం
గుల్ తీరి పొంగారగా
వలపుల్ మీరు జవాదివాసనలు పై
పై ఘుంఘుమాయించగా
నళినీలాలక నీల, మ్రొక్క మునిరా
జత్యంత మోదంబునన్."

అమెరికా శాసనసభ్యులు

(7-వ పేజీ తరవాయి)

మొత్తానికి శాసనాలు కాంగ్రెస్‌లో ప్రతిపాదించ వచ్చేసరికి చాలా చేతులు తిరిగి చర్చించబడి సంస్కరించబడి వస్తాయి. కొన్ని రానేరావు. మొదటి 75 కాంగ్రెస్‌లలోనూ (ఇప్పటిది 81 వది) మొత్తం 725,000 శాసనాలు ప్రతిపాదించబడినాయి కాని ప్రతి 12 శాసనాల్లోనూ ఒక్కటి చొ॥ మాత్రమే కాంగ్రెస్ ఆమోదాన్ని పొందాయి.

శాసనాలు కమిటీల ఆమోదం పొందిన తరువాత సెనేట్‌లోనూ రిప్రజెంటేటివ్ హౌస్‌లోనూ ఆమోదం పొందాలి. రెండు సభల్లోనూ ఏ శాసనానికైనా ఒక సభ ఆమోదించి ఇంకో సభ ఆమోదించనప్పుడు, రెండు సభల్లోని సభ్యులు కొందరితో కమిటీ ఏర్పరిచి రెండు సభలకీ నచ్చేవిధంగా ఆ శాసనాన్ని సవరణ చేస్తారు. తరవాత రెండు సభల్లోనూ అది సులువుగా గడిచిపోతుంది. మార్షల్ ప్లాన్‌కి ఇదే జరిగింది.

ఆమోదం పొందిన శాసనాల్ని స్థాయీసంఘాల అధ్యక్షులు, రిప్రజెంటేటివ్ హౌస్ స్పీకరు, సెనేట్ అధ్యక్షుడు మంజూరు చెయ్యాలి. ఆతరవాత అధ్యక్షుడు ట్రూమన్ సంతకం చేస్తాడు. ట్రూమన్‌కి నచ్చకపోతే నిరాకరించవచ్చును. అప్పుడు అది శాసనంగా మంజూరు కాదు. అయినా ఆ శాసనాన్ని తిరిగి రెండు సభల్లో ప్రతిపాదించి మూడింట రెండు వంతులమందికంటె అధికంగా మెజారిటీతో ఆమోదించారంటే, ఇంక ట్రూమన్ సంతకం చెయ్యకపోయినా ఆ శాసనం అమలుజరిగిపోతుంది.

సాహిత్యమీమాంస:

మహాకవి ధూర్జటి

శ్రీ దోసపాటి ఆంజనేయశర్మ

సాహితీ సమరాంగణ సార్వభౌముడూ' - ఆంధ్రభోజుడూ - అయిన శ్రీకృష్ణదేవ రాయల ప్రఖ్యాత భువనవిజయంలో ఈతడొక కవి దిగ్గజం. వీరవైష్ణవుడైన రాయల ఆస్థానంలో ప్రవేశించినా, తోటిపెద్దనాదులు రాజప్రభావానికి - రాజప్రాభవానికీ - లోనైనా, వైష్ణవులో - వైష్ణవకావ్యనిర్మాతలో అయినా, తన వీరశైవాన్నీ, వ్యక్తిత్వాన్నీ నిలబెట్టుకొన్న మనస్వి. తనకావ్యం నరాంకితం చేయనొల్లని అభిమాని. కాళహస్తీశ్వర మాహాత్మ్యం మనసారా పాడుకొన్న మహాకవి. శతక రూపంలో కాళహస్తీశ్వరునకు ఆత్మనివేదనం చేసుకొన్న మహాభక్తుడు.

ఆంధ్రశతకవాఙ్మయ సాగరంలో కాళహస్తీశ్వరశతకం ఒక అనర్ఘరత్నం. కేవలమూ ఇతని ఆత్మనివేదనమేగాక, సమకాలిక సాంఘిక రాజకీయ పరిస్థితులూ - స్వీయజీవితానుభవాలూ, మతవిషయకమైన ఇతని అభిప్రాయాలూ - ఇందులో ప్రతిబింబిస్తున్నై. ఈ శతకమే ఆధారంగా పైవిషయాలను పర్యాలోచన చేద్దాం.

శతకంలో వివిధవిషయపరామర్శ కలగాపులగంగా వుంది. అసలలా వుండడమే సహజం. ఏమంటే, ఇది ఆత్మనివేదనా ప్రధానం. హృదయవీణకు స్పందనం కలిగినప్పుడల్లా, నాదం ఛందోరూపంలో ఆవిష్కృత మవుతుంది. కాబట్టే. ఇందులో ఏపద్యానికి ఆపద్యమే ప్రత్యేకం. కాని, అన్నిస్పందనాలూ ఒక పరిష్కృత మహానుభావ ప్రకంపనమే కారణంగా కలిగినై. కనుక శతకం మొత్తంమీద ధూర్జటి వ్యక్తిత్వం మనకు ప్రస్ఫుట మవుతోంది.

శతకంలో రాజదూషణ విస్తారంగా కనబడుతోంది. మొత్తంమీద 'రాజప్రసక్తి వచ్చిన పద్యాలు పదేనిమిది. ఇతని పద్యాలు ఆధారంగా శతకకాలనిర్ణయం చెయ్యడానికి ఉన్న అవకాశం చూద్దాం. మాండలిక ప్రభువులకాలంలో వివిధ రాజాస్థానప్రవేశంకోసం ఇతడు చాలా కష్టాలు పడ్డాడు. ద్వారపాలకులైన కంచుకి జనం సైతం కవులను నిర్దాక్షిణ్యంగా హింసించేవారట! "యథారాజాః తథాప్రజా" ఈయర్భకుల నెలాగో తృప్తిపరచి, కవులు ముంగిలికి చేరి, వార్త పంపుతారు. "మహారాజా ! కవీశ్వరుడు వచ్చాడు. చాలా గొప్పవాడు. ముఖ్యంగా తిట్టు కవిత్వం చెప్పడు" అని విన్నవిస్తే "ఇదివరకే చూచాంలే పోవోయ్!" అనేవారట ఆ మహారసికులు. జానెడు జెత్తెడు నేలకు ప్రభువులై, ఈషణత్రయబాధితులైన ఈ మాండలికప్రభువుల అహంకార ప్రవృత్తీ, అరసికతా ధూర్జటిని బాధపెట్టింది. పాపం! అనుకుంటున్నాడు:—

"పదునాల్గేలె మహాయుగంబు లొకభూ
పాలుండు చెల్లించెన
య్యుదయాస్తాచలసంధి నొకడా
యుష్మంతుడై వీరియ
భ్యుదయం బెవ్వరు చెప్పగా వినరొ యి
ల్పుల్కత్తులై యేల చ
చ్చెదరో రాజుల మంచు నక్కట కటా
శ్రీ కాళహస్తీశ్వరా!"

అర్థాతురులైన ఈ మాండలికప్రభువుల దుర్మదతను చూచి—

"రాజర్థాతురుడైనచో నెచట ధ
ర్మం బుండు నే రీతి నా
నాజాతిక్రియ లేర్పడున్ సుఖము మా
నవశ్రేణి కెట్లబ్బు రూ
పాజీవాళికి నేది దిక్కు ధృతి నీ
భక్తుల్ భవత్పాదనీ
రేజంబుల్ భజియింతు రే తెరగునన్
శ్రీ కాళహస్తీశ్వరా!"

అని విచారిస్తున్నాడు ధూర్జటి. ఇతడు బాల్యంలో శ్రీ కృష్ణదేవరాయల ఆస్థానకవి. ఆతడు వైకుంఠధామాన్ని అలంకరించిన తర్వాత దాదాపు యాభైసంవత్సరాలు జీవించాడు ధూర్జటి. రాయలు 1530 ప్రాంతంలో నిర్యాణం పొందాడు. 1565 లో తల్లికోటయుద్ధం జరిగింది. విజయనగరసామ్రాజ్యభాను డస్తమించాడు. ఆంధ్రదేశంలో చీకట్లు అలముకొన్నై. అంధకారమయమైన గంభీరనిశీథినిలో మిలమిలలాడే చుక్కల గుంపులాగా ఉన్నారు అప్పుడే స్వతంత్రులైన మాండలిక ప్రభువులు. రాయల పరమపద ప్రాప్తినాటికి ఇతనికి ముప్పైసంవత్సరాల వయస్సు. తల్లికోటయుద్ధంనాటికి ఇతని వయస్సు అరవైయైదుసంవత్సరాలు: అనగా ఇతడు దాదాపు 1500 ప్రాంతంలో జన్మించి ఉంటాడు. తనకాలపు రాజాధములను నిరసిస్తూ, పైన చెప్పిన పద్యంలో ఉదయాస్తాచలసంధిని ఆజ్ఞ చెల్లించిన అయుష్మంతునీ - ఆంధ్రభోజునీ - ఒక్కసారి స్మరించుకున్నాడు. "అల్పుల్ మత్తులై యేల చచ్చెదరో రాజుల మంచు నక్కటకటా!" అని కటకట పడుతున్నాడీ మహాకవి. పౌరాణికయుగంలోని మహాచక్రవర్తిని స్మరించిన వెంటనే, ఇతడు ఉదయాస్తాచలపతిని స్మరించాడు. ఈ ఉదయాస్తాచలపతి, రాయలుగాక మరొకడు కాజాలడు. అంత విఖ్యాతినందిన మహాచక్రవర్తి అతడు గాక వేరొకడు లేడు. అల్పులైన మాండలిక ప్రభువుల క్షుద్రవర్తన చూచి విచారపడుతూ-"రాజనామం ధరించినంతనే సరిపోతుందా? అభిజాత్యమూ - సత్యభాషణమూ - ఉండవద్దా?" అని తాను కృష్ణదేవరాయలవద్ద చూచిన రాజలక్షణాలు స్మృతికి తెచ్చుకుంటున్నాడు. ఇతనికి సమకాలికుడూ - రాయల అనంతరం చాలాకాలం జీవించినవాడూ అయిన రామరాజభూషణుడు కూడా, మాండలికులమీది ధూర్జటి అభిప్రాయం యథార్థమని చంద్రోపాలంభనావ్యాజంగా సాక్ష్యం చెబుతున్నాడు. గమనించండి.

"రాజీవాత్తుల నేచు పాతకివి చం
ద్రా! రాజవా నీవు నీ
రాజత్వంబున చక్రముల్ మనియెనో
రంజిల్లి సత్సంతతుల్
తేజం బందెనొ డిందెనో యహిభయో
ద్రేకంబు తా జెల్లరే
రాజై పుట్టుట రశ్మిమాత్రఫలమే
రాజోట దోషార్థమే!"

పై శ్లేషలోని రాజపరమైన అర్థమే ఇక్కడ సమన్వయించుకోవాలి. "రాజుల్ మత్తులు వారి సేవ నరకప్రాయంబు" అనే అంటున్నా, అది దుర్మార్గులైన రాజులకే వర్తిస్తుం దని ధూర్జటి హృదయం. అందుకనే, వీళ్లని రాజులుగా చేసిన బ్రహ్మను గులామును చేశాడితడు. "నిరాశ్రయాన శోభంతే పండితా వనితా లతా" అనే సూక్తిని ఎరగనివాడు కాడు ధూర్జటి. నిజానికి సత్ప్రభువు దొరికితే సేవించాల్ననే వుంది చివరలో—

"పదివేలైనను లోకకంటకులచే
బ్రాపించు సౌఖ్యంబు నా
మదికిం బథ్యము గాదు, సర్వమునకున్
మధ్యస్థుడై సత్యదా
న దయాదుల్గల రాజు నా కొసగు మె
న్నన్నాని నీ యట్ల చూ
చి దినంబు న్మదమొందుదుం గడపటన్
శ్రీకాళహస్తీశ్వరా!"

అని తన చిన్ననాటిరాయల సభలోని మధురానుభూతులను నెమరువేసుకుంటున్నాడు. విజయనగర సామ్రాజ్య విచ్ఛేదానంతర కాలంలోని రాజుల చిత్తవృత్తుల్ని వివరించాడు కాబట్టి, ఈ శతకం, 1565-75 ప్రాంతంలో రచించి ఉంటాడని నిర్ణయించవచ్చు. అనగా తన గా 65-75 వ యస్సులో ధూర్జటి ఈ శతకం వ్రాసి ఉంటాడన్నమాట.

అసలు యథార్థమిదైతే, 1946 వ సంవత్సరంలో వావిళ్ళవారు ప్రకటించిన ఈ శతకానికి పీఠిక వ్రాస్తూ, శ్రీశేషాద్రిరమణకవులు "ఈ శతకము వ్రాసినది శ్రీకృష్ణదేవరాయల యాస్థానమునందు బేరెన్నికగన్న ధూర్జటి మహాకవి యని పరంపరగా జెప్పకొనుటేగాని, శతకాద్యంతములలో నావిషయము నిరూపించు పద్యములు కానరావు" అని వ్రాశారు. 'శతకాద్యంతాలు' చూచి వ్రాసిన వీరి వ్రాత యథార్థమే. కాని, వీరు చూడని శతకమధ్యభాగంలో స్పష్టమైన ఆధారాలున్నై. "ధూర్జటి పదునారవ శతాబ్దమున శ్రీ కృష్ణరాయల యాస్థానమున నుండె"నని వీరే అంగీకరించారు కాబట్టి ఆ విషయంలో మాకు విప్రతిపత్తి లేదు: కాళహస్తీశ్వరమాహాత్మ్యానికీ, శతకానికీ-సంబంధచ్ఛాయ లున్నాయని వీరే అన్నారు. ఇక శతకకర్త ధూర్జటి అని, "నీపేరున్ భసగంధితీర్థము" అనే పద్యంలో స్పష్టపడడంలేదా? "నీపేరున్" అన్నప్పుడు అది శివనామాల్లో ఒకటై వుండాలి గదా! కాళహస్తీశ్వరమాహాత్మ్యసంబంధాన్ని బట్టి, ఆపేరు ధూర్జటి అని నిర్ణయించడం సముచితం కాదా? మరి ఆధారాలు లేవనుకోవడం చూడని లోపమే అవుతుంది.

ధూర్జటి మహాభోగి. ఇతణ్ణిగూర్చి మనలో ఒక ఐతిహ్యం వ్యాప్తమై వుంది. కృష్ణరాయలు, అవివాహితుడైన ధూర్జటికవితామాధుర్యానికి చొక్కిపోయి, రోజూ - సభలో "స్తుతమతియైన యాంధ్రకవి ధూర్జటి పల్కుల కేల గల్గె నీ యతులిత మాధురీమహిమ" అని ప్రశ్నించేవారట ఒకనాడు కొంటెకోణంగి రామకృష్ణుడు ఆప్రశ్న వినీవినగానే "హా! తెలిసెన్" అంటూ లేచాడు. "ఏమిటయ్యా తెలిసింది?" అంటే, "భువనైకమోహనోద్ధత సుకుమార వారవనితాజనతా ఘనతాపహారి సంతతమధురాధర రోదిత సుధారసధారలు గ్రోలుటన్ జుమీ!" ధూర్జటి కవిత్వానికింత మాధుర్యం కలిగిందని అంతఃపుర రహస్యం ఆస్థానంలో వెల్లడించాడు. శతకంలో ఆ కథ నిజమేనన్న సూచన లున్నై. ఇతడు వృద్ధాప్యంలో ఈ శతకం వ్రాసివుంటాడన్న మా నిర్ణయాన్ని ఈ పద్యం దృఢపరుస్తోంది.

"కాయల్ గాచె వధూనఖాగ్రములచే
గాయంబు, వక్షోజముల్
రాయ న్రాపడె రొమ్ము, మన్మథవిహా
రక్లేశవిభ్రాంతిచే
బ్రాయం బాయెను, బట్టగట్టె తల, చె
ప్పన్ రోత సంసార మే
జేయంజాల విరక్తు జేయగదవే
శ్రీ కాళహస్తీశ్వరా!"

భోగా లనుభవించీ - అనుభవించీ - విసుగు పుట్టింది పాపం! ఆంధ్రసాహిత్య ప్రపంచంలో ఇంతటి భోగి ఒక్క శ్రీనాథుడే కనబడుతున్నాడు. ఆయనకు తృప్తి కలగలేదు. "కాశికావిశ్వేశు గలిసె వీరారెడ్డి రత్నాంబరంబు లేరాయ డిచ్చు?" అనుకుంటూ, తనకు సౌకర్యాలు సమకూర్చే దాతలు ఇక్కడ లేరు కాబట్టే, ఈ లోకంలో ఉండలేక, స్వర్గసుఖాలుకోరి, అమరధామం చేరాడు ఆ మహాభోగి. ఇతడో, మనసారా భోగించాడు. తృప్తికలిగింది. ఛీ! ఛీ! ఆ రొంపిలో ఇక దిగ నన్నాడు.

"సంతోషించితి జాలుజాలు రతిరా
జద్వారసౌఖ్యంబులన్
శాంతిం బొందితి జాలుజాలు బహురా
జద్వారసౌఖ్యంబులన్
శాంతిం బొందెద జూపు బ్రహ్మపదరా
జద్వారసౌఖ్యంబు ని
శ్చింత న్శాంతుడ నాదు నీ కరుణచే
శ్రీ కాళహస్తీశ్వరా!"

అని బ్రహ్మానందరాజ్యస్థితిని కోరి, ఇష్టదైవాన్ని ప్రార్థిస్తున్నాడు ధూర్జటి.

ఈ మహాకవి "జ్ఞాతిశ్చే దనలేన కిం" మ్మనే ఆర్యోక్తిసత్య మనుభవించినవాడు

"జ్ఞాతుల్ ద్రోహులు వాండ్రు సేయు కపటే
ర్ష్యాదిక్రియా దోషముల్
మాతండ్రాన సహింపరాదు ప్రతిక
ర్మం బించుకే జేయగా
బోతే దోసము గాన మాని యతినై
పో గోరితిన్ సర్వదా
చేతఃక్రోధము మాన దెట్లు నడుతున్
శ్రీ కాళహస్తీశ్వరా!"

పాపం! మానవుడు రాగద్వేష సంయుక్తుడు కాబట్టి క్రోధం చావడంలేదు. "ఆత్మవత్సర్వభూతాని యః పశ్యతి స పండితః"అనుకొనే పండితుడు కాబట్టి, ప్రతిక్రియ చెయ్యడానికి అంతఃకరణం అడ్డువస్తోంది. బంధువులమీద విరక్తి పుట్టింది. శివభక్తులే నిజమైన బంధువులు కాని, "పృష్ఠాగతబాంధవంబు నిజమా?" అని అపహ్యించుకుంటున్నాడు.

"అపుత్రస్య గతి ర్నాస్తి" అనే సూక్తిని ఇతడు నిరసించాడు. "జీవనభ్రాంతులైన అవివేకులు కొడుకులు పుట్టలేదంటూ అఘోరిస్తారు. నూరుగురు కొడుకులు పుట్టిన ధృతరాష్ట్రు డేం పొవుకున్నాడు? కొడుకులే లేని శుకునకు ఏ దుర్గతులు కల్గినె?" ఇత్యాది ఇతని భాషణ చూస్తూ వుంటే, ఇతడు అపుత్రకుడేమోనని సందేహం కలుగుతోంది.

ధూర్జటి మహాపండితుడు. కేవలమూ చదువుకున్న పండితుడు మాత్రమే గాక, అశేషమైన లోకానుభవం కలిగిన మహాజ్ఞాని. శుష్కతర్కవితర్కాలతో కాలం గడుపుతూ, ఇండ్లు తగలడుతూంటే, "తస్కరాగ్నియా? ఆహితాగ్నియా?" అనుకుంటూ కూర్చునే మూఢుల్ని ఇతడు పరిహసించాడు. శ్రుతిస్మృతిపురాణేతిహాసాలను మథించి, పరమాత్మను కనుగొన్నామని సభలలో ఉపన్యాసాలు దంచే దాంభికుల నితడు నిరసించాడు ఇతని కాలంలో బాధ గురువులు ఎక్కువగా ఉండేవారేమో. వాళ్ళను తూర్పారపడుతూ అంటాడు:

"అయవారై చరియింపవచ్చు దన పా
దాంభోజతీర్థంబులన్
దయతో గొమ్మనవచ్చు సేవకుని న
ర్థప్రాణదేహాదు ల
న్నియు నా సొమ్మనవచ్చుగాని సిరుల
న్నిందించి నిన్నాత్మ ని
ష్క్రియతం గానగరాదు పండితులకున్
శ్రీ కాళహస్తీరా!"

కేవలం పాండిత్యలవదుర్విదగ్ధులైన "చదువుల్ నేర్చిన పండితాధములు" "పటవద్రజ్జుభుజంగవద్రజతవిభ్రాంతిస్ఫురచ్ఛుక్తివద్ఘటవచ్చంద్రశిలాజపాకుసుమరుక్సాంగత్యవత్తంచు" "స్వేచ్ఛాభాషణక్రీడలన్ వదరన్ సంశయభీకరాటవుల ద్రోవల్దప్పి వర్తింపగా మదనక్రోధకిరాతులందు గని భీమప్రౌఢిచే దాకినం జెదరున్ చిత్తము" అంటున్నాడు ధూర్జటి. మంత్రతంత్రాలు పరిశీలించాడు. సాంఖ్యాదియోగరహస్యాలు విన్నాడు. కాని, సందేహాలు వదల్లేదు. చివరకు తెలుసుకున్నాడు - "శాస్త్రజ్ఞానం బహుక్లేశం బుద్ధేశ్చలనకారణ"మ్మని "కర్మకళాభాషల కెల్ల బ్రాపులగు శాస్త్రంబుల్ విలోకించువారికి నిత్యత్వమనీష దూర"మని భావించాడు. అందుకనే—

"ఏ వేదంబు పఠించె లూత భుజగం
బే శాస్త్రముల్ చూచె దా
నే విద్యాభ్యసనం బొనర్చె గరి చెం
చే మంత్ర మూహించె బో
ధావిర్భావనిదానముల్ చదువు ల
య్యా! కావు మీపాద సం
సేవాసక్తియె కాక జంతుతతికిన్
శ్రీకాళహస్తీశ్వరా!"

అంటూ, కేవలం భక్తి ఒక్కటే ఏకైక మోక్షసాధన మని ఢంకా బజాయిస్తున్నాడు ధూర్జటి.

"అంతా సంశయమే శరీరఘటనంబంతా విచారంబె" "అంతా మిథ్యతలంచిచూచిన" "రోసిం దేటిది రోత తేటివి మనోరోగస్థుడై దేహి తా పూసిందేటిదిపూత లేటివి"అనే పద్యాలను చూస్తే, ఇతడు అద్వైతివలె కనబడతాడు. కాని, కేవలం అద్వైతిగా కూడా నిలబడలేడు. ఇతడు శివభక్తుడు. రూపపిపాస ఉన్నది. (కవులకు సహజమైన జబ్బు) అందుకనే, "శివా! నీరూపుమీద ఉన్న నాపిచ్చి వూహలన్నీ పోగొట్టి, - నాకన్నారన్ భవదీయమూర్తి సగుణాకారంబుగా జూపవే" అని ప్రార్థిస్తున్నాడు. ఇతడు శివుణ్ణి పరతత్త్వంగా భావించే శైవమాత్రుడే కాదు. "శ్రీ లక్ష్మీపతి సేవితాంఘ్రియుగళా" అనీ - "శ్రీరామార్చిత పాదపద్మయుగళా" అనీ - "మానసమున నీ పాదపద్మముల్ చేర్చె న్నారాయణు" డనీ - విష్ణువును శివభక్తుణ్ణి చేసిన పరమవీరశైవుడు. మతావేశదోషభూషితమైన ఈ వెర్రిపిచ్చ ఎంతటి మహామహులనుకూడా వదలదు అందుకనే, - "అవగింజంత మైబూది యలదుకొనిన, వెలది! గుమ్మడికాయంత వెర్రిబుట్టు" అన్నాడు శ్రీనాథుడు. "అల్పసంతోషియైన శివుణ్ణి ఒక్క-

(22వ పేజీ చూడుడు)

రాయలసీమసభాదృశ్యాలు

రాయలసీమ మహాజనసభ పురవకొండలో 23, 24 తారీకులుజరుగుతుంది. గా. జైరాందాసు ధౌలత్ రాం వస్తున్నారు. రావలసిందని మిత్రుడు చేగిరెడ్డి వ్రాయడంతోనే చాలా వుత్సాహం కలిగింది. క్షామ పీడిత రాయలసీమవాసులకు దౌలత్ రాం కనీసము ధాన్యాల ఎక్కువ కోటా యైనా తన బ్యాగులో తెస్తాడని ఆశించా. కానీ వారి దౌలత్ కు అనుగుణ్యమైన ప్రదేశం కాదు కాబోలు, రారని వార్త తెలిసింది. ఆచార్య.రంగాగారు సూటిగా యీ విషయాన్ని తేల్చి వేశారు. మంత్రులను పిలవడం మన ధర్మం; వారు రావడంకూడా అత్యవసరం; కానీ వారి రాకకై సభలు వాయిదా వేయ కూడదని హెచ్చ రించిరి.

త్యాగి, హరిజనసేవకుడు ధీశాలి కీ. గుటు వెంకటరమణప్పగారి పురవకొండ కాదు, యీ నాడు పుట్టగొడుగుల్లా దాదాపు 18 సంఘా లున్నాయి. వీథికి ఒక జండా వాడకొక స్లోగన్ వినవచ్చు. రాజకీయాల కలగూరగంప పురవకొండ. ఇక్కడివారు పురుములు పురమడం చాలించి నిర్మాణకార్యక్రమానికి పూను కోవడం మేలు. ఎర్రజండాకు కేంద్రము. అందు చేత మహాసభ సక్రమముగా జరుగునా అను భయము లేకపోలేదు అర్గనైజర్లకు.

• గుండ్లపల్లె దాటి బస్సు పోతూంది. బస్సులో అగ్గిపుల్లలా ప్యాకు చేశారు ప్యాసింజర్లను. చెలగుప్పదగ్గర 10 మంది రైతులు టాపుమీదికి ఎక్కారు. అందరూ మహాసభకే. వారి వుత్సాహం ఆనందాన్ని కలిగించినది. నా పక్కన శ్రీరంగాపురం రైతులు, పెద్ద రుమాళ్లు లేకపోలేదు. రాత్రి 8 గంటలకు పురవకొండ చేరుకున్నా. వెంకటస్వామిగారు తీర్మానాల గొడవలో మునిగిపోయాడు. వయోజనవోటింగు విషయంగా సూటిగా రెండు ప్రశ్నలు వేశాడు. పక్కనే రాధాకమాల్ ముఖర్జీ పుస్తకాలు రెండున్నాయి. రాయలసీమ మహాజనసభకు జీవ కర్ర వెంకటస్వామి. శాంతమూర్తి కార్యక్రమం చక్కగా ప్లాను వేశాడు. బాలిరెడ్డి కొన వచ్చాడు. చూచి చాలాకాలమైంది. రంగన్నా అంటూ గట్టిగా కరచుకొన్నాడు. అతనిది అవాచ్యమైన ప్రేమ. గబగబ అడిగేశా. జినీవా డెన్మార్కు సంచార విషయమై, శాంతంగా అంతా చెప్పాడు. స్టాక్ హోం లాగా మన పల్లెలు మారగలవా అంటూ నిట్టూర్పు విడిచాడు. అది ఒక రైతు ఇల్లు. గన్ పౌడర్ (మెరప కారము) పప్పుకూర, అన్నం చేతినిండా కమ్మని నెయ్యి వడ్డించింది. పాతకాలం మనిషి, కాయలు కట్టిన అరచేయితో డబుల్ రేషన్ వేసింది. అన్నపూర్ణాదేవిగా కరువు కాటకాలకు నిలయ మైనా, దానధర్మాలకు లోటులేదు రాయల సీమలో.

విశాలమగు కరి బసవస్వామి హైస్కూలు ఆవరణలో బ్రహ్మాండమగు సభావేదిక నిర్మిం చారు. జాతీయపతాకాలు రెపరెప లాడు చున్నాయి. 23 తారీఖు ఉదయం మంగళవాద్య ములతో జాతీయ పతాకోత్సవం జరిగింది. అదే సమయానికి బెదిరిన ఎద్దులాగా ఒక 20 మంది కాంమ్రేడ్సు ఎర్రజండాలతో మాస్కో మంత్ర పఠన చేయుచూ రోడ్డునవెళ్లిరి పాపం అంతేగా ఆర్గనైజుడుగాలేని సోషియలిస్టు భయ్యాలు. ఘాటుగా నాలుగు కరపత్రములు ప్రకటించి పక్కన వున్న వుడిపి హోటల్ లో కప్పు కాఫీ త్రాగేదానికి వెళ్లిరి. వెర్రి తాతయ్య గాంధీపటం చిరునవ్వు నవ్వుతూంది. అజేయంగా రెపరెప లాడుతూ జాతీయపతాకం పైన ఎగురుతూంది.

విషయనిర్ణయసభలో చాలా తర్జనభర్జనలు జరిగినవి. దాదాపు 500 డెలిగేట్లు వచ్చారు. చేగిరెడ్డి బాలిరెడ్డిగారు ఆధ్వర్యాన సక్రమం గానే జరిగింది. శ్రీ సాధనపత్రిక సంపాదకులు పప్పూరు రామాచార్లు కంట్రోళ్ల ధాన్యసేకరణ అవసరంగురించి నచ్చచెప్పారు. కొంత సర్దు బాటుతో అన్ని తీర్మానాలూ నెగ్గాయి. యిది డెలిగేట్ల సహకారదృష్టిని సూచించెను.

రాత్రి 10 గంటలకు పైగా ఆచార్యరంగా, ప్రకాశం పంతులుగారు బళ్లారి ప్రాంతంలో పర్యటనం చేసి వచ్చారు. కడపనుండి పాతపుతి సి. యల్. నరసింహారెడ్డి, కోటిరెడ్డిగార్లు వచ్చారు మద్రాసునుండి కే. వీ. రెడ్డిగారు. ఇంకా ఎంతమందో. పెద్దవారు చిన్నవారు- ఒక్కజాతా ఒక్కతెగ, రాయలసీమ క్షేమాన్ని కోరేవారందరూ, ఏమండీ బాగున్నారా అన్నాడు. గుర్తుపట్టలేకపోయా. అంతా వుత్తర దేశం ఫక్కీగామా పైల్మాను గా, తయారైయాడు కర్నూలు హరిజన యం. యల్. ఏ. నాగప్ప. అంబేడ్కర్ ధోరణి వీరిలో పూర్తిగా మూర్తీభవించినది. మహాసభలో జాతీయనాయ కులను పూజ్యులైన ఆచార్యరంగాగారిని పంతులుగారిని ఎదిరించారు. బాధ్యతగల శాసన సభ్యుడు యీలా ప్రవర్తించడం అతని స్థానా నికే తగదని అందూ అభిప్రాయపడిరి. వుపన్యా సాలు సాఫీగా సాగాయి. రంగాగారు తన రైతుకూలీప్రజారాజ్య సూత్రం గాంధీగారి రామరాజ్యానికి ఏలా అనుగుణ్యంగా వుందో విశదీకరించారు. ప్రజల వుత్సాహం మిన్ను ముట్టినది. రంగాగారికి జై; ప్రకాశంపంతులు గారికీజై అంటూ వుంటే పక్కన వుండే కొండ ప్రతిధ్వనించెను. మైకు చక్కగా పనిచేసినది. బాలభటులు చకచకమని చేశిన కృషి ప్రశంస నీయము. ఒక్క సమయంలో 12,000 మంది వరకూ సభామంటపంలో వుండిరి. ప్రకాశం పంతులుగారు అన్ని విధాలా యీ గడ్డుకాలం దాటేవరకూ అందరూ ఒక్క వుమ్మడిగా పని చేయాలన్నారు. ప్రజల్లో వుత్సాహాన్ని కలి గించింది.

సమితి—కమ్యూనిస్టు పలుకుబడి గల పురవ కొండలో యీలాంటి మహాసభ అజేయంగా జరిగిందంటే దానికి ఒక్కటే కారణం. పైగా ఎన్నిమార్పులు వచ్చినా ప్రజల హృదయాలలో జాతీయకాంగ్రెసునాయకులయందూ, గాంధీ మహాత్మునియందూ అచంచలమైన భక్తి వున్న దని రుజువైంది.

ఆరాత్రి నాయకులందరూ వెళ్లిరి. బస్సు స్టాండులో హోటల్ లో అదే మాటే. తప్పని సరిగా మనప్రభుత్వం, దానికి సహకారం చేయాలి. కంట్రోల్సు ధాన్యసేకరణకు తోడ్ప డాలి. పురవకొండ సమావేశం ప్రజల్లో వుండే స్తబ్ధతను పోగొట్టింది. సక్రమమైన మార్గాన్ని చూపింది.

ఒక డెలిగేటు


"దేవకన్యా - రాజకుమారుడు" - కథ

(14 వ పేజీ తరువాయి)

సంగతులు ఏమిటి?' అని అడిగాడు. 'నాయనా' యీ వూరిలో ఒక రాజు వున్నాడు. ఆయనకు యిద్దరు కొడు కులు వుండిరి. వారిలో చిన్నకొడుకు దేశయాత్ర వెళ్లినాడు. వెళ్లిన కొంత కాలమునకు శత్రురాజులు రాజుమీద యుద్ధము చేసి రాజుని ఓడించినారు. ఆ చిన్నకొడుకు ఎక్కడ వున్నాడో గదా ? అతని తల్లితండ్రులు పుల్లలు అమ్ముకొని యీ వూరిలోనే జీవించు చున్నారు' అని చెప్పెను. రాజకుమా రుడు అక్కడనుంచి బయలుదేరి ఒక కాళీస్థలములో తన దగ్గర యున్న వెంట్రుకనుదులిపెను. దులిపిన వెంటనే దేవకన్యక వచ్చెను. 'ప్రేయసీ' ఒకపెద్ద మేడ కావలెను' అని రాజకుమారుడు అనెను. దేవకన్యక మంత్రముచేత ఒక పెద్దమేడ సృష్టించెను. మరునాడు వూరిలోవారందరును ఆశ్చర్య పోయిరి. నిన్నటిరోజున చూస్తే లేదు. యీ రోజున చూస్తే వున్నది అని అందరు ఆ మేడవంక చూడసాగిరి. మరునాడు రాజకుమారుడు పదిమంది కూలీలను తన దగ్గర వుంచుకొనెను. వాళ్లతో 'మీరు ఏ పుల్లలు మోపు వచ్చినను, ఎంత ఖరీదు అయినను కొని మంట వేసేయండి' అని ఆజ్ఞాపించి నాడు. ఆలాగున ప్రతీరోజునా పుల్లలు తగులపెట్టుచుండిరి. ఒక రోజున తన తండ్రి, తల్లి, తన సోదరుడు పుల్లలు పట్టుకొని వచ్చిరి. అక్కడ వున్న కూలి వాళ్లతో 'యిక కొనవద్దు. వీరి ముగ్గు రుని లోపలకు తీసుకొని వెళ్లి, స్నానము చేయించి, మంచి వస్త్రములు యిచ్చి, భోజనముపెట్టుడు' అని చెప్పెను. తండ్రి, తల్లి, సోదరుడు ఆశ్చర్యపోయి చూస్తూ యున్నారు. రాజు, రాజకుమారుని ఆనవాలు పట్టలేదు. కూలీలు తీసుకు

వెళ్లి స్నానము చేయించి తెల్లబట్టలు యిచ్చిరి. వంట కోమట్లు అన్నము వడ్డించిరి. వారు అందఱును భోజనము చేసిరి. రాజుగారు రాజకుమారుని 'మీది ఏవూరు? మీరు ఎవరి కుమారులు?' అని అడిగిరి. రాజకుమారుడు తన వృత్తాంతము అంతా చెప్పి, తండ్రి వృత్తాంతము అంతా తెలిసికొని ఆఖరకు 'నేను మీ రెండవ కుమారుడను' అని చెప్పినాడు. తండ్రి, తల్లి అతనిని కౌగలించుకొనిరి. మరునాడు తన సోదరునకు పెండ్లి సంబంధము కుదిర్చి ముహూర్తము పెట్టించి శుభలేఖలలో 'మీరు యీ పెండ్లికి రాకపోయినట్లయితే మీకును మాకును యుద్ధము జరుగును' అని వ్రాసి ప్రతీ రాజులకు పంపించెను. రాజులు అందఱు కలసి యితనిని పట్టవలయును అనుకొని అందఱు రాజులును బయలుదేఱిరి. రాజకుమారుడు శత్రురాజుల యెదుటకు వచ్చి తాడన్నా అని అన్నాడు. వెంటనే విచిత్రముగా కట్టివేసినది. దుడ్డన్నా అని అన్నాడు. ఒక్కొక్కరిని చావబాదివేసినది. అన్నగారి పెండ్లి ఆటంకము లేకుండా అయినది. రాజకుమారుడు లేనప్పుడు తండ్రి మీద యుద్ధముచేసి రాజ్యము తీసుకొన్న శత్రువులకు కబురుపంపెను. అది ఏమిటి అంటే?—"ఓ రాజాధిరాజుల్లారా" అప్పుడు సాగినట్టు యిప్పుడు సాగదు. మీకు బలము ఉన్నట్టయితే రేపువుదయముననే రండు. లేకపోయినట్లయితే, మా రాజ్యము మాకు యిచ్చివేసి తప్పుఅని చెప్పి వెళ్లిపొండు' అని కబురు పంపినాడు. మరునాడు వుదయముననే శత్రురాజులు అందఱును వుద్రేకముతో పండ్లు పటపట కొఱుకుచు వచ్చిరి. ఆపట్టణము పొలిమేరలో వుండి రాజకుమారునకు కబురులు పంపించిరి. రాజకుమారుడు వట్టిచేతులతో వెళ్లి 'రండి' అన్నాడు. అందఱు ఒక్కసారిగా కత్తులు ఎత్తి రాజకుమారునిమీదకు విసరబోయిరి. రాజకుమారుడు తాడన్నా అని అన్నాడు. శత్రురాజులచేతులలో వున్న కత్తులతో సహా కట్టివేసినది. రాజకుమారుడు దుడ్డన్నా అని అన్నాడు. వెంటనే అది చచ్చేవరకు కొట్టివేసినది. రాజకుమారుడు తనరాజ్యము ఆక్రమించుకొని, యింటికి బయలుదేరినాడు. ఆ రోజున పట్టణమంతా జయభేరీలు, జయధ్వనులు మ్రోగుచుండెను. రాజకుమారుని తండ్రికి ముసలితనము వచ్చుటచే తన సోదరునకు పట్టముకట్టెను. రాజకుమారుడు కొన్ని రోజులు పోయిన తరువాత దేవకన్యకను పెండ్లిచేసుకొనెను. ఆరాజు భార్యలతో, కొడుకులతో, కోడళ్లతో హాయిగా, రాజ్యములో వుండెను. కథలోని రాజకుమారుడు రాజ్యము ఏలుచున్నాడు. మన ఇల్లు మన ఏలుచున్నాము.

———



సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇండియన్ మెడిసిన్ ఎన్నికలు

అయ్యా,

సుమారు 9 సం॥ అనంతరం తిరిగి సెంట్రల్ బోర్డు ఎన్నికలు జరుపుటకు ప్రభుత్వమువారు నిశ్చయించినందులకు కృతజ్ఞత తెలుపవలసియున్నది. ఈ 9 సంవత్సరములనుంచి సెంట్రల్ బోర్డువారు ఆయుర్వేదాభివృద్ధికరములైన ప్రణాళికలుగాని, శాస్త్రీయపరిశోధనలు జరుపుటకు తగిన పరిశోధనాలయముగాని ఏర్పాటు చేసియున్నట్లయితే వీరు ఆయుర్వేదానికి చేసిన సేవ అపారమని చెప్పవలసియుండెడిది. కాని ఇంతవరకు అటువంటిది ఏదియు జరిగియుండలేదని నా అభిప్రాయము. దీనికితోడు ఆయుర్వేదాభివృద్ధికి ప్రభుత్వమువారు ఏమియు దోహదమిచ్చియుండలేదు.

శ్రీమతి ఆచంట రుక్మిణమ్మగారు ఆరోగ్యశాఖామంత్రిణిగా యుండియుండగా ఆయుర్వేదాభివృద్ధికరములైన కొన్ని ప్రణాళికలును, ప్రాంతీయభాషాఆయుర్వేదకళాశాలలను నాల్గింటిని స్థాపించ నిశ్చయించినట్లును అందరకు తెలిసిన విషయమే. కాని ఆమె మంత్రిపదవి నుండి తొలగిపోగానే ఆ ప్రణాళికను యిప్పటి ప్రభుత్వము ఏమిచేసినదియు తెలియదు. ఆయుర్వేదం అభివృద్ధి కావలయునన్న ఆయుర్వేదాభిరుచి కలిగినవారుగాని, ఆయుర్వేద వైద్యులలో నుంచి యెన్నికయైన శాసనసభ్యుడు మంత్రిగాగాని ఉండవలెను—రానున్న రాష్ట్ర ఎన్నికలు వయోజన ఓటింగుపద్ధతిని 1950 సం॥న జరుగనున్నట్లు తెలియుచున్నది. వైద్యులందరు యిప్పటినుంచి తగిన కృషి సల్పెదరని ఆశించుచున్నాను.

ఇకనైనను వైద్యులలోనున్న వ్యక్తిగత భేదాభిప్రాయములను విడనాడి రానున్న సెంట్రల్ బోర్డు ఎన్నికలకు సరియైన వైద్యసోదరులను సభ్యులుగా నిల్పి వారు గెల్పొందుటకు మన మందరము కృషిచేయవలసియుండును. వైద్యసంఘములవారు వెంటనే సమావేశమై ఎవరిని సెంట్రల్ బోర్డుకు సభ్యునిగా నిల్పిన బాగుండునో నిర్ణయించుటకు వెంటనే సమావేశము కావలయునని కోరుచున్నాను.

ఇంతవరకు "ఏ" క్లాసు, "బి" క్లాసు పద్ధతి ననుసరించి 12927 మందిని సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇండియన్ మెడిసన్ వారు రిజష్టరు చేసిరి. ఇందులో 1094 మంది ఏక్లాసువారు (అనగా గవర్నమెంటువారిచే ఏర్పాటుచేయబడిన బోర్డ ఆఫ్ ఎగ్జామినర్సుచే యివ్వబడిన పట్టములు పొందినవారు (H.P. I. M. & L. I. M.లు). సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇండియన్ మెడిసిన్ వారిచే రికగ్నైజు చేయబడిన ఆయుర్వేద కళాశాలలయందు పనిచేయు ఉపాధ్యాయులు, ఆ కళాశాలయందు ఉత్తీర్ణులైన పట్టభద్రులు కలసి 368 మంది. 10 సంవత్సరముల అనుభవముమీద రిజిష్టరైనవారు 11,465 మంది. మొత్తము 12,927 గురు.

'బి' క్లాసు వైద్యులకు ప్రాతినిధ్యమున ప్రభుత్వమువారు చేసిన అన్యాయము.

ది. 4-1-49 వ తేదీన గెజెటునందు ప్రకటించిన 21-12-48 వ తేదీ నెం. 4313 పి. హెచ్. జీ. ఓ. ననుసరించి రాబోవు సెంట్రల్ బోర్డు ఎన్నికలకు యీ దిగువరీతిని ప్రభుత్వమువారు ప్రాతినిధ్యమొసగిరి.

1. 8 స్థానములు—గవర్నమెంటు వారిచే ఏర్పాటుచేయబడిన బోర్డు ఆఫ్ ఎగ్జామినర్సు వారిచే యివ్వబడిన పట్టములు పొందినవారి నుండి (ఎల్. ఐ. ఎమ్. మొదలగువారు)

2. 1 స్థానము గవర్నమెంటు ఇండియన్ మెడిసిన్ వారి ఉపాధ్యాయ వర్గములనుంచి. (H. P. I. M. మొదలగువారు)

(పై తొమ్మిది స్థానములు 1094 మంది రిజిష్టర్డ ఏ క్లాసు వైద్యులకు)

3. 1 స్థానము గవర్నమెంటువారిచే రికగ్నైజు చేయబడిన ఆయుర్వేద కళాశాల ఉపాధ్యాయ వర్గమునుండి.

4. 1 స్థానము గవర్నమెంటు వారిచే రికగ్నైజు చేయబడిన ఆయుర్వేద కళాశాలా పట్టభద్రులకు

(2 స్థానములు కళాశాలా పట్టభద్రులు ఉపాధ్యాయ వర్గమువారికి—వీరు 368 మంది.)

5. 12 స్థానములు రిజిష్టరుపొందిన బి క్లాసు వైద్యులకు. వీరు రాష్ట్రీయ మొత్తముమీద 11,465 మంది. 25 జిల్లాలమీద 12 నియోజకవర్గములుగా విభాగించిరి.

6. 3 స్థానములు గవర్నమెంటువారిచే నామినేటు చేయుదురు. ఏ క్లాసు వైద్యులు బి క్లాసువారికి యిచ్చిన 12 స్థానములకు కూడా పోటీ చేయవచ్చును అని నిర్ణయించినట్లు చెప్పుచున్నారు అది ఎంతవరకు నిజమో తెలియదు.

(బి. క్లాసు నియోజకవర్గముల వివరము. 1. విశాఖపట్నంజిల్లా, 2. తూర్పు గోదావరి జిల్లా, 3. పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలు 4. గుంటూరు, 5. కర్నూలు, బళ్లారి, అనంతపురం, కడపజిల్లాలు 6. నెల్లూరు, చిత్తూరు, నార్తు ఆర్కాటుజిల్లాలు, 7. సౌత్ ఆర్కాటు, చెంగల్ పట్, మద్రాసు. 8. తంజావూరు, 9 సేలం, కోయంబత్తూరు, నీలగిరిజిల్లాలు, 10. మలబారు, సౌతుకెనరా, 11. తిరుచినాపల్లి, మధుర, 12 తిరువనల్వేలి, రామనాడు

పై పద్ధతిని ప్రభుత్వమువారు రానున్న సెంట్రల్ బోర్డు ఆఫ్ యిండియన్ మెడిసిన్ కు 26 స్థానములు ఏర్పాటు చేసిరి. దీనివలన పూర్తిగా ఆయుర్వేదవైద్యులకు సెంట్రల్ బోర్డునందు తగు ప్రాతినిధ్యము లేనందున శుద్ధాయుర్వేదమునకు తీరని నష్టము కలుగుటకు ఎట్టి సందేహము లేదు 1094 మందిగల ఏక్లాసువైద్యులకు 9 స్థానములు, 11465 మందిగల బి క్లాసు వైద్యులకు 12 స్థానములును. ఇది చాలా అన్యాయము. రాష్ట్రీయ మొత్తము మీద 25 జిల్లాలు కలవు. అన్ని జిల్లాలకు కలిపి 12 నియోజక స్థానములు ఏర్పాటుచేసినారు. జిల్లావారీగా జిల్లాకు ఒక్కొక్క ప్రతినిధి చొప్పున 25 స్థానములు ఇచ్చిన కొంత న్యాయముగా యుండెడిది తతిమా జిల్లాలవారికి అన్యాయముకూడా యుండెడిదికాదు. కావున ప్రభుత్వమువారు వెంటనే "బి" క్లాసు ఆయుర్వేద వైద్యులకు అన్యాయముచేయక శుద్ధాయుర్వేదాభివృద్ధికి దోహదమిచ్చెదరనియు, 12కు బదులు, 25 స్థానములు యిచ్చెదరనియు ఆశించుచున్నాను. ఈ విషయమై "బి" క్లాసు రిజష్టర్డ ఆయుర్వేద వైద్యులు సమావేశమై ప్రభుత్వమువారివద్దకు రాయబారము వెళ్ళు విషయమై ఏర్పాట్లు చేయగలందులకు కోరుచున్నాను.

ఎన్నికల ప్రణాళిక

20-12-48 వ తేదీని సెంట్రల్ బోర్డు వారు సమావేశమై ఎన్నికల యీదిగువ కార్యక్రమము నిర్ణయించిరి.

1. 25-1-49 తేదీన వివిధనియోజకవర్గముల చిత్తు జాబితాలు ఫోర్టుసెంటుజార్జి గెజిటునందు ప్రకటించెదరు.

2. 14-2-49 తేదీలోగా సెంట్రాల్ బోర్డు ప్రెసిడెంటుగారికి చిత్తుజాబితాలోని సవరణలు రావలెను.

3. 22-2-49 తేదీన గెజిటునందు వివిధనియోజకవర్గములయొక్క నికరజాబితాలు ప్రకటింపబడును.

4. 9-3-49 వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోగా ఇండియన్ మెడికల్ కాలేజి ప్రిన్సిపాలుగారికి అభ్యర్థులనామినేషనులు దాఖలు చేయవలెను.

5. 10-3-49 తేదీ మధ్యాహ్నం 2 గంటలకు యిండియన్ మెడికలుకాలేజి ప్రిన్సిపాల్ గారి ఆఫీసులో నామినేషను పత్రముల పరిశీలన జరుగును.

6. 17-3-49 వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోగా అభ్యర్థులు నామినేషను పత్రముల ఉపసంహరించుకొనుట.

7. 22-3-49 వ తేది గెజిటులో ఎన్నికలకు నిలబడినవారి పేర్లు ప్రకటింపబడును.

8. 30-4-49 న వోటింగు, డిక్లరేషను ఫారములు ఓటర్లకు పంపవలసినది.

9. 12-5-49 ఉదయం 11 గం. నుండి సాయం. 4 గం. వరకు పోలింగు.

10. 13-5-49 తేదీ ఉదయం, 8 గంటలనుండి పూర్తి అగువరకు ఓట్లకాగితములు పరిశీలన లెక్కపెట్టుట.

11 24-5-49 తేదీ గెజిటులో విజయమొందినవారి పేర్లను ప్రకటించుట.

14-12-48 వ తేదీన గెజెటునందు అన్ని నియోజకవర్గములకు సంబంధించిన రిజష్టర్డు ఆయుర్వేదవైద్యుల లిస్టు ప్రకటింపబడినది. అందు అడ్రస్సులు సరిగా లేవు. వైద్యులు గమనించి వెంటనే బోర్డుకు తెలపండి: ఇది చిత్తు లిస్టో, లేక సరియైన లిస్టో తెలియదు. రు 5-8-0 వెల యనికూడా నిర్ణయించిరి.

కంభంమెట్టు విష్ణువర్ధనరావు,
విజయవాడ.

———

"సోమవారాలు సెలవు"

అయ్యా,

అమరబాపుజీ ఆధ్యాత్మిక అన్వేషణకై, మహాకార్యసాధనకై ఆత్మశక్తి లబ్ధికై వారానికొక రోజు విశ్రాంతి అనే పేరుతో మౌనవ్రతదీక్ష పూనేవాడు. ఆరోజున మిన్ను విరిగి మీద పడ్డా తన దీక్షను మానేవాడు కాదు.

ఆరోజు 'సోమవారము'. దీనికి సంస్కృత పదము ఇందువాసరము. ఇందు - సోముడు, అనగా చంద్రుడు, దీనినే ఇస్లామీ భాషలో 'చాంద్' అని అంటారు. చంద్రుడు, చాంద్; కేవలము సిరికి తోబుట్టువే కాక, లోకోపకారి. ఇట్టి లోకోపకారి నామాంకితదినము, భారతదేశోపకారియగు బాపుజీకి దీక్షాదినము, విశ్రాంతి రోజు.

యిప్పుడు భారతదేశము ఆంగ్లయుగం నుంచి దూరమైంది. జాతీయయుగము ప్రారంభమైంది. సంస్థానాలుకూడా యిదే పద్ధతిని అవలంబించి జాతీయ (ప్రజా) ప్రభుత్వాలచే పాలింపబడుతున్నవి. స్వప్రభుత్వము పరిపాలన యంత్రాన్ని నడుపుతున్నది. కాబట్టి పరాన్ని వదలి, స్వీయాన్ని స్వీకరించటం అవసరము. అది బాపూజీ స్మృతిద్వారా జరుగుతుంది.

భారత ప్రభుత్వము, ప్రజానీకము అనుకరణను అంతరింపచేసి అమరజీవుడైన బాపుజీని పునఃపునః స్మృతిపథానికి తేవటానికి బాపుజీకి ప్రీతికరమైన సోమవారాన్ని, ఆది, శుక్రవారాలకు బదులు శెలవు దినముగా ఏర్పాటుచేసి తనతోపాటు, సంస్థానాలలో కూడా అట్లే ఆచరణ చేయిస్తే ప్రభుత్వము తనయొక్కయు, తన జాతియొక్కయు విధిని బాపుజీపట్ల సరిగా నిర్వహించిన దనవచ్చును.

యీ పై సూచన మతాచార ధిక్కరణగా భావింపబడవచ్చును. గాని ప్రతి భారతీయుడును, తాను తొలుత భారతీయుడననియును, పిదప మతవాదియనియును గ్రహింపనగును.

యీ సూచన భారత ప్రభుత్వము, ప్రజానీకము, పర్యవేక్షణచేసి అంగీకరించునని ఆశింపబడుచున్నది.

మాదిరాజు వెంకటసుబ్బారావు.

———

మహాకవి ధూర్జటి

(19 వ పేజీ తరువాయి)

బిల్వపత్రంతో పూజించి, మోక్షం పొంద వచ్చుగదా! ఈ మూఢులంతా, పప్పులూ - ప్రసాదాలూ - పెట్టి, చచ్చుదేవుళ్లని ప్రార్థిస్తారేమా!" అని విస్తుపోతున్నాడు ధూర్జటి. "శివభక్తునకు వజ్రాయుధం పుష్పసమం - అగ్ని చల్లగా ఉంటుంది-శత్రువు మిత్రుడవుతాడు - విషము అమృత మవుతుంది - శివనామం సర్వశుభ్యకరం-" అని ఘంటాపథంగా చాటుతున్నా డీ మహాభక్తుడు.

"శ్రీవిద్యుత్కలితాజవంజవమహా
జీమూతపాపాంబుధా
రావేగంబున మన్మనోబ్జసముదీ
ర్ణత్వంబు గోల్పోయితిన్
దేవా! మీకరుణాశరత్సమయ మిం
తే జాలు జిద్భావనా
సేవం దామరతంపరై మనియెదన్
శ్రీకాళహస్తీశ్వరా!"

మిసమిసలాడే యౌవనపుకసురులో - పచ్చి పొగరులో - పొంగుతూన్న భావావేశాన్ని అణచలేక, విశృంఖలంగా స్వైరవిహారంచేశాడు ధూర్జటి. ఉద్రేకం అణిగింది. పొంగు క్రుంగింది. మనస్సు వెనక్కుమళ్ళింది. చూచుకున్నాడు తన గతకాలపు చరిత్ర. సిగ్గుపడ్డాడు పాపం! ఆహాన్ని త్యజించాడు. నిండు హృదయంతో శ్రీకాళహస్తీశ్వరునికి ఆత్మనివేదనం చేసుకున్నాడు. శతకంలో సగానికి పైగా, ఇతని హృదయ నైవేద్యమే కనబడుతోంది. కాళహస్తీశ్వరుడు తండ్రి; తాను కుమారుడు. ఇదీ ఇతని భావన. "వ్యసనాల్లో మునిగిన నేను నిన్ను తలచకపోయినంతమాత్రాన నన్ను వదలడం భావ్యమా ప్రభూ! అటతమకంలో పిల్లవాడు బావిలో పడితే తండ్రి ఊరుకుంటాడా ప్రభూ! ధూర్జటీ! నేను నీపేరటివాణ్ణే! నీ ప్రసాదాన్ని అనుభవించి పెరిగినవాణ్ణే! నీవు దక్క అన్యులెవరయా నన్ను రక్షించుటకు సమర్థులు?" అని ప్రార్థిస్తున్నాడు. నిర్వికారమూ- నిరంజనమూ - నిర్వికల్పమూ - నిర్గుణమూ - సగుణమూ - గుణాతీతమూ - అయిన పరతత్త్వ స్వరూప స్వభావ భావన తనకు శక్యం కాదని తెలియక పోలేదు.

"నీరూపంబు దలంపగా దుద మొద
ల్కానగ నీవైనచో
రారా రమ్మని యంచు జెప్పవు వృథా
రంభంబు లిం కేటికిన్
నీర న్మంపుము పాల ముంపు మిక నీ
న్నే నమ్మినాడం జుమీ!"

అని తన భారాన్నంతా పరమాత్మమీద వదిలాడు. మరి, నీకవిత్వ మెందుకయ్యా అంటే, అది నాజిహ్వకు నైసర్గికకృత్య మన్నాడు.

'ఈ శతకం ఒక చక్కటికావ్యం. శతకం కావ్యమవుతుందా? అన్న పూర్వపక్షం రావచ్చు. ఎందుకు కాగూడదో చూద్దాం. శతకశబ్దయోగికార్థం శతసంఖ్యాసముచ్చయమని. అట్టార్థం శతపద్యయుక్తమైన గ్రంథం. కొద్దీ - గొప్పా - కొసర్లున్నా, సామాన్యంగా నూరు పద్యాలుంటై శతకంలో. కావ్యంలో ఉండవలసిన గ్రంథసంఖ్య 'ఇంత' అని ఎక్కడా నిర్ణీతం కాలేదు. "వాక్యం రసాత్మకం కావ్య" మ్మన్నారు కోవిదులు. కాగా, 'ఈ శతకానికి కావ్యలక్షణాలు ఎంతవరకు పట్టినాయి' అనే విషయమే ఇక్కడ చర్చనీయాంశం. "కావ్యం ప్రధానంగా ఏకనాయకాశ్రయం కావాలి. అంగిరసం ఒకటి ఉండాలి. అంగరసాలు ప్రధాన రసపరిపోషకాలుగా ఉండాలి. నాయకుడు కావ్యఫలభోక్తకావాలి." ఇవీ ప్రధానంగా మన ఆలంకారికులు నిర్ణయించిన కావ్యలక్షణాలు. "విశ్వశ్రేయః కావ్య" మ్మని అభియుక్తోక్తి గనుక, కాంతాసమ్మితమైన ధర్మబోధకూడా స్ఫురించాలని కొందరు శిష్టుల అభిప్రాయం. ఈ శతకంలో ప్రధానరసం శాంతం. ఏతద్రసస్థాయీభావమైన నిర్వేదం శతకంలో అంతటా నిండి తొణికిసలాడుతోంది. ఇంతవరకూ పైన మేము చేసిన చర్చ అంతా, ఈ మా అభిప్రాయానికి పరిపోషకం. అంగరసం హాస్యం.

శతకంలో అక్కడక్కడా చక్కని హాస్యం చిలికించాడు ధూర్జటి. భక్తుడు భగవంతుణ్ణి పరిహసిస్తున్నాడు. "శివా! నీకు నిజంగా మాంసం కావలిసివస్తే, నీదగ్గర జింకపిల్ల లేదూ? నెత్తిన గంగమ్మ - నొసట నిప్పు - ఓ చేతులో కపాలం - మరో చేతిలో కుఠారం - ఇంకేమయ్యా! జింకను చంపి, పాకం చెయ్యచ్చుగదా! అయ్యయ్యో! ఆ బోయవాడి యెంగిలి మాంసమే కావల్సివచ్చిందా నీకు?" ఎంత మృదువైన పరిహాసం! బ్రహ్మంతటివాణ్ణి గులాము చేశా డితడు - "వేధన్ తిట్టగరాదుగాని భువిలో విద్వాంసుల న్జేయ నేలా, ధీచాతురి జేసె, చేసిన గులామూ" అని చదివేసరికి పక్కున నవ్వు వస్తుంది. ఒకచోట శివుణ్ణి రెండు షరతులు అడుగుతాడు. "తనువే నిత్యముగా నొనర్పుము, అదిలేదా చచ్చి జన్మింపకుండ నుపాయం బొనరింపు" ఈరెండూ చాతగాకపోతే నాకిప్పుడే చెప్పేశెయ్ బాబూ! నాదోవనే జూసుకుంటాను" అని దబాయిస్తాడు. మరొకచోట - "మొదలన్ భక్తుల కిచ్చినాడవుగదా మోక్షంబు నేడేమయా మదియంగా ముదియంగ బుట్టె ఘనమౌ మోహంబు లోభంబు" అని ఆక్షేపిస్తాడు. శివుడికి పెద్దతనం వచ్చి, బుద్ధి పెడతల బట్టిందని ఇతని వూహ. రసికులకు సున్నితమూ లలితమధురమూ అయిన హాస్యం లభిస్తోంది పై పద్యాల్లో. నిందాస్తుతిగర్భితమైన ఈ హాస్యం ధూర్జటి హృదయ సారళ్యాన్ని వ్యక్తంచేస్తూ, స్థాయీభావమైన నిర్వేదానికి పరిపోషకంగా వుంది. ఈ కావ్యానికి నాయకుడు ధూర్జటి. కవి ప్రత్యక్షంగా తన అనుభవాలను వివరించడంలో వ్యంగ్యంగా అనుభవవేదాంతబోధ చేస్తున్నాడు. పైన పేర్కొన్నలక్షణాలు ఇందులో కనబడుతున్నై కాబట్టి ఇది కావ్యం.

ఇంతవరకూ ప్రాచ్యలక్షణానుసారంగా శతకపు కావ్యత్వం నిరూపిత మైంది. ఇక వైదేశికమూ - నవ్యాంధ్రకవితాలక్షణమూ - అయిన లక్షణానికిలక్ష్యంగా ఇది ఎంతవరకు నిలుస్తుందో పరిశీలిద్దాం. నవ్యాంధ్ర కవిత భావకవిత. ఈ శబ్దంమీద అప్పట్లో ఎంత గాలి దుమారం రేగినా, ఇప్పటికి ఇది *Lyrical poetry* అనే ఇంగ్లీషు పదానికి సమానార్థకంగా రూఢమైంది. ఈ పదానికి ఆంగ్లలాక్షణికులు ఇచ్చిన వివరణాలు చూద్దాం.

"Hegel insists that it is the personal thought or passion or inspiration which gives its character to lyrical poetry while the metrical form also counts."

"The lyrical has the function of revealing in terms of pure art, the secrets of inner life, its hopes, its fantastic jogs, its sorrows, its delerium"

'కవికికేవలమూ ఆంతరంగికాలైన అనుభూతి విశేషాలను గానయోగ్యమైన రీతిలో వర్ణించడమే భావకవిత." అని పై వాక్యాలసారం. ఇందులో కవే ఆలంబనవిభావం. ఆత్మాశ్రయమైన (Subjective) రసభావావేశమే దీనిలోని ప్రధానలక్షణం. శతకంలోని అంగిరసమైన శాంతానికి ఆలంబనవిభావం ధూర్జటి. ఇందులో అతని ఆంతరంగిక అనుభూతి విశేషాలే - ఆత్మాశ్రయాలైన రసభావావేశాలే—స్థాయినంది, రసస్వరూపం తాల్చినై. ఇక, 'గాన' యోగ్యత ఇతని కవిత్వానికేగాక, అసలు ఆంధ్ర కవిత్వానికే ప్రధానగుణం కాబట్టి ఈ లక్షణాన్ని అనుసరించికూడా శతకం కావ్యమౌతోంది. కావ్యఫలం నాయకుడు అనుభవించాలిగదా? ధూర్జటి అనుభవించిన ఫల మేమిటి? అనేదే మిగిలిన ప్రశ్న. సువర్ణముఖీతరంలోని రమ్యమైన మామిడితోటల్లో లేమావిగున్నల శీతలచ్ఛాయల్లో - పద్మాసీనుడై, సవికల్ప సమాధిలో - సగుణబ్రహ్మోపాసనలో - బ్రహ్మానంద మనుభవించడమే ధూర్జటి ఉద్దేశించిన - అనుభవించిన - కావ్యఫలం.

శతకం హృదయనైవేద్యం గనక, భావావేశం క్రేక్కిరుకుతోంది. ప్రసాదగుణశోభితమూ - ద్రాక్షాపాకమధురమూ - అయిన ఈ రచన చక్కని శయ్యాసౌభాగ్యాన్ని అలవరించుకొంది. శతకమంతా ఇందుకు లక్ష్యంగానే వున్నా, మచ్చుకు రెండు పద్యాలు—

"నిన్ను న్నమ్మినరీతి నమ్మ నొరులన్
నీకన్న నా కెన్నతే
రన్న ల్దమ్ములు తల్లిదండ్రులు గురుం
డాపత్సహాయుండు నా
యన్నా! యెన్నడు నన్ను సంసృతివిషా
దాంభోధి దాటించి య
చ్ఛిన్నానందసుఖాబ్ధి దేల్చెదొకదే
శ్రీకాళహస్తీశ్వరా!"

"పాలుం బువ్వయు బెట్టెదం గుడువరా
పాపన్న రా యన్న తే
లేలె మ్మన్న, నరంటిపండ్లు గొనితే
లేకున్న నే నొల్ల, నం
చే లాలింపరే తల్లిదండ్రు లపు డ
ప్లే తెచ్చి వాత్సల్యల
క్ష్మీలీలావచనంబులం గుడుపరా
శ్రీకాళహస్తీశ్వరా!"

అక్కడక్కడా తీయని తెలుగుపలుకుబళ్ళు కనబడతై. "నీచి త్తంబు - నా భాగ్యము" "నీర న్ముంపుము - పాల ముంపుము" "ముంగిలి వారణాశి - కడుపే కైలాసశైలంబు" "నియమం బెంతో ఫలంబు నంతియ" "పిండెంతో యంతియు కా దళంబు".

లలితలోకోక్తి మధురమూ - మత్తేభగమన మోహనమూ - అయిన ఈ కావ్యానిక రసిక జనుల్ని ఆహ్లాదపరుస్తోంది. భావభేదంలో శార్దూలచంక్రమణత్వసుందరమూ - అనుభవ వేదాంతసారమూ - అయిన ఈ శతకం, లోకజ్ఞులనూ - నీతిపిపాసువులనూ - తృప్తిపరుస్తోంది. తన ఆత్మనివేదనాన్ని ఇలా ఉభయతారకంగా వెలయించిన ధూర్జటిమహాకవి పరమ ధన్యుడు.

ఆద్యంతాలు

(6 వ పేజీ తరువాయి)

పడుతూంటాను - ఆకలి వేసినప్పుడు ఏంపని చేస్తామో ఎవ్వరికీ తెలియదు.

రంగారావుకి ఈ ప్రపంచంలో నా అన్నవారెవరూ లేరేమో! అటువంటప్పుడు జీవితం ఎంత దుర్భరంగా ఉంటుందో ఆలోచించండి! ఆ జైల్లో వా డెంత బాధపడుతున్నాడో!"

"ఐతే అనంతం మాట?"

"మా గురించి మే మసలు తల్చుకోము - ఎందుకో ఆ ఆలోచనవస్తే హడలిపోతూంటాము."

"రంగారావు విచారణగురించి, నీకు అనంతం చెప్పలే దన్నమాట?"

"ఏమిటి! విచారణా! అది వినే అనుకుంటాను, రాత్రంతా ఆయన మతి చెడినట్లు పలవరించారు. ఈవేళ పొద్దున్నకూడా చాలా పెందరాళే లేచారు. ఐతే విచారణైపోయిందా?"

"ఆఁ! ఐంది!"

"తీర్పు?"

"ఉరిశిక్ష!"

విశాలాక్షి నోటమాట లేకుండా కొయ్యైపోయి నేలమీద పడిపోయింది. నీలకంఠం కాస్త ఉపచారంచేసి—

"విశాలాక్షీ! ఇంత కంగారు పడితే ఏం లాభం లేదు. నేను చెప్పేది విను. అనంతం నీకు కావాలంటే, నీవు నాకు సాయం చెయ్యాలి. ఆ దౌర్భాగ్యుడికి ఉరిశిక్ష తప్పించే పూచీ నాది! ఈలోపుగా అనంతంమాత్రం పోలీసులకి 'నేనే దోషి'నని లొంగిపోకుండా చూడాలి... ఏమిటి! అట్లా వెర్రిచూపులు చూస్తే లాభం లేదు! నేను చెప్పింది తెలిసిందా?"

"తెలిసింది. కాని ఈలోపుగానే అనంతం........"

నీలకంఠం ఆ మాట వినగానే గజగజ వణికిపోయాడు. ఆ నిమిషాన్నే పోలీసులొచ్చి గొడవ చేస్తారేమో అనుకున్నాడు.

"విశాలాక్షీ! నువ్వు నాకో వాగ్దానం చెయ్యాలి. వాణ్ణిమాత్రం బైటికి కదలనియ్యకుండా నీదగ్గిరే ఉంచుకోవాలి. ఏమంటావు?"

"ప్రయత్నిస్తాను!"

"సరే రేప్పొద్దున్న వస్తాను. అంతవరకూ అతణ్ణిమాత్రం కదలనియ్యకు"అంటూ నీలకంఠం మతి చెడినవానిలా వీథిలోకి పరుగెత్తాడు. ఎదురుగుండా అనంతం వస్తున్నాడు.

"ఏం అన్నయ్యా?"

"అనంతం! పత్రిక చూశావా?"

చూశా నన్నట్లు నిశ్చలమనస్సుతో అనంతం తల వూపాడు.

"వాణ్ణిమాత్రం వురి తియ్యరా! అది మాత్రం నిశ్చయము. ఆ కాగితాలన్నీ చూసి కేసుకొట్టిం చేయడానికి నాకు కాస్త వ్యవధి కావాలిరా!" అనంతం విశాలాక్షిని తీసుకుని పాండుచేరీ పారిపోతే వ్యవధి కల్గుతుందని, నీలకంఠం, తన తమ్మునికి చెప్పలేకపోయాడు.

"నువ్వు బైటకి వెళ్లనని వాగ్దానం చేస్తావా?"

"సరే అన్నయ్యా!"

కాని అనంతం చిరునవ్వు నవ్వాడు. నీలకంఠానికి ఆ నవ్వుఅర్థం తెలిసిందికాదు.

౯


నీలకంఠం మర్నాడు పొద్దున్న విశాలాక్షి గది తలుపు తట్టాడు. ఎవ్వరూ వచ్చి తలుపు తీయలేదు. అంతా నిశ్శబ్దంగా ఉంది. కిటికీలోంచి లోపలికి తొంగిమాస్తే వాళ్లిద్దరూ పడుకొని ఉన్నారు. తలుపు గట్టిగా తోసి లోపల ప్రవేశించాడు. బహుశా ఇద్దరూ తప్పతాగారేమో! నీలకంఠం జోళ్లు చప్పుడు చేసి, 'అనంతం!' అని పిలిచాడు. ఊహుఁ! మెలకువ లేదు. కదలిక లేదు. నీలకంఠం అనంతందగ్గిర కెళ్లి జబ్బ పట్టుకు గుంజాడు. కదలిక లేదు. ముక్కుదగ్గిర వేలుపెడితే శ్వాస తగల్లేదు. నాడి చూశాడు. ఊహు! ఆగిపోయింది ఇద్దరిలోనూ కూడా జీవుడులేడు. విశాలాక్షి కళ్లు మూతలు పడి వున్నాయి. అనంతం కళ్లుమాత్రం తెరచుకుని ఆ మెముఖంలోకి చూస్తున్నట్లున్నాయి. ఇద్దరి శిరస్సుల మీదా చేతులు వేసి తాకాడు. "ఎంత పనిచేశావురా అనంతం! ఒకరిని విడిచి ఒక రుండకుండా ఆఖరికి, మృత్యువుకి కూడా, మీ అవ్యాజప్రేమను తెలిపారు" దుప్పటీక్రింద ఒక ఉత్తరం పడివుంది! కవరుమీద, "దయచేసి ఈ ఉత్తరం పోలీసుల కిచ్చేయండి. అనంతం." అని వ్రాసివుంది. నీలకంఠం చకితు డయాడు. వెంటనే ఉత్తరంతీసి జేబులో పెట్టుకున్నాడు. నీలకంఠం తొందరగా బైటకెళ్లి పోయాడు. ఇంటికి,తిన్నగా వెళ్లి, వణికిపోతూన్న చేతులతో ఉత్తరం చింపి చదవడం మొదలెట్టాడు.

"నేను, అనంతాన్ని ఆత్మహత్య చేసుకోబోయే ముందు ఒక యథార్థం చెప్ప తల్చుకున్నాను. ఫకీర్ డీలేన్ హత్య గావించిన వాణ్ణి నేను. ఆ హత్య ఈ మోస్తరుగా జరిగింది" అని తదిసీళ్లన్నీ వ్రాశాక, చివర "మాకు నిజంగా చచ్చిపోవాలని లేదు కాని ఎడబాటు భరించలేము. పైగా ఒక నిర్దోషిని, ఉరితీతకు గురిచేయుడం చూసి నేను సహించలేను. మరో గత్యంతరం మాకు కనిపించడంలేదు. మామీద పంచాయతీ చేయద్దని ప్రార్థన. మేము, ఆబిల్లమీద ఉంచిన మందు పుచ్చుకుని చచ్చిపోయాము.

"ఒక్క కోరిక. మమ్మల్నిద్దర్నీ కలిపే ఒకచోట దహనం చేయండి."


నీలకంఠంతల తిరిగిపోయింది. "ఎంత పని అనంతం, చేశావురా అనంతం!" ఉత్తరం చేతిలోంచి జారి క్రిందపడింది. ఆ ఉత్తరంమీదే రంగారావు జీవితం ఆధారపడివుంది. పోలీసులకా ఉత్తరం ఇచ్చిననాడు రంగారావు రక్షింపబడతాడుకాని తన ఆబోరు పోతుందే! ఈ పెద్ద సమస్య నీలకంఠాన్ని పట్టుకు వేధించ ప్రారంభించింది. అంతేకాకుండా, ఈ ఉత్తరం బైటపడితే, తననికూడా అనుమానిస్తారేమో అనుకున్నాడు. "పాపనీ! ఆ భండాలుడు ఉరితీయబడతాడు! అంతేగా!"


నీలకంఠం, అనంతంఉత్తరానికి అగ్గిపుల్ల అంటించాడు. నుసిఅయిపోయింది. దాంతోపాటు ఆ రంగారావుప్రాణాలుకూడా బూడిదలో కలిసిపోయాయి. ఇంక భయంలేదు! తన పరువుమర్యాదలకోసం నీలకంఠం మూడు నిండుప్రాణాలను బలిదానం చేశాడు. అనంతంవంటి వ్యక్తులజీవితాలకి ఆద్యంతాలుండవు. అదే మొదటిసారి. అదే కడసారి!




ఆంధ్రా టెన్నిస్ ఛాంపియన్లు:—శ్రీ పిళ్లారిసెట్టి నారాయణరావు, వారి కుడిప్రక్క శ్రీ డి. మాధవరావుగార్లు. వీరు ఈ సంవత్సరం వరుసగా మూడు టూర్నమెంటులలో కప్పులు నెగ్గినారు. (1) సౌత్ ఇండియన్ ఛాంపియన్ షిప్పు గుంటూరు, (2) ఆలిండియా ఛాంపియన్ షిప్పు బొంబాయి, (3) వెస్టర్న్ ఇండియా ఛాంపియన్ షిప్పు బొంబాయి, మూడు టూర్నమెంటులలోనూ ఛాంపియన్లుగా ప్రసిద్ధికెక్కారు.

మద్రాసు బస్సు సమ్మెలో ప్రభుత్వానికి ప్రజల సహాయం







ప్రజాసేవార్థము కండక్టరులుగా పనిచేయ ముందుకువచ్చిన కాలేజీవిద్యార్థులు.



దర్వానీ నగర్‌లో ఇండియన్ టెలిఫోన్ ఇండస్ట్రీస్ ఫ్యాక్టరీని భారతప్రభుత్వ రవాణా మంత్రి గా॥ రఫీ అహ్మద్ ఖిద్వాయ్‌గారు సందర్శించినప్పటి చిత్రం.



డ్రైవర్లు, కండక్టర్లుగా రిక్రూట్ అయేందుకు వచ్చిన దరఖాస్తు దారులు.





గుత్తిపురమందు జరిగిన శ్రీ త్యాగరాజవార్షికోత్సవముల సందర్భమున తీసిన చిత్రములు : మద్రాసు విశ్వవిద్యాలయ సంగీతశాఖావిద్వాంసులగు శ్రీ పి. సాంబమూర్తిగారు ఉత్సవములలో పాల్గొనిరి

Regd. M. No. 4479

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press. 7, Thambu Chetty St., G. T. Madras.